
- పరుగులు పెడుతున్న ఆశావహులు
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల కోసం పోటీ
- రాష్ట్రస్థాయి పదవుల్లో జిల్లా నేతలకు చాన్స్
- ముందువరుసలో ఇన్‌చార్జిలు
- పరిశీలనలో సత్య, బాలాజీ పేర్లు
- రేసులో డాక్టర్ గరటయ్య, మరికొందరు
- జనసేన నుంచి రియాజ్ పేరు పరిశీలన
- టీడీపీ అధిష్ఠానం ముమ్మర కసరత్తు

నామినేటెడ్ టెన్షన్



నామినేటెడ్ పదవులు దక్కుతాయా.. దక్కితే తొలి విడతలోనే అవకాశం ఉంటుందా..? ఒకవేళ ఇచ్చినా ఇటు టీడీపీ, అటు జనసేనలో ఎవరి పేర్లు ఉంటాయి? ఇదీ ప్రస్తుతం జిల్లాలో రాజకీయంగా నెలకొన్న చర్చ. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో కూడా జిల్లాకు చెందిన కొందరు నాయకులకు అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి టీడీపీ పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా దామచర్ల సత్య, బాలాజీ తదితరుల పేర్లను పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. అలాగే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులపై కూడా ప్రత్యేక పరిశీలన చేస్తున్నారు. వీరుగాక మరికొందరు నాయకులు చేసుకున్న దరఖాస్తులను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. జనసేన వైపు నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల నియామకంపై దృష్టి సారించింది. ఆ మేరకు కొన్ని విధానాలను కూడా రూపొందించింది. నియోజకవర్గాల వారీ టీడీపీ, జనసేన, బీజేపీలకు ఏ నిష్పత్తిలో పదవులు కట్టబెట్టాలో నిర్ణయించి ఆపార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు సమాచారమిచ్చారు. మరోవైపు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల విషయంలో ఒక అవగాహనతో ముందుకు వెళ్లాలని కూటమి పార్టీలు నిర్ణయించుకున్నాయి. ఆ మేరకు పార్టీ శ్రేణులకు వీలైనంత త్వరగా ఆ పదవులు కట్టబెట్టి వారిని సంతృప్తిపరిచేందుకు టీడీపీ సిద్ధమైంది. అందులోభాగంగా రాష్ట్రస్థాయిలోని కొన్ని నామినేటెడ్ ఛైర్మన్ పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది.

రేసులో పలువురు సీనియర్లు

మరోవైపు సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య కూడా రేసులో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చినా బాపట్ల లోక్‌సభ ఎన్నికల కోఆర్డినేటర్‌గా సముచిత పాత్రను ఆయన పోషించారు. అయితే ఆయన తనకు కాకుండా తన కుమారుడు కృష్ణచైతన్యకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. పార్టీ పరిశీలనలో మాత్రం గరటయ్య పేరు ఉన్నట్లు సమాచారం. అలాగే కనిగిరి నియోజకవర్గం బొట్లగూడూరుకు చెందిన ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.జనార్దన్ కూడా నామినేటెడ్ పదవి రేసులో ఉన్నారు. చీరాలలో ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చిన పాలేటి రామారావు కూడా ఏదోస్థాయి పదవి కావాలని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర పేరును కూడా అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే టీడీపీలో ఎక్కువమంది నాయకులు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉన్న కీలక పదవులపైనే దృష్టి సారించడం విశేషం.

జనసేన నుంచి రియాజ్‌కు..

జనసేన కూడా తమ కోటాలో వచ్చే నామినేటెడ్ పదవుల్లో కనీసం ఒక్కటైనా జిల్లాలోని ఆ పార్టీ నాయకులకు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని పలువురు జనసేన నాయకుల పేర్లను పరిశీలనకు తీసుకున్నప్పటికీ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ పేరును ప్రధానంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే రెండు మంత్రి పదవులతోపాటు ఎమ్మెల్సీ పదవి కూడా కాపు సామాజికవర్గం వారికే జనసేన కేటాయించింది. అందువలన నామినేటెడ్ పదవుల విషయంలో ఇతర సామాజికవర్గం వారికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నట్లు తెలిసింది. జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవి కోసం రియాజ్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీ అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూడాల్సి ఉంది.

కీలక నేతలకు పదవులు

ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు ప్రతిపక్షంలో ఉండగా పార్టీలో కీలక భూమిక పోషించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యకు నామినేటెడ్ పదవి ఇవ్వటం ఖాయమని సమాచారం. రెండేళ్ల క్రితమే ఆయన ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని అడిగారు. కానీ అటు చంద్రబాబు, ఇటు లోకేష్‌లు ఆయన్ను వారించి పార్టీ సేవలో ఉండాలని కోరి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. అలాగే కొండపిలో స్వామిని గెలిపించే పని కూడా ఇచ్చారు. పార్టీ ఇచ్చిన అన్ని బాధ్యతల్లో సక్సెస్ రేటు ఎక్కువగా ఉన్న సత్యకు సముచిత పదవి కల్పించడం ఖాయమని తెలుస్తోంది. ఆయన్ను శాసనమండలికి పంపిస్తామనే హామీ కూడా అధిష్ఠానం ఇచ్చి ఉంది. అయితే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారా? లేక కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపిక చేస్తారా? అనే విషయంపై సందిగ్ధం కొనసాగుతున్నట్లు తెలిసింది. పార్టీ ఒంగోలు లోక్‌సభ అధ్యక్షుడు నూకసాని బాలాజీకి కూడా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి దక్కేందుకు బలమైన అవకాశాలు ఉన్నాయి.. ఈ ఇద్దరికీ తొలివిడతలోనే పదవుల దక్కుతాయా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయంపై అధిష్ఠానం ఇటీవల రాబిన్‌సింగ్ బృందం ద్వారా ఆరా తీసినట్లు కూడా తెలిసింది.

ఇద్దరు ఇన్‌చార్జిలపై ప్రత్యేక దృష్టి

సార్వత్రిక ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన ఎర్రగొండపాలెం, టీడీపీ దర్శి ఇన్‌చార్జిలకు పూర్తిస్థాయిలో అండగా ఉండాలని అధిష్ఠానం నిర్ణయించుకుంది. ఆ మేరకు వారికి సమాచారం ఇవ్వడంతోపాటు మంత్రులు, జిల్లాలో అధికారులకు కూడా సంకేతాలు పంపారు. ఇన్‌చార్జిలను అనధికారిక ఎమ్మెల్యేలుగా గుర్తిస్తూ ప్రోత్సహించాలా లేక నామినేటెడ్ పదవులు కూడా కేటాయించాలా అనే విషయంలో అధినేత స్పష్టమైన నిర్ణయానికి ఇంకా రాలేదని తెలిసింది. ఇటీవల సీఎంను కలిసిన టీడీపీ దర్శి ఇన్‌చార్జి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌కు.. అలాగే వైపాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుకు చంద్రబాబు పూర్తిస్థాయి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ప్రత్యేకించి దర్శిలో వైసీపీ ఎమ్మెల్యేగా శివప్రసాద్‌రెడ్డి ఉండటంతోపాటు ఆయన తల్లి వెంకాయమ్మ జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు. దీంతో ఇద్దరూ కలిసి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి టీడీపీ ఇన్‌చార్జి, శ్రేణులను ఇబ్బందిపెట్టే చర్యలకు శ్రీకారం పలికారు. ఆ విషయాలను లక్ష్మి, సాగర్‌లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వారికి పదవి ఇచ్చి ప్రొటోకాల్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లాకు చెందిన కొందరు కీలక నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో వారికి జిల్లాస్థాయి లేక రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో ఎలా అవకాశం కల్పించాలనే అంశంపై పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. వైపాలెంలో కూడా వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ దూకుడుగా వ్యవహరిస్తుండటంతో ఎరిక్షన్‌బాబుకు పూర్తి అండగా నిలవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేయడంతో ఆయన అంశంపైన అధిష్ఠానం పరిశీలన చేపట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, హాజరైన వివిధ శాఖల అధికారులు

15శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు

- అధికారుల వర్క్‌షాప్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, అందుకు రానున్న ఐదేళ్లలో ఏడాదికి 15శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లాస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశపు హాలులో శనివారం జిల్లా అధికారులతో వికసిత్ ఆంధ్ర 2047, జిల్లా కార్యాచరణ ప్రణాళికపై జరిగిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. నీతి అయోగ్ సహాయ సహకారంతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకొని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వంద రోజులు, సంవత్సర ప్రణాళికలను తయారు చేయాలన్నారు. జిల్లాలో జీడీపీని వృద్ధి చేసుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన అనుబంధ, పారిశ్రామిక, ఆక్వా తదితర రంగాల ద్వారా మెండైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యాన పంటల విస్తరణ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. చిన్నతరహా పరిశ్రమలను, పెద్ద క్లస్టర్‌గా అనుసంధానం చేసి అవసరమైన రుణ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణకు మండలాల వారీగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలుత జిల్లా ప్రణాళికపై సీపీవో వెంకటేశ్వర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మాధురి, వసుంధర, డాక్టర్ బేబిరాణి, భరద్వాజ్, శ్రీనివాసరావు, మర్దన్‌ఆలీ, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

వారంలో పట్టుకున్నారు!

- అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు
- రూ.40 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్
- ఎస్పీ కాళ్లుపట్టుకొని కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

లోపలి పేజీల్లో..

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



ఒంగోలు (కలెక్టరేట్), ఆగస్టు 17 : ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 15 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు జరుగుతాయి. అందులో రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మునిసిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, గ్రామ, వార్డు సచివాలయాలు, సివిల్ సప్లయీస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని విభాగాల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగులు, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్‌శాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖలు ఉన్నాయి. ఎక్సైజ్ ఉద్యోగులకు సెప్టెంబరు 5 నుంచి 15 వరకు, మిగిలిన 14 శాఖల్లో పనిచేస్తున్న వారికి శనివారం నుంచి ఈనెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మార్గదర్శకాలు ఇవీ..

ఈ ఏడాది జూలై 31నాటికి ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాలి. ఒకే చోట వివిధ కేడర్లలో ఐదేళ్లు పూర్తిచేసిన వారికి కూడా స్థానచలనం కల్పిస్తారు.

- ఒకే స్థానంలో ఐదేళ్లు పనిచేయని వారు కూడా బదిలీలకు అర్హులే. వారిని పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా లేదా వారి అభ్యర్థన మేరకు బదిలీ చేస్తారు. కనుక వారు కూడా ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది.
- సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీ అయ్యి మళ్లీ వారివారి స్థానాలకు వచ్చిన సిబ్బంది కూడా ఐదేళ్లు పూర్తయితే వారు కూడా బదిలీ కావాల్సిందే.
- కంటిచూపు లేని ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు కోరుకుంటే మాత్రం స్థానచలనం కల్పిస్తారు.
- భార్యాభర్తలు ఉద్యోగులైతే వారిరువురినీ ఒకేచోట నియమించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. వీలు కాకపోతే సమీపంలో నియమిస్తారు. స్థానాల భర్తీలో మొదట ఏజెన్సీ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాతే నాన్ ఐటీడీఏ ప్రాంతాల్లోని స్థానాలు భర్తీ చేస్తారు.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం

- బదిలీల్లో ఎవరికి ప్రాధాన్యం ఇవ్వాలన్న విషయాన్ని మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.
- అంధ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.
- మానసికస్థితి సరిగా లేని పిల్లల తల్లిదండ్రులు వైద్యసేవలు అందుబాటులో ఉండే ప్రాంతాలను కోరుకుంటే వారికి కూడా..
- గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పనిచేసిన ఉద్యోగులకు ప్రయారిటీ ఇస్తారు.
- 40శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఉద్యోగులకు సంబంధిత అధికారి ధ్రువీకరిస్తే ప్రాధాన్యం ఉంటుంది.
- ఉద్యోగి తాను స్వయంగా కానీ, స్పౌజ్ కానీ, తనపై ఆధారపడిన వారు కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వాటికి చికిత్స అందే ప్రాంతాలకు బదిలీలు కోరుకుంటే అవకాశం ఇస్తారు.
- మహిళా ఉద్యోగులు కారుణ్య నియామకం ద్వారా నియమితులైతే వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఉంటుంది.
- బదిలీలపై ఫిర్యాదులు, ఆరోపణలు వచ్చినా, మార్గదర్శకాలు ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణిస్తామని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించింది.

వైద్యరంగాన్ని కాపాడాలి

- ప్రత్యేక చట్టం అమలుచేయాలి
- ఐఎంఏ డిమాండ్
- జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో 24 గంటలపాటు సేవలు బంద్
- 'జూడా'ల నిరసనకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల



ప్లకార్డు పట్టుకొని నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 17: 'వైద్యులు, వైద్య సిబ్బంది, ఆసుపత్రులపై రోజురోజుకూ దాడులు తీవ్రమవుతున్నాయి. వైద్యరంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలులోకి తీసుకు రావాలి' అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) డిమాండ్ చేసింది. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దుండగుల హత్యాచారాన్ని ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా వైద్యులు 24 గంటలపాటు సేవలు నిలిపివేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఐఎంఏ హాలులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిత్యం పనిచేస్తున్న వైద్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోల్‌కతాలోని మెడికల్ కాలేజీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలిని హత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. వైద్యుల రక్షణపై ఐఎంఏ కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నదన్నారు. అయితే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించడం లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వైద్య రంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హత్యాచారానికి గురైన డాక్టర్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు శ్రావణి, శ్రీదేవి, రాష్ట్ర నాయకులు రావిపాటి జయశేఖర్, మన్నె వీరయ్యచౌదరి, జాలాది మణిబాబు, జాకబ్ జకర్యా, శారా జార్జి, మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఐఎంఏ చేపట్టిన వైద్య సేవల బంద్‌కు మద్దతు తెలియజేశారు. వారితోపాటు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన రెండో రోజైన శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి.



ఒంగోలులోని చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైద్యులు, జూనియర్ డాక్టర్లు



జీజీహెచ్‌లో జూడాలకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్

ఫార్మసీ విద్యార్థులతో కొంతమేర సేవలు

ప్రభుత్వ వైద్యుల నిరసన నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు లేకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ హోదాలో ఉన్న డాక్టర్లు జీజీహెచ్‌లో వైద్యసేవలు అందించారు. జీజీహెచ్‌తోపాటు ఇతర ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసీ విద్యార్థుల సేవలను కూడా వినియోగించుకున్నారు. డాక్టర్లు ఆందోళన విరమించే వరకు వారి సేవలు అందుబాటులో ఉంటాయి. వారితోపాటు పలు ప్రైవేటు నర్సింగ్ కాలేజీ విద్యార్థులను ఆయా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సేవలందించేందుకు నియమించారు.

సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని రెండురోజులుగా ఒంగోలు జీజీహెచ్‌లో జూడాలు చేపట్టిన ఆందోళనకు ఎమ్మెల్యే దామచర్ల సంఘీభావం తెలిపారు. శనివారం జీజీహెచ్‌లోని ఆందోళన శిబిరం వద్ద వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై హత్యాచారం చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి కేసుల్లో పురోగతి కనిపించడం లేదని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, ఆర్ఎంవో చెంచయ్య పాల్గొన్నారు.

ఒంగోలు డీఎస్పీగా రాయపాటి బాధ్యతల స్వీకరణ

ఒంగోలు (క్రైం), ఆగస్టు 17: ఒంగోలు సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా రాయపాటి శ్రీనివాసరావు శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎస్ఐ, సీఐ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేసిన శ్రీనివాసరావు అందరికీ సుపరిచితులు. శాంతిభద్రతలు అదుపు చేయడంలో దిట్టగా ఆయనకు పేరుంది. అంతేకాకుండా నేరస్థుల గుండెల్లో గుబులు పుట్టించిన అధికారిగా గుర్తింపు ఉంది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన్ను ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు పలువురు ఎస్ఐలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్‌లోని సమస్యలను ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు.



బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీని కలిసి మొక్కను అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

25 ఎస్ఎంసీల ఎన్నికలు వాయిదా

- 74 పాఠశాలల్లో ప్రశాంతంగా నిర్వహణ

ఒంగోలు (విద్య), ఆగస్టు 17: జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు శనివారం నిర్వహించిన ఎన్నికలు వివిధ కారణాలతో మళ్లీ 25 చోట్ల వాయిదా పడ్డాయి. మొదటి విడత 2,405 పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు నోటిఫికేషన్ ఇవ్వగా 2,306 చోట్ల ఎన్నికలు జరిగాయి. 99 పాఠశాలల్లో వివిధ కారణాలతో నిలిచిపోయాయి. ఆ స్కూళ్లకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. 74 పాఠశాలల్లో ప్రశాంతంగా జరిగాయి. వివిధ కారణాలతో 25 చోట్ల వాయిదా పడ్డాయి. వాటిలో ఒకటి పిల్లలు లేక మూతపడగా రెండుచోట్ల ఒక్క విద్యార్థి కూడా లేరు. ఒక స్కూల్‌లో గత కమిటీ పదవీకాలం రెండేళ్లు పూర్తికానందున ఎన్నికను నిలిపివేశారు. వివిధ కారణాలతో మిగిలిన 21 ఎస్ఎంసీల ఎన్నికలు వాయిదా పడ్డాయి. వాటికి ప్రభుత్వం తదుపరి ప్రకటించే షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుబ్బద్ర తెలిపారు.



సింగరాయకొండలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



చీమకుర్తిలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



కొత్తపట్నంలో ప్లకార్డులతో వైద్యసిబ్బంది నిరసన

వైద్యురాలి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

వైద్యులు, సిబ్బంది, ప్రజా సంఘాలు డిమాండ్

పలుచోట్ల నిరసనలు

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 17: కోల్‌కత్తాలో వైద్యురాలిని సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై శనివారం వైద్యులు, వైద్యసిబ్బంది నిరసనలు చేపట్టారు. వైద్యరంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలులోకి తీసుకురావాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఐఎంఏ హాలులో ఫ్లెక్సీలు చేత పట్టి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైద్యవిద్యార్థినిని దారుణంగా అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ఒంగోలులోని ఐఎంఏ హాలులో ఫ్లెక్సీలు చేతపట్టి నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు

మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో..

ఒంగోలు(కలెక్టరేట్): కోల్‌కత్తాలో వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ శనివారం స్థానిక సాయిబాబా గుడిసెంటర్‌లో మహిళా, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ కేసును పక్కదారి పట్టించి నేరస్థులను తప్పించేందుకు ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌కు రెండు రోజుల్లోనే పోస్టింగ్ ఇవ్వడం దుర్మార్గంగా ఉందని విమర్శించారు. తక్షణమే సదరు ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు నిత్యం పెరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. వైద్యులు, జూనియర్ డాక్టర్లు, ఐఎంఏ లాంటి సంస్థలు మాత్రమే స్పందించడం సరిపోదని, సభ్య సమాజం వీధుల్లోకి వచ్చిన నిరసన వ్యక్తంచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో జూనియర్ డాక్టర్లు ఆందోళనకు పూనుకున్నారని, వారు చేస్తున్న ఉద్యమానికి ఐద్వా మద్దతు ఇస్తుందని తెలిపారు కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బి.వెంకటస్వామి, పి.కిరణ్, కె.రాజేశ్వరి, బి.పెద్దగోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండలో..

సింగరాయకొండ: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక కందుకూరు రోడ్డు కూడలి నుంచి ప్రారంభమైన ప్రదర్శన పోలీసు స్టేషన్ వరకూ సాగింది. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడారు. కోల్‌కతాలో వైద్య పీజీ విద్యార్థినిపై హత్యాచారాన్ని ఖండించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం వైద్యులు కష్టపడుతుంటే వారి ప్రాణాలను కొంతమంది రాక్షసులు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఉజ్వల, చైతన్యకృష్ణ, వీరేంద్రకుమార్, హరిబాబు, రాకేష్, లీనా రాఫెల్, న్యాయసేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకుర్తి: కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై అత్యంత హేయంగా అత్యాచారం చేసి హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తూ చీమకుర్తి పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం నిరసన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బిజవహర్ మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ట్రైనీ డాక్టర్‌పై జరిపిన ఈ సంఘటన దారుణమన్నారు. ప్రభుత్వ వైద్యురాలు సురేఖ మాట్లాడుతూ హంతకులు ఎంతటివారైనా వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు శారద హనీఫ్, చైతన్య, తేజస్వి, శ్వేత, ఖాదర్‌రసూల్, ఉష, సంగీతరావు, ఈశ్వర్, సల్మా, చంద్రశేఖర్, కమల, బాష, సందీప్‌రెడ్డి, మాధవరావు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ కొత్రపు రాఘవరావు, చలువాది రమేష్, అంజిరెడ్డి, మర్రి లక్ష్మీనారాయణ, ముత్యాల ప్రసాద్, పార్ధసారధి, చంద్రమౌళి పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..

ఒంగోలునగరం: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన సంఘటనపై కొత్తపట్నంలో వైద్యసిబ్బంది శనివారం నిరసన ర్యాలీ చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీగా బయలు దేరి ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేశారు. వైద్యులు వైష్ణవి, రమ్యదీపిక మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న కాలనీలో మూడు గృహాలే పూర్తి

ట్రాన్స్‌ఫార్మర్లలో తీగ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

కలెక్టర్‌కు హౌసింగ్ జిల్లా అధికారి పేరయ్య వివరణ

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కొండపి, ఆగస్టు 17 : కొండపి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో ఇప్పటి వరకూ కేవలం ముగ్గురే గృహాల నిర్మాణం పూర్తి చేశారని హౌసింగ్ జిల్లా అధికారి ఈమని పేరయ్య కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వివరణ ఇచ్చారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లలో వైరు చోరీ జరిగిన విషయం వాస్తవమేనని అందులో ఆయన పేర్కొన్నారు. 'జగనన్న కాలనీలో దొంగలు పడ్డారు' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై కలెక్టర్ స్పందించి హౌసింగ్ పీడీని వివరణ కోరారు. దీంతో ఆయన అటు కలెక్టర్‌కు, ఇటు ఆంధ్రజ్యోతికి వివరణ పంపారు. కాలనీలో 224 ప్లాట్లు ఇవ్వగా.. 77 గృహాలు మంజూరయ్యాయన్నారు. వాటిలో ఇప్పటి వరకూ మూడు ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, 14 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కాలనీలోకి లబ్ధిదారులు సామగ్రి తీసుకువెళ్లేందుకు ఒకసారి మాత్రమే జంగిల్ క్లియరెన్స్ చేశామన్నారు. కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లలోని తీగల చోరీ విషయాన్ని విద్యుత్‌శాఖ ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారని వివరించారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవడానికి సకాలంలో నగదు, మెటీరియల్ ఇస్తామని తెలిపారు.

అంబేడ్కర్‌నగర్‌కు నీటి సరఫరా బంద్



మరమ్మతుకు గురైన పైప్‌లైన్

• రెండు రోజులుగా ప్రజల అవస్థలు

టంగుటూరు, ఆగస్టు 17 : టంగుటూరులోని అంబేడ్కర్‌నగర్‌కు నీటి సరఫరా నిలిచిపోయింది. పైప్‌లైన్‌లో అడ్డంకులు ఏర్పడటంతో కాలనీలోని అత్యధిక ప్రాంతానికి రెండు రోజులుగా నీరు అందలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 12 క్యాన్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ము నీరు రూ.150 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు మాత్రం అంత మొత్తం వెచ్చించలేక అల్లాడుతున్నారు. పైప్‌లైన్‌కు ఏవో అడ్డుపడ్డాయని చెప్తున్న పంచాయతీ అధికారులు అవి ఏమిటి? ఎక్కడ? అని ఇప్పటి వరకూ గుర్తించలేకపోయారు. తక్షణమే సాంకేతిక సహకారం తీసుకొని సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. అంబేడ్కర్‌నగర్‌లో నీరందని ప్రాంతాలకు ఆదివారం నుంచి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు శనివారం వెల్లడించారు. పైప్‌లైన్లో అడ్డంకులను తొలగించి త్వరితగతిన సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు.

విద్యార్థుల్లోని సామర్థ్యాలను వెలికితీయాలి

• జిల్లా అకడమిక్ అధికారి రమేష్



సమావేశంలో పాల్గొన్న రమేష్

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 17 : ప్రతిరోజూ విద్యార్థులతో కార్యాచరణ కార్యక్రమాలు చేయించడం ద్వారా వారిలోని సామర్థ్యాలను వెలికి తీయాలని జిల్లా అకడమిక్ అధికారి ఎం.రమేష్ సూచించారు. ఆయన శనివారం మండలంలోని కామేపల్లిలో నిర్వహించిన ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. 90రోజుల కార్యక్రమాన్ని విధిగా అమలు చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. అంతకుముందు కామేపల్లి ఎస్సీ కాలనీలో మస్తిష్క పక్షవాతంతో ఉన్న విద్యార్థి లక్ష్మీప్రణవ్ ఇంటిని సందర్శించారు. అనంతరం భవిత కేంద్రాన్ని పరిశీలించి ఐఆర్పీలకు సూచనలు చేశారు. జరుగుమల్లిలోని జడ్పీస్కూల్‌కు వెళ్లి ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంఈవో నాగేంద్రవదన్, జరుగుమల్లి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు జి.నరసింగరావు, ఐఆర్పీ ఎస్.నరసయ్య పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ప్రారంభం



పూజలలో పాల్గొన్న భక్తులు

టంగుటూరు, ఆగస్టు 17 : టంగుటూరు పంచాయతీలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో దక్షిణామూర్తి, కాళభైరవ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. సోమ వారం విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల నియామకం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 17 : ఒంగోలు నగరంలోని ఎమ్మార్పీఎస్ డివిజన్ కమిటీలను నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్ నియమించారు. శనివారం రాత్రి పేర్నమిట్ట, సర్వేరెడ్డిపాలెం కమిటీలను నియమించారు. పేర్నమిట్ట గ్రామ అధ్యక్షులుగా పుట్టిన బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా కార్తీక్, సర్వేరెడ్డిపాలెం గ్రామ అధ్యక్షులుగా పాలేటి సుధాకర్, ఉపాధ్యక్షులుగా గద్దల రాజేష్‌ను నియమించారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.బాబు, ఐదుపోగుల అజయ్, ఎండ్లూరి రాజా రత్నం, ఐదుపోగుల మస్తాన్, రాయాపాటి సుబ్బారావు, రాజశిఖామణి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల విద్యార్థుల కోసం 'స్వీకారం'

• కలెక్టర్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం స్వీకారం పేరుతో ఒక బృహత్తర కార్యక్రమం రూపొందించినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమం అమలులో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, వివిధ కార్పొరేట్ సంస్థల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని, సామాజిక బాధ్యతతో కార్పొరేట్ సంస్థలు కూడా తమవంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. కార్పొరేట్‌సంస్థలు కూడా తమవంతుగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతి కోసం స్వీకారం పేరుతో ఒక బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించామని, సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి కనీస మౌలిక వసతులు కల్పించేందుకు సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను దత్తత తీసుకోవాలని కలెక్టర్ కోరారు. మంచివాతావరణంలో అణగారిన వర్గాల పిల్లలకు సంక్షేమ వసతిగృహాల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతిగృహాల్లో పచ్చదనంతో పాటు మరుగుదొడ్ల సౌకర్యం, స్టడీ మెటీరియల్, రన్నింగ్ వాటర్ తదితర సౌకర్యాలు అందించాలని కోరారు. జిల్లాలోని 41 సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మౌలికవసతుల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేశామని, కార్పొరేట్‌సంస్థలు ముందుకు వచ్చి వాటిని దత్తత తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంక్షేమశాఖ అధికారులు లక్ష్మానాయక్, అంజన, మైన్స్ డీడీ జగన్నాథరావు, గ్రానైట్ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, హేచరీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గాడిపర్తివారిపాలెం ఎస్ఎంసీ ఎన్నిక



గాడిపర్తివారిపాలెంలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు



కొత్తపట్నం జడ్పీ హైస్కూలు కమిటీ సభ్యులు

చీమకుర్తి, ఆగస్టు 17: చీమకుర్తి మండలంలోని గాడిపర్తివారిపాలెం గ్రామంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. గతంలో కోరం లేక గ్రామంలోని వాయిదా పడిన మూడు పాఠశాలల్లో ఎన్నికలు శనివారం జరిగాయి. తల్లిదండ్రులు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. హైస్కూల్ కమిటీకి ఛైర్మన్‌గా పైడిపాగ దావీద్, వైస్‌ఛైర్మన్‌గా కె.శకుంతలను, ప్రాథమిక పాఠశాలకు ఛైర్మన్‌గా ఆంజనేయులు, వైస్‌ఛైర్మన్‌గా అమరేశ్వరీలను, అలాగే రంగసాయిపురం కమిటీకి ఛైర్మన్‌గా గండి అనూష, వైస్‌ఛైర్మన్‌గా మల్లేశ్వరీలను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రంగారావు, కిరణ్‌కుమార్, రామిరెడ్డి, నాయకులు జ్యోతి వేణు, గమిని ప్రసాద్, వెంకట్రావు, రామచంద్రరావు, మందలపు కోటయ్య, గంగినేని సుధాకర్, గమిని కృష్ణారావు, ఆంజనేయులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఇలవర గ్రామంలో..

కొండపి: మండలంలోని ఇలవర గ్రామంలో డిపెప్ స్కూల్ కమిటీ ఎన్నిక శనివారం ప్రశాంతంగా జరిగింది. ఛైర్మన్‌గా టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు వర్గానికి చెందిన టి.గంగాధర్ ఎన్నికయ్యారు. స్కూల్‌లో మొత్తం 10 మంది పేరెంట్స్ ఉండగా ఆరుగురు నాయుడు వర్గీయులు హాజరయ్యారు. ప్రత్యర్థి వర్గం వారు హాజరుకాలేదు.

కొత్తపట్నం హైస్కూలులో..

కొత్తపట్నం(ఒంగోలు నగరం): జిల్లాలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో అత్యంత ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంటు ఎన్నికలను శనివారం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1300 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో కోరం సరిపడా లేకపోవడంతో శనివారం మరలా పాఠశాలలో నిర్వహించారు. కమిటీకి ఛైర్మన్‌గా సనివిని కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా గౌరబోయిన సునీత ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. నూతన కమిటీకి తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీసెల్ నాయకులు గేనం సుబ్బారావు, పార్టీ మండల అధ్యక్షుడు ద్వార బాకుల శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రామచంద్రాపురంలో అంకమ్మతల్లి తిరునాళ్ల

టీడీపీ ఆధ్వర్యంలో మూడు విద్యుత్‌ప్రభలు ఏర్పాటు

హాజరుకానున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్



అంకమ్మతల్లి మూలవిరాట్



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ సుబ్బారావు

చీమకుర్తి, ఆగస్టు 17 : చీమకుర్తి మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం అంకమ్మతల్లి తిరునాళ్లను అంగరంగవైభవంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రాంతంలో భక్తులపాలిట కొంగు బంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా భక్తులు భావించే అంకమ్మతల్లి దేవాలయంలో గత యాభై ఏళ్లకుపైగా తిరునాళ్లు నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి తమ మొక్కుబడులను తీర్చుకుంటారు. సాయంత్రం విద్యుత్‌ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈసారి రామచంద్రాపురం, బూసరపల్లి, కొండపి మండలం మూగచింతల గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే టీవీ, సినీకళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక తిరునాళ్లకు మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌లతో పాటు పలువురు టీడీపీ నాయకులు హాజరుకానున్నారు. ఈ క్రమంలో శనివారం సీఐ సుబ్బారావు గ్రామాన్ని సందర్శించి తిరునాళ్ల ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాహకులకు పలుసూచనలు చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలన్నారు. ప్రభలపై అశ్లీల నృత్యాలకు తావు ఇవ్వకూడదన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు

• పీఎన్‌సీఏ విద్యాసంస్థల కరస్పాండెంట్ గీతారాణి



మాట్లాడుతున్న గీతారాణి

సింగరాయకొండ, ఆగస్టు 17 : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పీఎన్‌సీఏ అండ్ స్మార్ట్ జెన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి సూచించారు. సింగరాయకొండ పీఎన్‌సీఏ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఈబీ సీఐ నరహరి మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి చదివి విజయాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు, ఎస్ఈబీ ఎస్సై దయాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

20న విద్యార్థులకు నులిపురుగుల నివారణ టాబ్లెట్లు

• డీఈవో సుభద్ర

ఒంగోలు(విద్య), ఆగస్టు 17: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల టాబ్లెట్లు (అల్బెండజోల్ 400 ఎంజీ)మింగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లలందరికి ఈ టాబ్లెట్లు సరఫరా చేస్తామని, విద్యార్థులు మధ్యాహ్నం భోజనం తర్వాత వారి తరగతి గదుల్లోనే ఈ టాబ్లెట్లు మింగించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాబ్లెట్లు సేకరించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగేలా ఎంఈవోలు, ఉప విద్యాధికారులు చర్యలు తీసుకోవాలని డీఈవో కోరారు.

పర్యావరణ సమతుల్యతను పాటించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : పర్యావరణ సమతుల్యతతోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని, అందుకోసం పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు సైతం విరివిగా పాల్గొనాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి కోరారు. స్థానిక యూనివర్శిటీలోని తన చాంబర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్శిటీకి ఎన్ఎస్ఎస్ తరుపున ప్రస్తుతం 59యూనిట్లు మంజూరు కాగా అందుకు సంబంధించిన పత్రాలను ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి బీఈడీ పరీక్షలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 17: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలో బీఈడీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కేవీఎన్.రాజు శనివారం తెలిపారు. యూనివర్శిటీకి అనుబంధంగా ఉన్న 110 బీఈడీ కళాశాలల నుంచి 11,095 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మొత్తం 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రతిపరీక్ష కేంద్రానికి ఒక్కరు చొప్పున 45 మంది పరిశీలకులను నియమించారు. కాపీయింగ్‌ను నిరోధించేందుకు, పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు మూడు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్‌టిక్కెట్లను ఆయా కళాశాలలకు పంపించినట్లు రాజు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కళాశాలల యాజమాన్యాలను ఆయన కోరారు.

పేదలకు అన్నదానం అభినందనీయం : నూకసాని

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ పేరుతో క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ పేర్కొన్నారు. శనివారం స్థానిక లాయర్‌పేటలో జనసేన పార్టీ నాయకుడు జడా బాలనాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బీజేపీ నాయకుడు ఖలీఫాతుల్లాబాషాతో కలిసి నూకసాని బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం



అన్నదానం చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ వార్షికోత్సవ వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులోని అనాధ పిల్లలకు యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలుగులు సురేష్, జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు బి.వెంకట్రావు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మద్దిపాడు,ఆగస్టు 17: ఏడుగుండ్లపాడు వద్ద మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి గాయాలయ్యాయి. శనివారం అద్దంకి నుంచి ఒంగోలు వెళ్తున్న కారు, లారీని అధిగమించబోయి అదుపుతప్పి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో ఒంగోలు నగరం రామ్‌నగర్‌కు చెందిన ఆర్.దశరథరామయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రుని చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు.

విద్యాబోధనలో మార్పులు తీసుకురావాలి

మద్దిపాడు, ఆగస్టు 17: విద్యాబోధనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఎంఈవో ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంఈవో ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వం విద్యావిధానంలో తీసుకువస్తున్న మార్పులను అవగాహన చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ బాధితులకు అండగా ఉంటాం : సీపీఐ

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : జిల్లాలో భూకబ్జాలు, నకిలీ స్టాంపుల కుంభకోణంలో బాధితులకు సీపీఐ అండగా నిలుస్తుందని జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో జిల్లాలో భూ ఆక్రమణలు యధేచ్ఛగా కొనసాగాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూములకు కూడా రక్షణ కరవైందన్నారు. నాటి అధికార పార్టీ అండదండలతో భూకబ్జాదారులు చెలరేగిపోయారని, 22ఏ భూములకు తమకు అనుకూలంగా అనుమతులు సాధించుకొని, డీకే భూములను కూడా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలపై ఈనెల 19న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని, బాధితులకు సీపీఐ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

20 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

మద్దిపాడు, ఆగస్టు 17: మండలంలో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు సచివాలయాలు, స్కూల్స్, కాలేజీలు, అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తుందని తహసీల్దార్ సృజన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఆధార్‌కార్డు నమోదు, ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్‌తో పేరు చిరునామా, మొబైల్ నెంబర్ మార్పు వంటి సేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

21న గెస్ట్ అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు(విద్య), ఆగస్టు 17: ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్, యూజీ సబ్జెక్టులకు గెస్ట్ అధ్యాపకులను నియమించేందుకు ఈనెల 21న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేట్ సబ్జెక్టుల్లో కనీసం 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/స్లెట్, పీహెచ్‌డీ అర్హతలున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత. ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఈనెల 21న నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఈదుమూడిలో ఎస్ఎంసీ ఎన్నిక ఉద్రిక్తం

నాగులుప్పలపాడు, ఆగస్టు 17 : ఈదుమూడిలో శనివారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు ఉద్రిక్తంగా మారాయి. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా మారి తమ వారిని పోటీలో నిలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఆయా తరగతుల విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో హెచ్‌ఎం పి.శంకరరావు కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తున్న క్రమంలో ఓ వర్గం వారికి అనుకూలంగా హెచ్‌ఎం వ్యవహరిస్తున్నారని మరో వర్గం ప్యానల్ నాయకులు ఆరోపిస్తూ పాఠశాల బయట ఆందోళన చేపట్టడంతో ఇరు వర్గాల మధ్య వివాదం జరిగి తోపులాటలు చోటుచేసుకొని ఉద్రిక్తత నెలకొంది. వరసక్రమంలో నిర్వహించకుండా మరోవర్గం చెప్పినవిధంగా హెచ్‌ఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దాంతో ఎస్ఐ బ్రహ్మనాయుడు పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. సమగ్రశిక్ష పీవో శ్రీనివాసరావు, ఎంఈవో రమణయ్య ఈదుమూడి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. కోరం లేక 7వ తరగతి ఎన్నిక నిలిచిపోయిందని, మిగిలిన అన్ని తరగతులకు ఎన్నికలు జరిగాయని చెప్పారు. త్వరలోనే 7 తరగతికి ఎన్నికలు నిర్వహించి ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఎంఈవో తెలిపారు.

మాన్యువల్ స్కావెంజర్ల సర్వే కమిటీకి దరఖాస్తులు

ఒంగోలు నగరం, ఆగస్టు 17: నలుగురు సభ్యులతో కూడిన మాన్యువల్ స్కావెంజర్ల జిల్లా సర్వే కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ సాధికార అధికారి ఎం.లక్ష్మానాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇద్దరు ఎన్జీవో సంఘాల ప్రతినిధులు, మాన్యువల్ స్కావెంజర్లు, పారిశుధ్య కార్మికుల సంఘంలో పనిచేసే ఇద్దరిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. మాన్యువల్ స్కావెంజర్లు, పారిశుధ్య కార్మికుల కోసం పనిచేసే ఎన్జీవో సంఘం నుంచి మాత్రమే ఇద్దరికి ఈ కమిటీలో చోటు ఉంటుందన్నారు. ఒక మహిళ సభ్యురాలు కూడా ఉంటారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 26వ తేదీలోగా ఒంగోలులోని ప్రగతిభవన్‌లో గల సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.



దేవస్థాన భూములను పరిశీలిస్తున్న ఈవో నరసింహబాబు

ఆలయ భూముల్లో హద్దుల ఏర్పాటు

పామూరు, ఆగస్టు 17: పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములకు హద్దులు ఏర్పాటుచేశారు. ఎండోమెంట్ జిల్లా అధికారి కె.జనార్దన రెడ్డి ఆదేశాల మేరకు ఈవో గిరిరా జు నరసింహబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, దేవస్థాన కమిటీ, సిబ్బంది సహకారంతో శనివారం సర్వే నిర్వహించి హద్దురాళ్ళు ఏ ర్పాటుచేశారు. దేవాలయ భూముల పరిరక్షణ చర్యల్లో భాగంగా వేణు గోపాలస్వామికి చెందిన సర్వే నెంబర్ 256/2లో 29.33 ఎకరాలు, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామికి చెందిన సర్వే నెంబర్ 406/1లో 4.04 ఎకరాలు, 329/2లో 2.41 ఎకరాలు, 329/1లో 2.91 ఎకరాల భూము లను సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేశారు. దేవస్థాన భూముల్లో కొంతమంది అక్రమం గా వెంచర్లు, ప్లాట్లు, మరి కొంత మంది క ట్టడాలు చేపట్టారని ఈవో తెలిపారు.

ఆలయ భూములను ఆక్రమించిని వారిపై చ ట్టపరంగా చర్యలు తీసుకొని వాటిని స్వాధీ నం చేసుకొంటామన్నారు. దేవస్థాన భూ ముల్లో వేసిన ప్లాట్లను కొని మోసపోవద్దని ఈవో సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రఘురామ్, భజరంగ్‌దళ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వారంలో పట్టుకున్నారు

- అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు
- రూ.40 లక్షల సొత్తు రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ
- ఎస్పీ కాళ్ల మీద పడి కృతజ్ఞతలు తెలిపిన బాధిత ఇంటి యజమాని



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 17 : దొంగ దోచుకెళ్లిన సొత్తును వారం రోజుల వ్యవధిలోపలే పోలీసులు తిరిగి తెచ్చి ఇచ్చారు. దీంతో ఆనందబాష్పాలతో ఎస్పీ కాళ్ల మీద పడి మరీ 'పోలీస్ జిందాబాద్' అంటూ బాధిత ఇంటి యజమాని కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ ఘటన అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈనెల 9న నగరంలోని కాకతీయనగర్‌కు చెందిన గుమ్మడి నాగార్జున స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి తిరిగి రాత్రి 1గంటకు వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డారు. 50 సవర్ల ఆభరణాలు, రూ.1.80లక్షల నగదుతోపాటు బైక్ అపహరించుకువెళ్లారు. ఆ కేసును అత్యంత వేగంగా దర్యాప్తు చేసిన పోలీసులు దొంగను పట్టుకొని రూ.40లక్షలు సొత్తును రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్.దామోదర్ మాట్లాడుతూ ఆ కేసులో నిందితుడైన అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వెదిరేశ్వరంనకు చెందిన పలివెల ప్రభుకుమార్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో వెంకటేశ్వర లాడ్జిలో ఒంగోలు టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద రూ.40లక్షల విలువైన బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాలలో 25 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను జాగ్రత్త చేసుకోవాలన్నారు. అనుమానితులు కనిపిస్తే 112 నంబరుకు తెలియజేయాలని చెప్పారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులకు రివార్డులను అందజేశారు.

ఎస్పీ కాళ్ల మీద పడిన ఇంటి యజమాని

సమావేశంలో చోరీకి గురైన సొత్తును చూడగాని బాధిత ఇంటి యజమాని గుమ్మడి నాగేశ్వరరావు ఆనందబాష్పాలతో ఉప్పొంగిపోయాడు. పోలీసులు జిందాబాద్ అంటూ ఎస్పీ కాళ్ల మీదపడి కృతజ్ఞతను తెలుపుకొన్నారు. చోరీకి పాల్పడిన సొత్తును వారంరోజులలో దర్యాప్తు చేసి తిరిగి తెచ్చి ఇచ్చిన పోలీసులకు అభినందనలు తెలిపారు.

పోలీసులకు రివార్డులు

కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్, ఎఎస్సైలు బాలాంజనేయులు, సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.కె.ఖాజావలి, సాయికృష్ణ, కానిస్టేబుళ్లు వి.శ్రీనివాసులు, అంజిబాబు, రఘు, రవికుమార్‌లను ఎస్పీ ప్రశంసించి రివార్డులను అందజేశారు .

ఆటో బోల్తా... మహిళ మృతి

ముండ్లమూరు, ఆగస్టు 17: ఆటోబోల్తా పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని రమణారెడ్డిపాలెం వద్ద చోటుచేసుకుంది. ప్రమాదంలో వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ(35) మహిళ మృతి చెందగా, డ్రైవర్ బోగాల వెంకటేశ్వరరెడ్డి, షేక్ మీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. వేముల గ్రామానికి చెందిన మౌలాబీ, మీన్‌లు వెంకటేశ్వరరెడ్డి ఆటోను మాట్లాడుకొని మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో వంట చేసేందుకు శనివారం ఉదయం వెళ్ళారు. వంట అనంతరం తిరిగి స్వగ్రామ మైన వేములకు వెళ్తుండగా రమణారెడ్డిపాలెం గ్రామ ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న మౌలాబీ ఆటో కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ వెంకటేశ్వరరెడ్డికి గాయాలు కావ టంతో చికిత్స నిమిత్తం వినుకొండకు తరలించారు. మీన్ గ్రామంలో చికిత్స చేయించుకున్నారు. ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు మౌలాబీ భర్త పది సంవత్సరాల క్రితమే చని పోయాడు. దీంతో ఇద్దరు పిల్లలు తండ్రి, తల్లి లేని అనాథలయ్యారు. ఆ చి న్నారులు తల్లి మృత దేహంపై పడి ఏడుస్తున్న తీరు చూపరులను సైతం కంట తడి పెట్టించింది.

బాలికపై దాడికి యత్నం

- తల్లి ఫిర్యాదుపై పోక్సో కేసు

పర్చూరు, ఆగస్టు 17 : ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శనివారం పర్చూరు పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటి బయట ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని ఆదే ప్రాంతానికి చెందిన 30ఏళ్ల యువకుడు ఇంట్లోకి తీసుకుపోయి అత్యాచారానికియత్నించాడు. ఎదరు ఇంట్లో పాప ఉండడాన్ని గుర్తించిన తల్లి ఏమి జరిగిందని పాపను విచారించగా, జరిగిన విషయాన్ని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు పర్చూరు ఇన్‌చార్జి ఎస్సై డి.రత్నకుమారి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది.

కాలువలు ఇలా.. నీటి పారుదల ఎలా?

- ప్రభుత్వ ప్రకటనపై రైతుల హర్షం
- మరోపక్క పూడిపోయిన మైనర్‌లపై ఆందోళన
- గత రెండు సీజన్లకూ నీరందని వైనం
- కాలువలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి
- పలు గ్రామాల్లో రైతులే స్వచ్ఛందంగా చిల్లకంప తొలగింపు



తుమ్మ చెట్లతో కనుమరుగైన వెంపరాల మేజర్‌లోని కొత్తూరు మైనర్ కాలువ.. స్వచ్ఛందంగా కాలువను బాగుచేసుకుంటున్న రైతులు

బల్లికురవ, ఆగస్టు 17 : ఈ ఏడాది అన్ని డ్యామ్‌లు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రభుత్వం వరి సాగుకు నీటిని విడుదల చేస్తామని చెప్పడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కానీ పంటలకు నీరు వచ్చే కాలువలు అన్ని కనుమరుగు అయి పోయి ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సీజన్ల నుంచి వరి సాగు చేయకపోవడం, పంటలకు సరిపడా నీరు లేక అరకొరగా ఆరుతడులకు, తాగు నీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేయడంతో పలు గ్రామాలలో ఉన్న పంట కాలువలు పూర్తిగా తుమ్మ చెట్లు, పూడికతో నిండిపోయి ఉన్నాయి. ఇప్పుడు సాగు కోసం నీటిని విడుదల చేసినా అవి పంటలకు అరకొర గానే అందే పరిస్థితి ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల సాగుకు నీటిని విడుదల చేయక ముందే పంట కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బల్లికురవ మండలంలోని అత్యధిక గ్రామాలలో రైతులు పూర్తి స్థాయిలో సాగు నీరు వస్తే వరి సాగును చేపడతారు. సుమారు 10వేల ఎకరాలకు పైబడి వరి సాగు అయ్యే అవకాశం ఉంది. పంటలకు నీరు వచ్చే గుంటుపల్లి, ముక్తేశ్వరం, పసుమర్రు, జంగాలపల్లి, వైదన, మేజర్ కాలువలతో పాటు పలు మైనర్ కాలువలు అడవి తుమ్మ చెట్లతో చిట్టడవిని తలపిస్తున్నాయి. ఈ మేజర్ల పరిధిలో సాగుకు నీటి విడుదల జరిగినా పంటలకు మాత్రం సరిగా అందే పరిస్థితి లేదని, వెంటనే అధికారులు మేజర్ కాలువలను శుభ్రం చేయాలని తుమ్మ చెట్లను తొలగించి పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. వెంపరాల మేజర్‌లోని పలు మైనర్ కాలువలు పూడిపోయి ఉన్నాయని కొత్తూరు మైనర్ కాలువ కనుమరుగు కావడంతో రైతులే స్వచ్ఛందంగా విరాళాలు వేసుకొని పంట కాలువ అభివృద్ధి పనులు చేయించుకొంటున్నారు. కొన్ని చోట్ల పెద్ద పెద్ద చెట్లు కాలువలలో అడ్డుగా పడి పోయి ఉన్నాయని వాటిని తొలగించ కుండా నీటిని విడుదల చేసిన ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు పంట కాలువలు బాగా లేకపోవడంతో వరి సాగు చేయడం కష్టమని మొక్క జొన్న పంట అయినా సాగు చేద్దాం అనే ఆలోచనలో ఉన్నారు. కొందరు రైతులు మాత్రం ఏదిఏమైనా వరి సాగుకు ఎన్నాళ్లకు నీటి విడుదవుతుందని కాలువలు బాగు చేసినట్లయితే పంట సాగు చేయాలని వరి విత్తనాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. అధికారులు వెంటనే అన్ని గ్రామాల పరిధిలోని మేజర్, మైనర్ కాలువలను అభివృద్ధి పరిచేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

- హద్దులు ఏర్పాటుచేసేందుకు అధికారుల శ్రీకారం



దర్శి - కురిచేడు రోడ్డులో బండిదారిలో నిర్మిస్తున్న గృహాలు

దర్శి, ఆగస్టు 17: ఆక్రమణలకు గురైన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు, స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా సర్వే అధికారులు పట్టణంలోని ప్రభుత్వ స్థలాలకు హద్దులు ఏర్పాటుచేసేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత ప్రభుత్వ స్థలాలను పూర్తిగా కొలిచి హద్దులు ఏర్పాటుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అతర్వాత అందులోఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములకు, స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. కొందరు వైసీపీ నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే ప్రయత్నం చేశారు. కొందరు అక్రమార్కులు ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసకోవాలని ఆదేశాలు ఇవ్వటంతో అధికార యంత్రాంగం కదిలింది. దర్శి-కురిచేడు రోడ్డు లోని 244, 247, 248, 266 సర్వే నెంబర్లలో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉం ది. ఆ భూమి విలువ భారీగా పెరిగింది. ఎక రం రూ.కోటికి పైగా ధర పలుకుతోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో అనేకమంది బండిదారి స్థలాన్ని ఎక్కడికక్కడ ఆక్రమించి నిర్మాణాలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల స మయంలో కూడా నిర్మాణాలు చేస్తూనే ఉన్నా రు. దీంతో బండిదారి స్థలం సగానికి పైగా ఆక్రమణకు గురైంది.

దర్శి-కురిచేడు రోడ్డులోని 340/5 సర్వే నెంబర్‌లో 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. కొంత స్థలం రోడ్డు అవసరాలకు కేటాయించారు. ఇంకా 50 సెంట్లకు పైగా స్థలం ఖాళీగా ఉంది. దర్శి-అద్దంకి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ స్థలం రూ.5 కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈభూమిని అనేకమంది ఆక్రమించే ప్రయత్నాలు చేశారు. ఇటీవల కొంతమంది నకిలీ పట్టాలు సృష్టించి ఆ భూమిని స్వాహాచేసే యత్నం చేశారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల కుంట భూమి ఉంది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.కోటి పలుకుతోంది. ఇప్పటికే కుంట భూమిలో మూడు భాగాలు ఆక్రమించారు. ఇంకా ఒక ఎకరానికిపైగా ఖాళీగా ఉంది. ఇటీవల కొంతమంది కుంట కట్టను కూడా పగులకొట్టి



నకిలీ పట్టాలతో స్వాహాకు యత్నించిన ప్రభుత్వ స్థలం

మొత్తం భూమి ఆక్రమించే ప్రయత్నం చేశారు. 1బి రికార్డులు కూడా తారుమారు చేశారు. రికార్డుల్లో కుంట భూమి పేరును రౌండప్ చేసి ప్రైవేట్ వ్యక్తి పేరు ఎక్కించారు.

కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు నకిలీ పట్టాలు సృష్టించటం, రికార్డుల్లో పేర్లు మార్చటం వంటి చర్యలకు పాల్పడి కోట్లాది రూపాయల విలువచేసే భూములు, స్థలాలను ఆక్రమించారు. మిగిలిన భూములను కూడా ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారు. పలు ప్రైవేట్ వెంచర్లలోకి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలా లనూ కలుపుకొని ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నా రు. కురిచేడు రోడ్డులో ఒక లేవుట్‌లో 30 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని ప్లాట్లు వేసి అమ్ము కున్నారు. లంకోజనపల్లి రోడ్డులో, పొదిలి రోడ్డులో కూడా రెండు వెంచర్లల్లో ప్రభుత్వ స్థలాలను క లుపుకొని స్వాహా చేశారు. దర్శి పట్టణ సమీపం లోని కాటేరు వాగును పూర్తిగా ఆక్రమించి అనేక మంది గృహాలను నిర్మించుకున్నారు. మరికొందరు ప్రహరీ గోడలు ఏర్పాటుచేసుకొని తమ ఆధీనంలో ఉంచుకొని అనుభవిస్తున్నారు. రెవెన్యూ అధికారులు దర్శి పట్టణంలోని విలువైన ప్రభుత్వ భూములు, స్థలాలను చాలావరకు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుడతామని దర్శి తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ తెలిపారు.

వారం రోజులుగా నిలిచిన ఎన్‌ఏపీ నీరు

ముండ్లమూరు, ఆగస్టు 17: మండలంలోని పలు గ్రామాలకు వారం రోజులుగా దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న నీరు నిలిచిపోయింది. దీంతో పది గ్రామాల ప్రజలు తాగునీటికి అలమటిస్తున్నారు. మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, వేంపాడు, భీమవరం గ్రామాలకు ఎన్‌ఏపీ నీరు నిలిచిపోయింది. పసుపుగల్లు వద్ద పైపులైన్ లీకైందని నీటిని నిలిపివేశారు. దీంతో ప్రజలు పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు వెళ్ళి నీటిని తెచ్చుకుంటున్నారు.

భూఅక్రమాలపై ప్రత్యేక బృందాలతో విచారణ

- ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, ఆగస్టు 17: కనిగిరి ప్రాంతంలో జరిగిన భూఅక్రమాలపై ప్రత్యేక బృందాలతో విచారణ చేపడుతున్నట్లు ఆర్డీఓ జాన్‌ఇర్విన్ తెలిపారు. శనివారం జిల్లా మెయిన్‌లో 'భూ ప్రకంపనలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేక సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 40 గ్రామాల్లోని అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ కింద మొదటివిడత కింద గుర్తించినట్లు చెప్పారు. వాటిల్లో 38 గ్రామాల్లోని వివిధ అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ కింద వివిద కేటగిరీల కింద పరిగణలోకి తీసుకున్నట్లు చెప్పారు. వాటిలో 25వేల ఎకరాలు ఫ్రీహోల్డ్ కింద నమోదు చేయాల్సి ఉండగా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేవలం 45 రోజుల్లో ప్రక్రియ ముగించటం జరిగిందన్నారు. 23 గ్రామాల్లోని భూములను మాత్రమే తొలిదశలో ఫ్రీహోల్డ్ కింద 11వేల 892 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారు. వాటిలో కేవలం 630 ఎకరాలు మాత్రమే ఇప్పటికీ కొనుగోలు కింద 268 ఎకరాలు, బహుమతి (గిఫ్ట్) కింద 360 ఎకరాలు, పార్టిషన్ కింద మరో రెండు ఎకరాలు రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిపారు.

గత ప్రభుత్వంలో ఆయా భూములను ఆన్‌లైన్ ఆధారంగా పరిగణనలోకి తీసుకుని నమోదు చేసినట్లు ఆర్డీవో పేర్కొన్నారు. కొంతమంది అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి అక్రమంగా ఆన్‌లైన్ పొందటంతో వాటి ఆధారంగా ఫ్రీహోల్డ్ ప్రక్రియలో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని చెప్పారు. ప్రస్తుతం అలాంటి అక్రమాలను వెలికితీస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు రుజువైతే వాటిని తొలగించి వాస్తవ అర్హుల పేరుతో నమోదు చేస్తామని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో ప్రత్యేకంగా 13 బృందాలు ఫ్రీహోల్డ్ భూములతో పాటు అసైన్డ్ భూములు, ఆయా భూముల హక్కుదారులు, భూమిలో ఎవరు ఉన్నారనేది వాస్తవాలు తేల్చనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం 70 మంది రెవెన్యూ సిబ్బంది, అధికారులు, ముగ్గురు స్పెషల్ కలెక్టర్‌లు టీమ్ వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రతిరోజూ వీఆర్వో, తహసీల్దార్, డీటీలతో సమీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు.

సర్పంచ్, కార్యదర్శిపై విజిలెన్స్ విచారణ

కుంకలమర్రు(పర్చూరు), ఆగస్టు 17: కారంచేడు మండలంలోని కుంకలమర్రు గ్రామ పంచాయతీ నిధుల విత్‌డ్రా విషయంలో నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దానిపై బాపట్ల కలెక్టర్ స్పందించారు. దీనికి సంబంధించి శనివారం విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

జూదరుల అరెస్టు

చినగంజాం, ఆగస్టు 17 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బి.సీతారామిరెడ్డి శనివారం తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.800లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రక్షణ కోసం వైద్యుల ఆందోళన

- కోల్‌కత్తా ఘటనపై పెల్లుబికిన నిరసన
- ప్రధాన కూడళ్లలో ర్యాలీలు నిరసనలు చేపట్టిన వైద్యబృందాలు



పొదిలిలో నిరసన తెలుపుతున్న వైద్యులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 17: కోల్‌కత్తాలో హత్యకు గురైన పీజీ వైద్యురాలి కుటుంబాన్ని ఆదుకొని, వైద్యులకు రక్షణ కల్పించాలని కోరుతూ శనివారం స్థానిక సర్వజన వైద్యశాల వద్ద డాక్టర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, వైద్యశాలల్లో కూడా వైద్యులకు అభద్రతా భావం ఏర్పడిందన్నారు. వైద్యులకు ప్రభుత్వం పూర్తిరక్షణ చట్టాలను కఠినంగా ఏర్పాటు చేయాలని కోరారు. డాక్టర్ హత్యకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్యశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వైద్య సేవలందించే వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసరావు, భక్తవత్సల, వంశీకృష్ణ, రాంబాబు, వహిద, నీలిమ పాల్గొన్నారు.

పొదిలి : వైద్యురాలి హత్యకు నిరసనగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది, ఆర్‌ఎంపీ, పీఎంపీ, మానవతా స్వచ్ఛందసేవ సంస్థ, విద్యావేత్తల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల నుండి నిరసన ర్యాలీగా వెళ్లి పెద్దబస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ నినాదాలు చేశారు. చిన బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొనకనమిట్ల ప్రభుత్వ వైద్యాధికారి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మీ మాట్లాడుతూ సివిల్ వలంటీర్ సంజయ్‌రాయ్ కలకత్తా ఆర్జీకార్ మెడికల్ కళాశాలలో వైద్యురాలిపై కిరాతకంగా హత్యాచారం చేస్తే నిందితుడిపై ఇంత వరకు చర్యలు లేకపోవడం ఏమిటని ప్రశ్నించారు. నిందితుడు హేళనగా, మాట్లాడుతన్నా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. హాస్పిటల్‌లో జరుగుతున్న సెక్స్‌రాకెట్, డ్రగ్‌మాఫియా, ఆర్గాన్‌ట్రేడ్‌లను బయటపెట్టినందుకే వైద్యురాలిని హత్య చేశారన్నారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై గగ్గోలుపెట్టిన కాంగ్రెస్‌పార్టీ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఈవిషయంలో ఎందుకు నోరుమెదపడంలేదని ప్రశ్నించారు. ర్యాలీలో డాక్టర్ ఇమాంమ్‌సా, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, కల్లం సుబ్బారెడ్డి, యక్కలి శేషగిరిరావు, సామంతపూడి నాగేశ్వరరావు, బండి అశోక్, బాజీ, వినోద్ పాల్గొన్నారు.



మార్కాపురంలో సర్వజన వైద్యశాల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

త్రిపురాంతకం : మండలంలోని వైద్య సిబ్బంది త్రిపురాంతకంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. కోల్‌కత్తా ఘటనకు సంబంధించిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దదోర్నాల : వైద్యులపై దాడులు హేయమని, వెంటనే అరికట్టాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంజీవ్ అన్నారు. కోల్‌కత్తా ఘటనకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా వైద్యులు సంజీవ్ మాట్లాడుతూ వైద్యులపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష వేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ కల్పించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లావణ్య, ఆరోగ్యమిత్రలు చంద్రశేఖర్, మణికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు : కోల్‌కత్తాలో జరిగిన హత్యాచారం ఘటనకు నిరసనగా వైద్యులు, వైద్యసిబ్బంది పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్య సేవలు బహిష్కరించి సంతాపం తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.సూరిబాబు, వైద్యులు, వైద్యసిబ్బంది ర్యాలీలో పాల్గొని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. పలు ప్రైవేటు వైద్యశాలలు సైతం 24 గంటల పాటు వైద్యసేవలు నిలిపివేత కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర కేసులకు మాత్రమే వైద్యసేవలు అందించారు.

కంభం : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వైద్యురాలి హత్యాచారం ఘటనకు నిరసనగా, కంభం ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది భారీర్యాలీ నిర్వహించారు. శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కోల్‌కత్తా ఘటనలో నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కంభం వైద్యశాల నుండి బస్టాండ్, కందులాపురం కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారిపై మానవహారంగా నిలబడి నినాదాలు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించేలా చట్టాల్లో మార్పు తీసుకురావాలని కోరారు.

బేస్తవారపేట : పట్టణంలో శనివారం వైద్యాధికారులు, సిబ్బంది నిరసన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కలకత్తాలో జరిగిన మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థిపై అత్యాచారం, హత్యను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పృధ్విరాజ్, కావ్య వర్షిని, రమేష్ కుమార్, జలందర్, ప్రాథమిక కేంద్రాల జిల్లా అధ్యక్షులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



దోర్నాలలో నిరసన తెలుపుతున్న వైద్యులు, బేస్తవారపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

- ఘనంగా ఏపీయూడబ్ల్యూజే 67వ వ్యవస్థాపక దినోత్సవం



రోగులకు రొట్టెలు, పండ్లు అందజేస్తున్న జర్నలిస్టులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 17: స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు ఏపీయూడబ్ల్యూజే 67వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా పండ్లు, బ్రెడ్లు జర్నలిస్టులు శనివారం పంపిణీ చేశారు. ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సావిత్రి, మెడికల్ కళాశాల, ప్రొఫెసర్లు, జర్నలిస్టులు కలిసి వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ.రమణ మాట్లాడుతూ.. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం, భద్రత కోసం ఎన్నో పోరాటాలు చేసి అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సుభాని, బాజీవలి, కెవి సత్యనారాయణ, శ్రీనివాసులు, అన్ను, రఫి, రాజు, మల్లికార్జునరెడ్డి, శేఖర్, శీను, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ఎర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ప్రాంతీయ కమిటి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు నియోజకవర్గం ఏపీయూడబ్ల్యూజే ప్రాంతీయ కమిటి ఆధ్వర్యంలో స్థానిక సన్‌జో అనాధశ్రమంలో అనాధలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు కాకర్ల నరసింహారావు, జిల్లా మాజీ అధ్యక్షులు షేక్ నూరిద్దీన్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటి కార్యవర్గసభ్యులు షేక్ మహబూబ్‌బాష, తమ్మినేని అంజిరెడ్డి, నియోజకవర్గ కమిటి సభ్యులు కటికె శంకర్, పిడికిటి వెంకటనారాయణ, గుంటి రామ్, విలేఖరులు పాల్గొన్నారు.

చిన్నారి త్రివేణిని ఆదుకుంటా : ఎమ్మెల్యే


అర్జీ స్వీకరిస్తున్న అశోక్‌రెడ్డి

కొమరోలు, ఆగస్టు17: తల్లిదండ్రులు కోల్పోయి నిరాశ్రయురాలైన చిన్నారి పిక్కిలి వెంకట త్రివేణిని అన్నివిధాల ఆదుకుంటానని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిచర్ల మోటులో నిర్వహించిన ఓ కార్యాక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా త్రివేణి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆదుకొని విద్యను అందించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అక్కడే ఉన్న ఎంఈవో కావడి వెంకటేశ్వర్లుతో మాట్లాడారు. రాజుపాలెం కస్తుర్బా విద్యాలయంలో చేర్పించాలని సూచించారు. అయితే సీట్లు అన్ని నిండాయని చెప్పడంతో వెంటనే అదనంగా సీటు కేటాయించే విధంగా విద్యాశాఖ అధికారులతో మట్లాడాలని ఆదేశించారు. త్రివేణి కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒకవేళ అక్కడ సీటురాకపోతే తానే స్వయంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. కంభం మండలం, యర్రపాలెం గ్రామానికి చెందిన త్రివేణి తల్లి రాజేశ్వరి ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు, డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి రాములు కూడా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాలిక త్రివేణిని నాన్నమ్మ భూలక్ష్మి కూలిపని చేసుకొంటూ పెంచుకుంటుంది.

బొప్పాయితోట ధ్వంసం

ఎర్రగొండపాలెం, ఆగస్టు 17 : మండలంలోని గురిజేపల్లి గ్రామంలో నలుగురు రైతులు సాగుచేసిన బొప్పాయి తోటల్లో బొప్పాయి చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి నరికివేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ గురిజేపల్లిలోని తోటలను శనివారం పరిశీలించారు. పంటనష్టపోయిన రైతులు భవనం శివారెడ్డి, వెన్నా రాజమోహన్‌రెడ్డి, కందుల కాశిరెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డిలను ఓదార్చారు. నలుగురు రైతులకు చెందిన బొప్పాయి మొక్కలతో పాటు, పైపులైను పైపులు ధ్వంసం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్‌లో రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వక్ఫ్‌బోర్డ్ భూముల్లో కట్టడాలు అన్యాక్రాంతమే

పొదిలి, ఆగస్టు 17 : వక్ఫ్‌బోర్డ్, స్థలాలు భూముల్లో కట్టడాలు కడితే అవి అన్యాక్రాంతం కిందకు వస్తాయని జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ అన్నారు. స్థానిక పెద్ద మసీదు నందు శనివారం జరిగిన ఇనాం భూముల బహిరంగ వేలం నిర్వహణలో పాల్గొని మాట్లాడారు. వేలంలో పాల్గొనడానికి వచ్చిన కొందరు ముస్లిం పెద్దలు వక్ఫ్‌బోర్డ్ భూములు కొంతవరకు అన్యాక్రాంతమయ్యాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 888-4లో 160 ఎకరాలు ఉండగా 136 ఎకరాలు మాత్రమే వేలం నిర్వహించారని తెలిపారు. మిగిలిన 24 ఎకరాల భూమి ఏమైందని టీడీపీ పట్టణాధ్యక్షుడు ఖుద్దూస్ ప్రశ్నించారు. అయితే వక్ఫ్‌బోర్డ్ సీఈవో కార్యాలయం నుండి అన్యాక్రాంతమైన భూములను గుర్తించాలని లెటర్ వచ్చిందని త్వరలోనే గుర్తించి నివేదిక అందిస్తామని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు.

అధికారుల తీరుపై విమర్శలు

కంభం, ఆగస్టు 17: పలు శాఖలకు చెందిన వారికి ఆగస్టు 15వ తేదీన మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు, పంచాయతీల పరిధిలో చేసిన సేవలకు గుర్తింపుగా ఉత్తమ అధికారి, ఉత్తమ సర్పంచ్‌ల అవార్డులు ప్రకటించారు. మండలంలోని ఎల్.కోట సర్పంచ్‌గా ఉన్న వైసీపీ మద్దతుదారు మహమ్మద్‌బాషాకు ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రకటించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన ఎక్కువగా హైదరాబాద్‌లోనే ఉంటాడు. ప్రజలకు అందుబాటులో ఉండని, అలాంటి సర్పంచ్‌ని ఉత్తమ సర్పంచ్‌గా ఎలా ఎంపిక చేశారని అధికారులను వైసీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తమ సర్పంచ్‌గా ఎన్నిక చేసిన అధికారుల ఈ లోగుట్టు వ్యవహారం తెలియాలని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వెనుకబడిన ప్రాంతాల్లో ఉచిత వైద్యం అందించాలి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కొమరోలు, ఆగస్టు 17: జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఉచిత వైద్యంను అందించాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాటిచర్ల మోటులోని ఆర్‌సీఎం పాఠశాలలో శనివారం అమ్మా ఫౌండేషన్, ఒంగోలు కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన మారుమూల ప్రాంతాల్లో అమ్మా ఫౌండేషన్, కిమ్స్ వైద్యశాలలు మెగా వైద్యశిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలోని ఏరియా వైద్యశాలను గతంలో 50 పడకల నుంచి 100పడకల వైద్యశాలగా మార్చానని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 100 పడకలను మరలా 40 పడకల వైద్యశాలగా మార్చారన్నారు. దీంతోనే ఈ ప్రాంతంపై వైసీపీకి ఈ ప్రాంతంపై ఉన్న చిన్నచూపు స్పష్టమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఈ వెనుకబడిన ప్రాంతంలోని అన్ని వైద్యశాలల స్థాయిని పెంచి అభివృద్ధి చేసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్పొరేటు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా డయాలసిస్ సెంటర్‌ను గిద్దలూరులోనే ఏర్పాటు చేశామన్నారు. కిమ్స్ వైద్యశాలలో పేదలకు కూడా కార్పొరేట్ వైద్యం అందుతుందన్నారు. మన ప్రాంతంలో అమ్మా ఫౌండేషన్ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు తమ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా వందల మందికి ట్రైసైకిల్స్, కిరాణా వస్తువులు, రక్తదాన కార్యక్రమాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యాక్రమంలో జిల్లా రైతు కార్యాదర్శి బిజ్జం రవీంద్రారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు బోనేని జయలక్ష్మీ, గిద్దలూరు పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు మధుసుదన్‌యాదవ్, అమ్మ ఫౌండేషన్ సభ్యులు మలికే జయరాం, పేరగాని సుధాకర్, పందనబోయిన భూపాల్, నాయకులు పందిళ్ల పుల్లయ్య, అనపా వీరశేఖర్, జ్యోతిరెడ్డి, అంబారపు సుబ్రహ్మణ్యం, బయలడుగు బాలయ్య, బూర్గుల షేపీ,రాజగోపాల్, బాలిరెడ్డి, మహేష్ శ్రీనివాసులు, యల్లయ్య, ఆర్‌సీఎం ప్రిన్సిపల్ నిర్మల పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో పాల్గొన్న అశోక్‌రెడ్డి

పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతం


బాదినేనిపల్లిలో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

కొమరోలు, ఆగస్టు17: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో వాయిదాపడిన 11 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవోలు కావడి వెంకటేశ్వర్లు, బోర్రా వెంకటరత్నంలు తెలిపారు. మండలంలోని బాదినేనిపల్లి, యర్రగుంట్ల, అక్కపల్లి, మిట్టమీదిపల్లి పాఠశాలలు, ఎస్‌బీవీఎస్‌ఆర్‌ఎం పాఠశాలల్లో శనివారం ఆయా పాఠశాలల కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని బాదినేనిపల్లి ఎంపీయుపీ స్కూల్‌కు మాకం పెద్ద అంజనేయులు, ఉపాధ్యక్షులుగా జ్యోగిపర్తి శ్రీవాణి, యర్రగుంట్ల ఎంపీపీ స్కూల్ అధ్యక్షులు కానేగొరి రామస్వామి, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, మిట్టమీదిపల్లి ఎంపీపీ స్కూల్ కమిటీ అధ్యక్షులుగా పోలెబోయిన గురులక్ష్మీ, ఉపాధ్యక్షులు వర్రా రమణమ్మ, అక్కపల్లి ఎంపీపీ స్కూల్ అధ్యక్షులుగా కానె రంగమ్మ, ఉపాధ్యక్షులు గుమ్మళ్ల రంగలక్ష్మీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గిద్దలూరు సీఐ జే. రామకోటయ్య , ఎస్‌ఐ మధు సుదన్‌రావులు గట్టిపోలీసు బందోబస్తును ఏర్పాటుచేసి ఘర్షణలు జరగకుండా చర్యలు చేపట్టారు.

యర్రబాలెం హైస్కూల్ చైర్మన్ టీడీపీ వశం

కంభం, ఆగస్టు 17: పాఠశాల ఎన్నికల సందర్భంగా కంభం మండలం యర్రబాలెంలోని హైస్కూల్‌లో జరిగిన ఎన్నికల్లో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదాపడిన విషయం విదితమే. కాగా శనివారం టీడీపీ తరపున గోన చెన్నకేశవులు జరిపిన చర్చలు ఫలితంగా చైర్మన్‌గా పిక్కిలి కాశీరావు, వైస్‌చైర్మన్‌గా వాడ కప్పుల ఎలిజిబెత్‌రాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక చిలకచెర్లలో వాయిదా

పెద్ద దోర్నాల : ఎస్‌ఎంసీ ఎన్నికల్లో భాగంగా మూడు పాఠశాలలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోగా, చిలకచెర్ల ఎంపీపీఎస్ పాఠశాలలో కోరం లేక ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో అధ్యక్షుడు ఎస్.నాగభూషణం, ఉపాధ్యక్షులు చాట్ల కమలమ్మ, చెరువుగూడెంలోని జీపీఎస్ పాఠశాలలో దాసరి కాశమ్మ, కుడుముల నాగలక్ష్మీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు గానూ, చిన్నదోర్నాల ఎంపీపీఎస్‌లో ఎలక పాటి చార్లెస్, పావని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ఎంఈవో మస్తాన్‌నాయక్ తెలిపారు.

పాస్టర్లు ఆదర్శవంతంగా ఉండాలి

కమ్యూనిటీ హాలు ప్రారంభోత్సవంలో ఎరిక్షన్‌బాబు


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, ఆగస్టు 17: స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాల సమీపంలో పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్యూలా అగాపే కమ్యూనిటీ హాలును గూడూరి ఎరిక్షన్‌బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్లు దైవ సమానులని, వారు మంచి ప్రవర్తన కలిగి అందరికీ మార్గదర్శకులుగా ఉండాలన్నారు. దైవ జనులు అందరూ ఒకేచోట నివాసం ఉండడం సంతోషకరమైన విషయమన్నారు. కాలనీలో ప్రభుత్వం ద్వారా పక్కా గృహాలు మంజూరు, మౌలిక వసతులు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ సమ్మద్ భాష, షేక్ మంజూర్ భాష, కొప్పుల సుబ్బారెడ్డి, షేక్ ఇస్మాయిల్, బాష, సుధాకర్‌రెడ్డి, ఏర్వ మల్లికార్జునరెడ్డి, ఆర్ సుబ్బరత్నం, జనసేన అధ్యక్షులు కే.మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎరిక్షన్ బాబుపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదు

పుల్లలచెరువు, ఆగస్టు 17: ప్రజలకు సేవచేస్తున్న వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని పుల్లలచెరువు టీడీపీ మండల నాయకులు పేర్కొన్నారు. శనివారం పత్రికలో వచ్చిన కథనంపై టీడీపీ నాయకులు పుల్లలచెరువులో పత్రిక విలేకర్ల సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎరిక్షన్‌బాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటా యని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో పుల్లలచెరువు మండల పరిషత్, పంచాయతీ నిధులను దిగమింగిన మంత్రి సురేష్ అవినీతి మీకు కనబడలేదా? అని ప్రశ్నించారు. పోలీసులతో రాజారెడ్డి రాజ్యంగం నడిపిన మీరు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గెలిచినా ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ గురించి మాట్లాడే మీరు, గతంలో ఇన్‌చార్జ్ హోదాలో పోలీస్ ఎస్కార్ట్‌ను ఏలా ఉపయోగించుకున్నారని అన్నారు కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పయ్యావుల ప్రసాద్, టీడీపీ ముఖ్య నాయకులు కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, గజ్వేల్లి భాస్కర్, కొలుకులూరి కుమార్, ఎంపీటీసీ మేడికొండ రాధాకృష్ణ, సర్పంచి బి.ఓబులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

- బాధిత కుటుంబాలకు రూ.7.35 లక్షల చెక్కుల పంపిణీ

గిద్దలూరుటౌన్, ఆగస్టు 17 : రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజాశ్రేయస్సు, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన రూ.7.35 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నారన్నారు. బేస్తవారపేట గ్రామానికి చెందిన కాలువ మణికంఠ గత సంవత్సరం సెప్టెంబరు 22వ తేదిన ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుండి 5లక్షలు మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి శనివారం అందచేశారు. అర్థవీడు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై యండాల రంగస్వామికి చెందిన 2 గేదెలు మృతిచెందగా 65 వేల చెక్కును అందచేశారు. కాకర్ల గ్రామానికి చెందిన మహబూబ్ పీరాకు చెందిన 13 గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా 1.30 లక్షలను, అర్థవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓదెం లింగయ్యకు చెందిన ఒక గేదె మృతిచెందనగా 40వేల చెక్కును పంపిణీ చేశారు.

అన్న క్యాంటీన్‌కు విరాళాలు

గిద్దలూరు టౌన్ : అన్నాక్యాంటీన్‌కు రాచర్ల మండలం గుడిమెట్ట పంచాయతీలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రెడ్డిశ్రీ రామాంజనేయరెడ్డి తనవంతుగా రూ.1.16 లక్షల చెక్కును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి శనివారం అందచేశారు. రాచర్లకు చెందిన శంకర్‌నాయుడు రూ.20వేల విరాళాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా వీరిని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రాచర్ల, బేస్తవారపేట టీడీపీ మండల అధ్యక్షులు కటికె యోగానంద్, మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

బాధితులకు చెక్కుల పంపిణీ


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ముత్తుముల అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఆగస్టు 17: విద్యుదాఘాతంగా కుటుంబ సంభ్యులను, పశుసంపదను కోల్పోయిన పలు కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. బేస్తవారపేటకు చెందిన కాలువ మణికంఠ ఏడాది క్రితం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఆయన భార్యకు రూ5లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. చెక్కును ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందజేశారు. అర్ధవీడు గ్రామంలో విద్యుదాఘాతంతో యండాల రంగస్వామికి చెందిన రెండు గేదెలు మృతిచెందాయి. దీంతో బాధిత రైతుకు రూ.65వేలు ప్రభుత్వం మంజూరు చేసింది. కాకర్ల గ్రామానికి చెందిన మహబూబ్ పీరాకు చెందిన 13 గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందగా రూ.1.30లను, అర్ధవీడు మండలం చింతమల్లెలపాడు గ్రామంలో విద్యుదాఘాతానికి గురైన బి.లింగయ్య గేదె మృతి చెందగా రూ.40వేల రూపాయాల చెక్కులను శనివారం ముత్తుముల అశోక్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అర్ధవీడు విద్యుత్ ఏఈ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి పరిహారం అందజేత

పుల్లలచెరువు : విద్యుదాఘాతంతో గేదెమృతి చెందటంతో రైతుకు రూ.40 వేల విలువైన చెక్కును వై.పాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, విద్యుత్ అధికారులు అందజేశారు. శనివారం మార్కాపురంలోని ఆయన నివాసంలో విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పుల్లలచెరువు మండలం పీఆర్‌సీ తాండకు చెందిన రైతు రామావత్ హనుమంతురావు కుటుంబానికి ఇచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఏఈ కిషోర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పల్స్‌సర్వే వేగవంతం చేయాలి

తర్లుపాడు, ఆగస్టు 17: మండలంలో పల్స్‌సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పల్స్‌సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, 19వ తేదీ సాయంత్రం లోపు వందశాతం సర్వే పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రతిఇంటికి వెళ్లి జల్ జీవన్ మిషన్ కింద నీరు వస్తుందా.., లేదా? బోర్ల ద్వారా వస్తుందా? లేదా? ఆ ఇంటికి అసలు మంచినీటి సదుపాయం లేదా? అనే వివరాలను ఖచ్చితంగా సర్వేలో నమోదు చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లకుండా సర్వే చేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 99 ఎకరాల్లో పండ్ల తోటలకు అనుమతులు వచ్చినా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒక ఎకరాకు కూడా ఇంత వరకు మొక్కలు నాటలేదన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యం వీడి మండలంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈసీ పెద్దన్నను ఆదేశించారు. మండలంలో రూ.3.25కోట్లతో త్వరలో సీసీ రోడ్లు వేయనున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుడ్డపల్లెను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. బుడ్డపల్లెలో రూ.2.61కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఈవోపీఆర్‌డీ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చెన్నయ్య శాంతికల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 17: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామి వారి శాంతికల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామికి మొక్కులు తీర్చుకున్నారు. ఈవో గోలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కంభంలో భారీ వర్షం


కంభంలో కురుస్తున్న వర్షం

కంభం, ఆగస్టు 17 : పది రోజులుగా కంభం మండలంలో ఎండతీవ్రత, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఉపశమనం కలిగించేలా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌కోత విధించడంతో ఇంట్లో ఉక్కపోతతో ఉండలేక, బయట ఎండదెబ్బకు తిరగలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం నుంచి వాతా వరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో బెట్టకు వచ్చిన పైర్లకు జీవం పోసినట్లు అయింది.

చల్లబడిన వాతావరణం

గిద్దలూరు : పదిరోజులుగా మండుతున్న ఎండలతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు మారిన వాతావరణంతో ఊపిరి పీల్చుకున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు కూడా ఎండలు మండిపోగా ఆ తరువాత ఈదురు గాలులతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దాంతో ప్రజలు సేదతీరారు.

సీఎంపై అనుచిత పోస్టు పెట్టిన మహిళ అరెస్టు

కంభం, ఆగస్టు 17: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టు పెట్టిన మహిళను శనివారం అరెస్టు చేసినట్లుగా కంభం ఇన్‌చార్జ్ సీఐ రామకోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఈనెల 7న 'స్వీటి గిద్దలూరు నియోజకవర్గం' ఫేస్‌బుక్ పేజీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై గుర్తుతెలియని వ్యక్తులు అనుచిత ఫొటోలు పెట్టారు. దీనిపై కంభం మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ గోన చెన్నకేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు అనుచిత పోస్టు చేసిన వ్యక్తిని గుర్తించి వాట్సప్ ద్వారా నోటీసులు ఇచ్చామన్నారు. ఆ మేరకు శనివారం బేస్తవారపేటకు చెందిన మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరంనిరూపణ అయినట్లయితే 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5లక్షల మేర జరిమానా పడే అవకాశం ఉందన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా, సామాజికంగా, చట్టవ్యతిరేకమైన మెసేజ్‌లు పంపినా, షేర్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జూనియర్ సివిల్ న్యాయాధికారి ఓంకార్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 17 : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. శనివారం మండలంలోని అంబవరం, వెల్లుపల్లె గ్రామాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయా గ్రామాలలో న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ ఉచిత న్యాయసలహా సర్వీసెస్ టోల్‌ఫ్రీ నెంబరు 15100కు కాల్ చేయవచ్చన్నారు. సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ చట్టం ప్రోనోట్లు, ఉచిత న్యాయసహాయం, బాలకార్మికుల నిర్మూలన చట్టం, బాల్యవివాహ నిషేధ చట్టం, మానసిక వైకల్యం కలిగిన వారికి వైద్యసదుపాయాలు, వరకట్న నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంబవరం సర్పంచ్ ఎస్.కృపమ్మ, ఉపసర్పంచ్ సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి రామక్రిష్ణారావు, వీఆర్‌వో జి.అచ్చయ్య, వెల్లుపల్లె కార్యదర్శి కె.గంగాధర్, మహిళ పోలీసు కె.అరుణ, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు పోలేరమ్మ తిరునాళ్ల


పోలేరమ్మ తల్లి

పామూరు, ఆగస్టు 17: మండలంలోని దూబగుంట గ్రామంలో ఆదివారం పోలేరమ్మతల్లి తిరునాళ్ల జరుగుతుందని నిర్వాహకులు ధైండే తిరుపతయ్య, రామాంజనేయులు, శంకర్, ఉడుముల ప్రభాకర్, హనుమంతు, నాగార్జున శివన్నారాయణ, శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. పొంగళ్లు, నైవేద్యంతో పాటు శాంతి పూజలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

మోట్రావులపాడులో ప్రత్యేక పూజలు

పామూరు, ఆగస్టు 17: మండలంలోని మోట్రావులపాడు గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన పోలేరమ్మతల్లి ఆలయంలో శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో యారవ శ్రీనివాసులు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, నాయబ్‌రసూల్, దేవరపు మాల్యాద్రి, కోటపాటి రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కోదండరామునికి పొంగళ్లు

కురిచేడు, ఆగస్టు 17: మండలంలోని కాటంవారిపల్లె గ్రామంలోగల కోదండరామునికి పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని మహిళలు ఆలయం వద్ద పొంగళ్ళు తయారుచేసి స్వామి వారికి సమర్పించారు. స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నిలిచిపోయిన ఎన్‌ఏపీ నీరు

ముండ్లమూరు, ఆగస్టు 17: మండలంలోని పలు గ్రామాలకు వారం రోజులుగా దర్శి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న నీరు నిలిచిపోయింది. దీంతో పది గ్రామాల ప్రజలు తాగునీటికి అలమటిస్తున్నారు. మండలంలోని పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, వేంపాడు, భీమవరం గ్రామాలకు ఎన్‌ఏపీ నీరు నిలిచిపోయింది. దర్శి నుంచి సరఫరా అవుతున్న ఎన్‌ఏపీ పైపులైన్ పసుపుగల్లు వద్ద లీకైందని కారణాలు చెపుతూ నీటిని నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గత్యంతరం లేక గ్రామాల్లో ఉన్న బోర్లు, పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు వెళ్ళి నీటిని తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎన్‌ఏపీ నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వాకర్స్ అందజేత

దొనకొండ, ఆగస్టు 17: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షియల్ అన్ కంట్రోల్ ఆఫ్ ఫ్లోరోసిస్ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంత్ ఆదేశాల మేరకు శనివారం వాకర్స్ అందజేశారు. ఈసందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్‌పీపీఎల్‌ఎఫ్ ప్రతినిధి డాక్టర్ వి.అనీల్‌కుమార్ విద్యార్థులకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తాగునీరు, ఆహార పదార్థాల్లో విటమిన్-సి, కాల్షియం ఉపయోగాలు, ఎటువంటి ఆహారపదార్థాలు తినటం వల్ల ఫ్లోరోసిస్‌ను నివారించవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సునీత, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, టెక్నీషియన్ అంజిరెడ్డి, సీహెచ్‌వో విన్యాసమ్మ, ఏఎన్‌ఎం లీలాభాయి, తదితరులు పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో ఎస్‌ఎంసీ చైర్మన్‌ల ఎన్నిక

ముండ్లమూరు, ఆగస్టు 17: మండలంలోని ఐదు పాఠశాలలకు స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్‌ల ఎన్నిక శనివారం జరగాల్సి ఉండగా, రెండు చోట్ల కోరంలేక వాయిదా పడ్డాయి. సుంకరవారిపాలెం, పులిపాడు తండా, చిన ఉల్లగల్లు పాఠశాలల ఎన్నికలు జరిగాయి. పలుకురాళ్ళ తండా, రెడ్డినగర్ పాఠశాలలకు కోరంలేక వాయిదా పడినట్లు ఎంఈవోలు ఎన్.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు తెలిపారు. సుంకరవారిపాలెం యూపీ స్కూల్ పాఠశాల చైర్మన్‌గా మీనగ బ్రహ్మయ్య పులిపాడు తండా ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా భూక్యా కాశీ నాయక్, చినఉల్లగల్లు ప్రాథమిక పాఠశాల చైర్మన్ గుడిమెట్ల శిరీష్ ఎన్నికైనట్లు ఎంఈవోలు తెలిపారు.

తురకపాలెంలో ఎస్‌ఎంసీ ఎన్నిక మళ్లీ వాయిదా

తాళ్లూరు, ఆగస్టు 17: గతంలో వాయిదాపడిన నాలుగు ఎస్‌ఎంసీ ఎన్నికల్లో తూర్పుగంగవరం జడ్పీహైస్కూల్ ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగిలిన తురకపాలెం, శివరాపురం జడ్పీహైస్కూల్‌ళ్ల, శివరాపురం ప్రాథమిక పాఠశాల (ఏప) ఎస్‌ఎంసీ ఎన్నికలు కోరంలేక వాయిదా పడినట్లు హెచ్‌ఎంలు తెలిపారు. తూర్పుగంగవరం జడ్పీహైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా షేక్ శంషాద్ బేగం, వైస్‌చైర్మన్‌గా చాట్ల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తురకపాలెం జడ్పీహైస్కూల్ ఎన్నిక వాయిదా పడటం టీడీపీ శ్రేణులు నిరుత్సాహపరుస్తుంది. తూర్పుగంగవరం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ అరుణకుమారి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రామలక్ష్మయ్య, వల్లభనేని సుబ్బయ్య, మీరామొహిద్దీన్, జలాలుద్దీన్, చాట్ల డానీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 17: పాఠశాలల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) సభ్యులను పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని మండల విద్యాశాఖ అధికారులు ఆర్.కొండారెడ్డి, జె.ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. విద్యా ప్రవేశ్ పేరుతో పాఠశాలల్లో అమలుచేస్తున్న 90 రోజుల కార్యక్రమాలను ఉపాధ్యాయులు ఆచరించాలన్నారు. మండలంలోని నల్లమడుగుల, సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పాఠశాల సముదాయ శిక్షణ కార్యక్రమాల్లో శనివారం వారు పాల్గొని మాట్లాడారు. డ్రాపవుట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలకు త్వరలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమాల్లో ఎస్‌ఎంసీ చైర్మన్లు బి.డేవిడ్, షేక్ ఖాదరున్నీసా బేగం, సీఆర్పీలు సతీష్‌కుమార్, బేగం, మహేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములపై చట్టసవరణ తగదు!

పామూరు, ఆగస్టు 17: ముస్లిం మైనార్టీల వక్ఫ్ భూములకు సంబంధించిన ఆస్తులను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చట్టసవరణలు తీసుకురావడం తగదని ఆవాజ్ కమిటీ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23న గుంటూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సయ్యద్ రషీద్, సయ్యద్ గౌస్‌బాషా, ఇస్మాయిల్, మస్తాన్, రియాజ్, గులాంరసూల్, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో సవరణలు చేయాలి

కురిచేడు, ఆగస్టు 17: ఓటర్ల జాబితాలో సవరణలు చేయాలని తహసీల్దార్ రజనీకుమారి బీఎల్వోలకు సూచించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నూతన ఎలక్ట్రోరల్ జాబితా తయారుచేయడం, నూతన ఓటర్ల నమోదు పెంచడం, ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించడం, మరణించిన ఓటర్లను తొలగించడం, ఓటు హక్కు గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో కార్యాలయం సిబ్బంది, బీఎల్వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

ముండ్లమూరు, ఆగస్టు 17: ఆటోబోల్తా పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన శనివారం మండలంలోని రమణారెడ్డిపాలెం వద్ద చోటుచేసుకుంది. ప్రమాదంలో వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ(35) అనే మహిళ మృతి చెందగా, డ్రైవర్ బోగాల వెంకటేశ్వరరెడ్డి, షేక్ మీన్‌కు స్వల్పగాయాలయ్యాయి. వేముల గ్రామానికి చెందిన మౌలాబీ, మీన్‌లు వెంకటేశ్వరరెడ్డి ఆటోను మాట్లాడుకొని మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో వంట చేసేందుకు శనివారం ఉదయం వెళ్ళారు. వంట అనంతరం తిరిగి స్వగ్రామమైన వేములకు వెళ్తుండగా రమణారెడ్డిపాలెం గ్రామ ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ సీటు పక్కన కూర్చున్న మౌలా బీ ఆటో కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ వెంకటేశ్వరరెడ్డికి గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం వినుకొండకు తరలించారు. మీన్ గ్రామంలో చికిత్స చేయించుకున్నారు. ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు మౌలాబీ భర్త పది సంవత్సరాల క్రితమే చనిపోయాడు. దీంతో ఇద్దరు పిల్లలు తండ్రి, తల్లి లేని అనాథలయ్యారు. ఆ చిన్నారులు తల్లి మృతదేహంపై పడి ఏడుస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 17: వీధి వ్యాపారిపై అమానుషంగా దాడి చేసిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చెప్పుల బజారులో పారిశుధ్య పనులు సక్రమంగా చేయించాలని ప్రశ్నించినందుకు వాగ్వివాదం చోటుచేసుకుందని తెలిపారు. ఈక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీధి వ్యాపారి కేశవపై దాడి చేయటం బాధాకరమన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

» హద్దులు ఏర్పాటు చేసేందుకు అధికారుల శ్రీకారం


దర్శి - కురిచేడు రోడ్డులో బండిదారిలో నిర్మిస్తున్న గృహాలు

దర్శి, ఆగస్టు 17: ఆక్రమణలకు గురైన కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములు, స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తించే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా సర్వే అధికారులు పట్టణంలోని ప్రభుత్వ స్థలాలకు హద్దులు ఏర్పాటుచేసేందుకు శ్రీకారం చుట్టారు. తొలుత ప్రభుత్వ స్థలాలను పూర్తిగా కొలిచి హద్దులు ఏర్పాటుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆతర్వాత అందులోఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భూములకు, స్థలాలకు రక్షణ లేకుండా పోయింది. కొందరు వైసీపీ నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే ప్రయత్నం చేశారు. కొందరు అక్రమార్కులు ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూముల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వటంతో అధికార యంత్రాంగం కదిలింది. దర్శి-కురిచేడు రోడ్డులోని 244, 247, 248, 266 సర్వే నెంబర్లలో సుమారు పది ఎకరాల బండిదారి భూమి ఉంది. ఆ భూమి విలువ భారీగా పెరిగింది. ఎకరం రూ.కోటికి పైగా ధర పలుకుతోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో అనేకమంది బండిదారి స్థలాన్ని ఎక్కడికక్కడ ఆక్రమించి నిర్మాణాలు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా నిర్మాణాలు చేస్తూనే ఉన్నారు. దీంతో బండిదారి స్థలం సగానికి పైగా ఆక్రమణకు గురైంది.


కుంట కట్టను తెగగొట్టి కబ్జాకు యత్నించిన స్థలం

దర్శి-కురిచేడు రోడ్డులోని 340/5 సర్వే నెంబర్‌లో 80 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. కొంత స్థలం రోడ్డు అవసరాలకు కేటాయించారు. ఇంకా 50 సెంట్లకు పైగా స్థలం ఖాళీగా ఉంది. దర్శి-అద్దంకి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ స్థలం రూ.5 కోట్లకు పైగా విలువ చేస్తుంది. ఈభూమిని అనేకమంది ఆక్రమించే ప్రయత్నాలు చేశారు. ఇటీవల కొంతమంది నకిలీ పట్టాలు సృష్టించి ఆ భూమిని స్వాహాచేసే యత్నం చేశారు. దర్శి రెవెన్యూలోని 1071 సర్వే నెంబర్‌లో 6.5 ఎకరాల కుంట భూమి ఉంది. ప్రస్తుతం అక్కడ ఎకరం రూ.కోటి పలుకుతోంది. ఇప్పటికే కుంట భూమిలో మూడు భాగాలు ఆక్రమించారు. ఇంకా ఒక ఎకరానికిపైగా ఖాళీగా ఉంది. ఇటీవల కొంతమంది కుంట కట్టను కూడా పగులకొట్టి మొత్తం భూమి ఆక్రమించే ప్రయత్నం చేశారు. 1బి రికార్డులు కూడా తారుమారు చేశారు. రికార్డుల్లో కుంట భూమి పేరును రౌండప్ చేసి ప్రైవేట్ వ్యక్తి పేరు ఎక్కించారు.


నకిలీ పట్టాలతో స్వాహాకు యత్నించిన ప్రభుత్వ స్థలం

కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు నకిలీ పట్టాలు సృష్టించటం, రికార్డుల్లో పేర్లు మార్చటం వంటి చర్యలకు పాల్పడి కోట్లాది రూపాయల విలువచేసే భూములు, స్థలాలను ఆక్రమించారు. మిగిలిన భూములను కూడా ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారు. పలు ప్రైవేట్ వెంచర్లలోకి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలనూ కలుపుకొని ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారు. కురిచేడు రోడ్డులో ఒక లేవుట్‌లో 30 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కలుపుకొని ప్లాట్లు వేసి అమ్ముకున్నారు. లంకోజనపల్లి రోడ్డు, పొదిలి రోడ్డులో కూడా రెండు వెంచర్లల్లో ప్రభుత్వ స్తలాలను కలుపుకొని స్వాహా చేశారు. దర్శి పట్టణ సమీపంలోని కాటేరు వాగును పూర్తిగా ఆక్రమించి అనేకమంది గృహాలను నిర్మించుకున్నారు. మరికొందరు ప్రహరీ గోడలు ఏర్పాటుచేసుకొని తమ ఆధీనంలో ఉంచుకొని అనుభవిస్తున్నారు. రెవెన్యూ అధికారులు దర్శి పట్టణంలోని విలువైన ప్రభుత్వ భూములు, స్థలాలను చాలావరకు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుడతామని దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

భూఅక్రమాలపై ప్రత్యేక బృందాలతో విచారణ

» ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, ఆగస్టు 17: కనిగిరి ప్రాంతంలో జరిగిన భూఅక్రమాలపై ప్రత్యేక బృందాలతో విచారణ చేపడుతున్నట్లు ఆర్డీవో జాన్‌ఇర్విన్ తెలిపారు. శనివారం జిల్లా మెయిన్‌లో 'భూ ప్రకంపనలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేక సర్వే చేస్తున్నట్లు తెలిపారు. 40 గ్రామాల్లోని అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ కింద మొదటి విడత కింద గుర్తించినట్లు చెప్పారు. వాటిల్లో 38 గ్రామాల్లోని అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ కింద వివిధ కేటగిరీల కింద పరిగణలోకి తీసుకున్నట్లు చెప్పారు. వాటిలో 25వేల ఎకరాలు ఫ్రీహోల్డ్ కింద నమోదు చేయాల్సి ఉండగా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేవలం 45 రోజుల్లో ప్రక్రియ ముగించటం జరిగిందన్నారు. 23 గ్రామాల్లోని భూములను మాత్రమే తొలిదశలో ఫ్రీహోల్డ్ కింద 11వేల 892 ఎకరాలు నమోదు చేసినట్లు తెలిపారు. వాటిలో కేవలం 630 ఎకరాలు మాత్రమే ఇప్పటికీ కొనుగోలు కింద 268 ఎకరాలు, బహుమతి (గిఫ్ట్) కింద 360 ఎకరాలు, పార్టిషన్ కింద మరో రెండు ఎకరాలు రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిపారు.

గత ప్రభుత్వంలో ఆయా భూములను ఆన్‌లైన్ ఆధారంగా పరిగణనలోకి తీసుకుని నమోదు చేసినట్లు ఆర్డీవో పేర్కొన్నారు. కొంతమంది అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి అక్రమంగా ఆన్‌లైన్ పొందటంతో వాటి ఆధారంగా ఫ్రీహోల్డ్ ప్రక్రియలో కొన్ని పొరపాట్లు జరిగినమాట వాస్తవమేనని చెప్పారు. ప్రస్తుతం అలాంటి అక్రమాలను వెలికితీస్తున్నట్లు తెలిపారు. అక్రమాలు రుజువైతే వాటిని తొలగించి వాస్తవ అర్హుల పేరుతో నమోదు చేస్తామని తెలిపారు. కనిగిరి నియోజకవర్గంలో ప్రత్యేకంగా 13 బృందాలు ఫ్రీహోల్డ్ భూములతో పాటు అసైన్డ్ భూములు, ఆయా భూముల హక్కుదారులు, భూమిలో ఎవరు ఉన్నారనేది వాస్తవాలు తేల్చనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ కోసం 70 మంది రెవెన్యూ సిబ్బంది, అధికారులు, ముగ్గురు స్పెషల్ కలెక్టర్‌లు టీమ్ వర్క్ చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ప్రతిరోజూ వీఆర్వో, తహసీల్దార్, డీటీలతో సమీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్న ట్లు ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు.

పల్లెల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠినచర్యలు


పలుకురాళ్ళ తండా గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు, ఆగస్టు 17: ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శనివారం కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని పలుకురాళ్ళ తండా గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ ప్రశాంతంగా జీవనం సాగించే పల్లెల్లో అలజడులు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాలలో జరిగే యాజమాన్య కమిటీ చైర్మన్ ఎంపిక విషయంలో పంతాలకు పోకుండా అందరికీ ఆమో దయోగ్యమైన వ్యక్తిని ఎన్నుకొని పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వెనుకబడిన పలుకురాళ్ళ తండాలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. ఏగ్రామం లోనైతే నూరు శాతం అక్షరాస్యత ఉంటుందో ఆ గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ దిశగా ఆలోచించి గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ వి.నాగమల్లేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఆలయ భూముల్లో హద్దుల ఏర్పాటు


దేవస్థాన భూములను పరిశీలిస్తున్న ఈవో నరసింహబాబు

పామూరు, ఆగస్టు 17: పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వర స్వామి దేవస్థానాలకు సంబంధించిన భూములకు హద్దులు ఏర్పాటుచేశారు. ఎండోమెంట్ జిల్లా అధికారి కె.జనార్దన రెడ్డి ఆదేశాల మేరకు ఈవో గిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, దేవస్థాన కమిటీ, సిబ్బంది సహకారంతో శనివారం సర్వే నిర్వహించి హద్దురాళ్ళు ఏర్పాటుచేశారు. దేవాలయ భూముల పరిరక్షణ చర్యల్లో భాగంగా వేణుగోపాలస్వామికి చెందిన సర్వే నెంబర్ 256/2లో 29.33 ఎకరాలు, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామికి చెందిన సర్వే నెంబర్ 406/1లో 4.04 ఎకరాలు, 329/2లో 2.41 ఎకరాలు, 329/1లో 2.91 ఎకరాల భూములను సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేశారు. దేవస్థాన భూముల్లో కొంతమంది అక్రమంగా వెంచర్లు, ప్లాట్లు, మరికొంత మంది నిర్మాణాలు చేపట్టారని ఈవో తెలిపారు. ఆలయ భూములను ఆక్రమించిని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని వాటిని స్వాధీనం చేసుకొంటామన్నారు. దేవస్థాన భూముల్లో వేసిన ప్లాట్లను కొని మోసపోవద్దని ఈవో సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు రఘురామ్, భజరంగ్‌దళ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కరువు

» పలుచోట్ల నిరసనలు


పామూరులో నిరసన ర్యాలీ చేస్తున్న డాక్టర్లు

పామూరు, ఆగస్టు 17: ప్రజల ఆరోగ్యాలను కాపాడే వైద్యులకు రక్షణ కరువైందని ప్రభుత్వ డాక్టర్ విజయకుమార్, ప్రయివేట్ డాక్టర్స్ యూనియన్ అధ్యక్షుడు డాక్టర్ చెన్నకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ దేశవ్యాప్త వైద్య సేవలు బంద్‌లో భాగంగా శనివారం పామూరులో కార్యక్రమం నిర్వహించారు. వైద్య సేవలు నిలుపుదల చేసి పట్టణంలో రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు.


తాళ్లూరులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

ఈ నిరసన కార్యక్రమంలో డాక్టర్లు గద్దె ఏడుకొండలు, వై.శ్రీనివాసులు, వెంకట్ కాలే, కె.సురేష్, దీక్షితులు, టి.రమాదేవి, మల్లికార్జున, సుభాని, శ్రీకాంత్, కార్తీక్, నయూమ్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో పాల్పడకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టి చర్చి సెంటరు వద్ద మానవహారం నిర్వహించారు.

ఈసందర్భంగా ఐద్వా నేతలు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణే లేకుండా పోయిందని విమర్శించారు. మాచవరం పీహెచ్‌సీ వద్ద వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు.

తాళ్లూరులో నిరసన ర్యాలీ

తాళ్లూరు, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ తాళ్లూరు, తూర్పుగంగవరంలో శనివారం వైద్యశాఖ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఖాదర్‌మస్తాన్ బీ, డాక్టర్ మౌనిక మాట్లాడుతూ వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, శ్రీకాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరిలో కొవ్వొత్తుల ర్యాలీ

కనిగిరి, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన ఘటనపై శనివారం కనిగిరిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ వైద్యులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ అబ్దుల్‌కలాం మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలకు భవిష్యత్తులో పాల్పడకుండా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.



కనిగిరిలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టిన మహిళలు

అంతర్రాష్ట్ర దొంగ దొరికాడు

» రూ.40 లక్షల సొత్తు రికవరీ » వివరాలు వెల్లడించిన ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఆగస్టు 17: దొంగ దోచుకెళ్లిన సొత్తును వారం రోజుల వ్యవధిలోపలే పోలీసులు తిరిగి తెచ్చి ఇచ్చారు. దీంతో ఆనంద భాష్పాలతో ఎస్పీ కాళ్ల మీద పడి మరీ 'పోలీస్ జిందాబాద్' అంటూ బాధిత ఇంటి యజమాని కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ ఘటన అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈనెల 9న నగరంలోని కాకతీయనగర్‌కు చెందిన గుమ్మడి నాగార్జున స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో వివాహానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి తిరిగి రాత్రి 1గంటకు వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డారు. 50 సవర్ల ఆభరణాలు, రూ.1.80లక్షల నగదుతోపాటు బైక్ అపహరించుకువెళ్లారు. ఆ కేసును అత్యంత వేగంగా దర్యాప్తు చేసిన పోలీసులు దొంగను పట్టుకొని రూ.40లక్షలు సొత్తును రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్.దామోదర్ మాట్లాడుతూ ఆ కేసులో నిందితుడైన అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వెదిరేశ్వరంనకు చెందిన పలివెల ప్రభుకుమార్‌ను రైల్వేస్టేషన్ సమీపంలో వెంకటేశ్వర లాడ్జిలో ఒంగోలు టూటౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. అతని వద్ద రూ.40లక్షల విలువైన బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై రెండు తెలుగు రాష్ట్రాలలో 25 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను జాగ్రత్త చేసుకోవాలన్నారు. అనుమానితులు కనిపిస్తే 112 నంబరుకు తెలియజేయాలని చెప్పారు. కేసును త్వరగా ఛేదించిన పోలీసులకు రివార్డులను అందజేశారు.

సమావేశంలో చోరీకి గురైన సొత్తును చూడగాని బాధిత ఇంటి యజమాని గుమ్మడి నాగేశ్వరరావు ఆనందభాష్పాలతో ఉప్పొంగిపోయాడు. చోరీకి పాల్పడిన సొత్తును వారంరోజులలో దర్యాప్తు చేసి తిరిగి తెచ్చి ఇచ్చిన పోలీసులకు అభినందనలు తెలిపారు.


కేసును అత్యంత వేగంగా ఛేదించిన ఒంగోలు టూటౌన్ సీఐ జగదీష్, ఏఎస్సైలు బాలాంజనేయులు, సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్‌కే ఖాజావలి, సాయికృష్ణ, కానిస్టేబుళ్లు వి.శ్రీనివాసులు, అంజిబాబు, రఘు, రవికుమార్‌లను ఎస్పీ ప్రశంసించి రివార్డులు అందజేశారు





గుంటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

విష జ్వరాల పంజా



● చీరాల: ఏరియా వైద్య శాలలో జ్వరంతో రోగులు

డెంగీ జ్వరం దడపుట్టిస్తోంది.. టైఫాయిడ్ విజృంభిస్తోంది.. మలేరియా నేనెక్కడకీ పోలేదంటున్నది. మొత్తం మీద వైరల్ జ్వరాలతో పల్లె పట్టణం అన్న తేడా లేకుండా వణికిపోతోంది. వాతావరణంలో చోటు చేసుకుంటోన్న మార్పులు.. అపరిశుభ్రత.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తదితరాల కారణంగా విష జ్వరాలు ప్రభలుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఇటీవల పలు ప్రాంతాల్లో మరణాలు కూడా సంభవించాయంటే జ్వరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. పల్లెలు మంచం పట్టగా ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల నుంచి గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు జ్వర పీడితులు బారులు తీరుతున్నారు. ఇక ప్రైవేటు వైద్యశాలల్లో అయితే ఐసీయూలు కూడా డెంగీ లక్షణాలతో ఉన్న వారితో నిండిపోయినట్లు సమాచారం. అధికారికంగా డెంగీ కేసులను వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించకపోయినా పలు పల్లెలు, పట్టణాల్లో పలువురు అల్లాడుతున్నట్లు తెలుస్తోంది. జ్వరాల తో ప్రజలు వణికిపోతున్నా అధికారులు తూతూ మంత్రపు చర్యలతో నిర్లక్ష్యాన్ని వీడటంలేదన్న విమర్శలు వస్తున్నాయి.

- డెంగీ దడ.. టైఫాయిడ్ విజృంభణ
- వైరల్ జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు
- రోజురోజుకూ పెరుగుతున్న జ్వరపీడితులు
- మంచం పట్టిన పల్లెలు.. ఆస్పత్రులు కిటకిట
- మరణిస్తున్నా.. తూతూమంత్రంగా శిబిరాలతో సరి
- పడకేసిన పారిశుధ్యం.. పట్టీపట్టనట్లుగా అధికారులు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: జ్వరం... ఈ పదం ఇప్పుడు అందరినీ భయపెడుతోంది. ప్రధానంగా టైఫాయిడ్, మలేరియా, ఫ్లూ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎక్కడ ఎవరికి ఏ కారణంతో జ్వరం వచ్చినా అది డెంగీ భూతమేమోనని జనం హడలిపోతున్నారు. జలుబు, దగ్గుతో ప్రారంభమయ్యే జ్వరాలు గతంలో 3, 5 రోజుల్లో తగ్గేవి. అయితే ప్రస్తుతం వస్తున్న జ్వరాలు తీవ్ర స్థాయిలో ఉండటం.. ఒకటి రెండు రోజుల్లోనే నీరసంతో యువకులు సైతం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం లేక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో వారు మరింతగా జ్వరపీడితులను, వారి కుటుంబసభ్యులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. డెంగీ జ్వరమని చెప్పడం.. ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గిపోతుందంటూ దోపిడీ చేసేస్తున్నారు. కాలానుగుణంగా వచ్చే మలేరియా.. డెంగీ.. టైఫాయిడ్ కేసులు గుబులు రేపుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. చిన్న పిల్లల్లో టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జ్వరాల కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. జ్వరం అనుకుని తొలుత ఇంటి దగ్గర్లోని షాపుల్లో మందులు తెచ్చుకుని వినియోగిస్తున్నారు. జ్వరం ఎంతకీ తగ్గకపోతుండటంతో రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు. జ్వర పీడితుల్లో చిన్నారులు ఎక్కువగా ఉంటున్నారు. జ్వర పీడితుల్లో ప్లేట్‌లెట్స్ స్థాయి పడిపోయి ప్రాణాంతకంగా పరిణమిస్తోంది.

- నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల జరిపిన రక్త పరీక్షల్లో 7 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇక ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా డెంగీ కేసులు నమోదవుతున్నట్లు వైద్యులు తెలిపారు. నరసరావుపేటలోని ప్రైవేట్ రక్త పరీక్ష కేంద్రాలు రెండింటిలో జ్వరాల కేసుల నమోదును పరిశీలించగా పది మందికి రక్త పరీక్షలు చేయగా రెండు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. వినుకొండ మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో వైరల్ జ్వరాలతో గ్రామీణులు అల్లాడుతున్నారు. ఊపిరాడని దగ్గు, తుమ్ములు, జ్వరంతో పిల్లలు పలువురు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన లక్ష్మీతిరుపతమ్మ, గాలం సింహాద్రి, గాలం రాణీలు వైరల్ జ్వరాలతో అల్లాడుతున్నారు. మండిపోతున్న జ్వరాలతో, వైద్యసిబ్బంది వచ్చేదాక ఆగలేక పలువురు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నందునే తాము ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు. రొంపిచర్ల మండలం రొంపిచర్ల రెడ్డిపాలెం పరిధిలోని గ్రామాల్లో మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీల వద్ద వైద్య చికిత్సలు చేయించుకుంటున్నా పరిస్థితి అదుపులోకి రావడంలేదు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలో పల్లె, పట్టణం, చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా జ్వరాలు చుట్టేస్తున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు సగటున జ్వరాలతో వచ్చే వారి సంఖ్య 40 వరకు ఉందని వైద్యులు తెలిపారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు సాధారణ జ్వరాలతో వచ్చే వారు రోజుకు 30 నుంచి 50 మంది వరకు ఉంటున్నట్లు సమాచారం. ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో జ్వర పీడితులు పెద్దవారు 450 మంది, చిన్న పిల్లలు 70 మంది చికిత్స పొందారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంకా స్పత్రిలో వివిధ గ్రామాలకు చెందిన జ్వర పీడితులు 20 మంది వరకు ఉన్నారు. ఇద్దరు ముగ్గురు డెంగీతో చికిత్స పొంది వెళ్లారు. ఈ 20 మందిలో టైఫాయిడ్ బాధితులు కూడా ఉన్నారు. అచ్చంపేట మండలం కొండూరు, నిండుజర్ల, తాడువాయి గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. ఎక్కువ మందికి టైఫాయిడ్ జ్వరాలని సమాచారం. దాచేపల్లి మండలంలోని శ్రీనగర్, పొందుగల, శ్రీనివాసపురం, దాచేపల్లిలోని జలగడబజార్, మస్కిట్‌బజార్, వడియరాజుల కాలనీ, నడికూడిలోని ఎస్సీ కాలనీ, నారాయణపురంలో జ్వరంతో బాధపడే వారి సంఖ్య అధికంగా ఉంది. రక్తకణాలు పడిపోవడంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాలపై దృష్టి సారించలేదు.



దాచేపల్లి: ప్రైవేటు వైద్యశాలలో బెడు లేక కుర్చీలో సెలైన్ ఎక్కిం చుకుంటున్న రోగులు

ఇప్పటికే దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలలన్నీ రోగులతో కిటకిటలాడిపోతున్నాయి. ప్రైవేటు వైద్యశాలలో బెడ్లు లేక కుర్చీలలోనే కూర్చొని సెలైన్‌లు పెట్టించుకోవడం చూస్తుంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తుంది.

● బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో విష జ్వరాలతో పలువురు మంచంపట్టారు. గ్రామంలో ఒకరు డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు తెలిసిన అధికారులు హడావుడిగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తిస్తున్నారు. మూడురోజులపాటు జ్వరం తగ్గని అనేకమందిని ఆస్పత్రులకు తరలించారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ఇప్పటికీ జ్వర పీడితులు అనేక మంది ఉన్నారు. వైద్య శిబిరం కొనసాగిస్తున్నప్పటికి జ్వరాలు అదుపులోకి రాలేదు. బాపట్ల పట్టణంలోని 2వ వార్డు రామకృష్ణాపురంలో ఓ వ్యక్తికి తీవ్రమైన జ్వరంతో గుంటూరులో వారం నుంచి చికిత్స పొందుతున్నారు. చీరాల ఏరియా వైద్యశాలకు ప్రతిరోజూ సరాసరిన 350 ఓపీలు వస్తుండగా అందులో సుమారు 50 నుంచి 60 మంది వరకు జ్వరపీడితులు ఉంటున్నారు. అందులో రమారమి 10 శాతం మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే వారిలో సగం మంది జ్వరపీడితులు ఉంటున్నారు.

● చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం విష జ్వరాలతో మంచం పట్టింది. విష జ్వరాలతో ఇటీవల ఆరుగురు ఆస్పత్రిలో చేరారు. విష జ్వరాలతో బాధపడుతున్న తాతారావు(65), కృష్ణ కుమారి(52) నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. విష జ్వరాలతో ఇద్దరు మృతితో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్పటికప్పుడు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య శిబిరంలోనే 30 మంది జ్వర పీడితులు, జ్వర లక్షణాలతో ఉన్నవారిని గుర్తించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



వినుకొండ : ఉప్పరపాలెంలో దగ్గు, జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు

మంచినీరే.. స్థావరం

అందరినీ భయపెడుతున్న డెంగీ కారక వైరస్‌ను మోసుకొచ్చే దోమ ఈడీస్ ఈజిప్టు. ఈ దోమ పగటి పూట మాత్రమే సంచరిస్తుంది. అది కూడా రోజుకు రెండు సార్లు ఆకలి అయినప్పుడు మాత్రమే ఉదయం, సాయంత్రం రక్తం తాగుతుంది. ఇది నివాసం ఏర్పర్చుకున్న పరిసరాన్నుంచి కేవలం 30 అడుగుల దూరం మాత్రమే ప్రయాణిస్తుంది. అది కూడాభూమి కన్నా రెండు అడుగులు మించి లెగవదు. అది కూడా ఆడదోమ మాత్రమే. ఇది మురుగులో ఉండదు. ఇది మంచినీటిపైనే గుడ్లు పెడుతుంది. ఇంట్లో వాడకుండా వదిలేసిన పాత సామాన్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పూల కుండీలు వాటర్ ట్యాంక్‌పై ఉండే చిన్న చిన్న రంధ్రాలు వాటిలో చేరిన వర్షపు నీరును ఇది స్థావరంగా ఏర్పర్చుకుంటుంది. 15 రోజుల పాటు మన ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎటువంటి మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే మన కుటుంబం డెంగీ బారిన పడనట్లే. కేవలం మన పరిసరాల పరిశుభ్రతే మనల్ని డెంగీ నుంచి కాపాడుతుంది.

డెంగీ.. కంగారు

డెంగీతో ప్లేట్‌లెట్లు తగ్గిపోయాయంటూ రోగులు, వైద్యులు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రతి జ్వరానికి ప్లేట్‌లేట్ల పరీక్ష పేరిట రోగులను భయపెట్టి అందిన కాడికి దండుకున్నారు. వాతావరణ మార్పుల కారణంగా విస్తరిస్తోన్న వైరల్ జ్వరాల్లో 90 శాతం సాధారణ ఫ్లూ జ్వరాలే. అయితే వైద్యులు వ్యాపార రీత్యా డెంగీతో పాటు ప్లేట్‌లెట్ల సంఖ్య పరీక్షలను సూచిస్తున్నారు. ప్రైవేటు ల్యాబుల్లో చేస్తున్న పరీక్షల్లో నూటికి 90 మందికి డెంగీ ఉన్నట్లుగానే చూపుతుంది. దీనికితోడు అక్కడక్కడ సంభవిస్తున్న మరణాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దోమల ఫాగింగ్ శూన్యం



ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు నగరం నుంచి పల్నాడు, బాపట్ల జిల్లా కేంద్రాలతో పాటు పల్లెలు, పట్టణాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటిపోయింది. గతంలో కురిసిన వర్షాలతో అపరిశుభ్రత తాండవిస్తోంది. రాత్రిళ్లు కాదు పగలు కూడా దోమల విజృంభణతో ప్రజలు అల్లాడుతున్నారు. దోమలు, అపరిశుభ్రత కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేదు. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో దోమల నివారణ చర్యలను గాలికొదిలేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడమే మున్సిపాల్టీలు మరిచిపోయాయి. వారానికోసారి కూడా ఫాగింగ్ జరగడంలేదు. మురుగు కాల్వల్లో దోమల నివారణ మందుల పిచికారి చేయడాన్నే మానేశాయి. పల్లెలు, పట్టణాల్లోని కాలనీలు జ్వరాలతో మంచం పట్టినట్లు మీడియాలో కథనాలు వచ్చిన సందర్భాల్లో వైద్య ఆరోగ్యశాఖ హడావుడిగా వైద్యశిబిరాలను నిర్వహిస్తోంది.

ప్రాణదాతలకు రక్షణేది?



● కోల్‌కతా ఆర్జీకర్ వైద్యశాల ఘటనపై నిరసన
● ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో విధుల బహిష్కరణలు ● ఎక్కడికక్కడ ప్రదర్శనలు, ధర్నాలు, అధికారులకు వినతుల సమర్పణలు


ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో ట్రైనీ పీజీ వైద్యురాలి హత్యాచారాన్ని నిరసిస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వైద్యుల నిరసనలు మిన్నంటాయి. రోగుల ప్రాణాలు నిలబెట్టే వైద్యులకే రక్షణ లేకుండా పోతుందంటూ నిరసన తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ ప్రైవేటు వైద్యశాలలు బంద్ చేసిన వైద్యులు ప్రదర్శనలు చేపట్టారు. గుంటూరులో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు లాడ్జి కూడలిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రభుత్వ సమగ్రాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యులపై దాడులు చేసే వారిని నాన్ బెయిలబుల్ సెక్షన్‌తో పాటు భారీ జరిమానా విధించేలా చట్టం తేవాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎలెక్ట్ డాక్టర్ గార్లపాటి నందకిషోర్ కోరారు. టీడీపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి, భారతీయ జనతాపార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గుంటూరులో మహిళలు నోటికి నల్లరిబ్బన్లు ధరించి, వెలుగుతున్న కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. వారం రోజులుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో విధులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతుగా శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీ జీడీఏ) గుంటూరు యూనిట్ సభ్యులు ధర్నా చేశారు. కలకత్తాలో పీజీ విద్యార్థిని ఘటనపై రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో గుంటూరు లో కొవ్వొత్తులతో నిరసన జరిగింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ విద్యార్థులు కోల్‌కత్తా ఘటనకు సంతాపంగా శనివారం యూనివర్సిటీలోని అబ్దుల్ కలాం విగ్రహం నుంచి ముఖ ద్వారం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల విద్యార్థులు కళాశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి నల్లబ్యాడ్జ్‌లతో నిరసన తెలిపారు. చేబ్రోలు పరిధిలోని వడ్లమూడి డీవీసీ హాస్పల్ వైద్యులు, సిబ్బంది ఓపీ సేవలు నిలిపివేసి నిరసన ప్రదర్శన చేశారు. చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల విద్యార్థులు గౌతమబుద్ధరోడు మీదగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ చేశారు. నరసరావుపేటలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు నిరసన ప్రదర్శన చేశారు. కలెక్టరేట్లో అధికారులకు, అడ్మిన్ ఏఎస్పీల కు వినతిపత్రాలు అందజేశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెం డెంట్ డాక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆస్పత్రి వైద్యులు, వైద్య సిబ్బంది రెండు గంటల పాటు విధులు బహిష్కరించి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. శావల్యాపురం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. పీహెచ్‌సీ నుండి శావల్యాపురం సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో, కర్లపాలెం, కొల్లూరు, నాదెండ్ల, రెంటచింతల, తాళ్ళూరు, కారంపూడి, ఫిరంగిపురం మండలం నుదురుపాడు పీహెచ్‌సీ, మాచవరం, దాచేపల్లి జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా వైద్యులు, సిబ్బంది నిరసనలు తెలిపారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాల, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యాన బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. తహసీల్దార్ జియాఉల్‌హక్‌కు వినతిపత్రం అందించారు. చిలకలూరిపేటలో వైద్యులు వైద్య సేవలు నిలిపి వేసి నరసరావుపేట సెంటర్‌లో మానవహారంగా బహిరంగ నిరసన తెలిపారు. రేపల్లెలో ఐఎంఏ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఆర్డీవో హేలా షారోన్‌కు వినతిపత్రం అందించారు. బాపట్ల కొత్తబస్టాండ్ దగ్గర నుంచి గడియారస్తంభం మీదగా అంబేద్కర్ సర్కిల్ వరకు వైద్యుల నిరసన ప్రదర్శన జరిగింది.



బాపట్ల పట్టణంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

భూముల క్రమబద్ధీకరణ జరిగేనా?

- గత ఏడాది 800 మందికి పైగా దరఖాస్తు
- ప్రభుత్వం మారడంతో ఉత్తర్వులు పెండింగ్
- కూటమి సర్కారు దృష్టి పెట్టాలంటున్న యజమానులు



గుంటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ భూ పరిమితుల చట్టం(యూఎల్‌సీ) కింద సీలింగ్ భూముల క్రమబద్ధీకరణ ఎండమావిగా మారింది. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం రెగ్యులరైజేషన్ జీవోలు ఇవ్వడం, వాటికి ఆశపడి భూ యజమానులు దరఖాస్తు చేసుకోవడం, ఆ తర్వాత ఏదో ఒక సాకు చూపించి క్రమబద్ధీకరణ చేయకపోవడం పరిపాటిగా మారింది. చివరిసారిగా కొన్ని నిబంధనలను సడలించి గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు దరఖాస్తుకు అనుమతి ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఎన్నికల వాతావరణం వచ్చేయడంతో నేటి వరకు రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ఎలాంటి నిర్ణయం రెవెన్యూ శాఖ నుంచి వెలువడలేదు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా తమ దరఖాస్తుల విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని భూయజమానులు కోరుతున్నారు. జిల్లాలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద ఐదు రెవెన్యూ గ్రామాల కింద సీలింగ్ భూములను గుర్తించారు. గుంటూరు, కొరిటెపాడు, నల్లపాడు, ఆర్ అగ్రహారం, అంకిరెడ్డిపాలెం రెవెన్యూ గ్రామాల్లో 98 హెక్టార్ల సీలింగ్ భూములున్నాయి. నగర జనాభా పెరిగిపోవడంతో సీలింగ్ భూములన్నింటిలో పెద్ద పెద్ద భవనాల నిర్మాణం జరిగాయి. వీటిపై రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా సంపూర్ణ హక్కుల కల్పన జరగడం లేదు. 2019 మే ఒకటో తేదీ నాటికి ఆయా స్థలాల్లో నివాసం ఉన్న వారికి రిజిష్టర్ డాక్యుమెంట్ ఉంటే వారంతా క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని గత ఏడాది ప్రభుత్వం కల్పించింది. 150 చదరపు గజాల వరకు ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు ఉన్న వారికి ఉచితంగానే డీ-పట్టా మంజూరు చేస్తామని ప్రకటించారు. 150 నుంచి 300 చదరపు గజాల వరకు బేసిక్ విలువలో 15 శాతం ప్రభుత్వానికి చెల్లించాలి. అదే 300 నుంచి 500 చదరపు గజాల వరకు అయితే మూల విలువలో 30 శాతం, 500 చదరపు గజాల పైన అయితే 100 శాతం బేసిక్ విలువని చెల్లించాలని నిబంధనలు పెట్టింది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా దరఖాస్తుల పరిశీలనకు ఒక కమిటీని కూడా ప్రభుత్వం అప్పట్లో నియమించింది. జాయింట్ కలెక్టర్‌ని మెంబర్ సెక్రెటరీగా, సభ్యులుగా గుంటూరు ఆర్‌డీవో, జిల్లా సర్వే అధికారి, రిజిస్ట్రార్‌లను నియమించింది. ఆ మేరకు జిల్లాలో 800లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూవర్గాలు తెలిపాయి. వాటిని ప్రభుత్వానికి నివేదించామని, అయితే అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆర్డర్స్ రాలేదని చెబుతున్నాయి. కాగా 150 చదరపు గజాలకు పైగా విస్తీర్ణం కలిగిన కేటిగిరీలకు చెందిన వారు నగదు చెల్లించి దాదాపుగా ఎనిమిది నెలలు పూర్తి కావొస్తున్నది. దీంతో వారంతా ఆవేదన చెందుతున్నారు.

వర్సిటీలో రేపు ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

పెదకాకాని, ఆగస్టు 17: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఈనెల 19 వరల్డ్ ఫొటోగ్రఫీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ జి.అనిత శనివారం తెలిపారు. అదే రోజు పలువురు ఫొటోగ్రాఫర్లకు బహుమతులు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఫొటో గ్రఫీ డిప్లమా కోర్సు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఫొటోగ్రాఫర్లకు అదే రోజు న ఎంఎల్‌ఏ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా బహు మతి ప్రదానం చేయనున్నారు. ఉదయం 11 గంటలకు ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్ఐడీ బ్లాక్‌లో ఉన్న ప్రొఫెసర్ వై.ఆర్.హరిగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

పోటీలలో విజేతలు...

ఫొటోగ్రఫీ విభాగం నిర్వహించిన కాంటెస్ట్‌లో విజేతలను ప్రకటించారు. వారిలో మోనోక్రోమ్ విభాగంలో ఉత్తమ ఫొటోకు బ్రహ్మయ్య వంగపల్లి, కలర్ ఫొటో విభాగంలో వానం శరత్‌బాబు, నేచర్ అండ్ వైల్డ్‌లైఫ్ విభాగంలో బి.సుబ్రహ్మణ్యం, ఫొటో జర్నలిజం విభాగంలో ఉదయన్ శంకర్‌పాల్, ట్రావెల్ ఫొటోగ్రఫీలో అర్రబోయిన శంకర్ విజేతలుగా నిలిచారు. వీరితోపాటు ప్రోత్సాహక బహుమతుల ను కూడా అందించనున్నట్లు డాక్టర్ జి.అనిత తెలిపారు.

దేవాలయాల్లో దొంగతనాల కేసుల్లో నిందితుల అరెస్టు

● సుమారు రూ.16,99,700 విలువైన వస్తువులు స్వాధీనం

బాపట్లరూరల్, ఆగస్టు 17: దేవాలయాల్లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సెంట్రల్ క్రైమ్ పోలీసుస్టేషన్ ఆవరణంలో విలేకర్ల సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీ కేసు వివరాలను వెల్లడించారు. తెనాలికి చెందిన కారంపూడి విజయ్‌కుమార్, తాడిపత్రి సాయి, చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన బండికట్ల పవన్‌కళ్యాణ్ అనే ముగ్గురు నిందితులు గత మూడునెలల నుంచి దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఉన్న దేవాలయాలలో దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులను శనివారం మధ్యాహ్నం చుండూరు మండలం ఆళ్ళపాడు వంతెన వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. నిందితులపై గతంలో గుంటూరు, విజయవాడ, తెనాలి, పల్నాడు జిల్లాల్లో కూడా కేసులు ఉన్నాయని తెలిపారు. బాపట్ల సీసీఎస్ పోలీసుస్టేషన్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రేమయ్య, చుండూరు సర్కిల్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేకబృందాలను ఏర్పాటుచేసి నిందితులను పట్టుకున్నామన్నారు. నిందితుల నుండి రూ.6లక్షల 9వేల 700 విలువైన వెండి, రూ.10లక్షల 55వేల విలువైన 10బైక్‌లు, రూ.35వేల విలువైన స్మార్ట్ టీవీ మొత్తం రూ.16లక్షల 99వేల 700 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

● జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు

బాపట్ల, ఆగస్టు 17 : విజన్ బాపట్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు తెలిపారు. వికసిత ఆంధ్ర కార్యక్రమంపై అన్నిశాఖల జిల్లా అధికారులతో ఒకరోజు వర్క్‌షాపు శనివారం కలెక్టరేట్‌లో జరిగింది.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల తలసరి ఆదాయం పెరిగేలా సహజ వనరుల సద్వినియోగంపై అధికారులు దృష్టిసారించాలని చెప్పారు. అభివృద్ధి పెరుగుదల ఉండాలని, లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పెరుగుతున్న జనాభాకు తగినట్టుగా భవిష్యత్తులో ఉత్పత్తి రంగాల ఉత్పాదకత ఉండేలా చూడాలన్నారు. ఇందు కోసం విజన్ బాపట్ల ఉండాలని వివరించారు. బాపట్ల జిల్లా జీడీపీ పెరగాలంటే సాంఘిక సంస్థాగత అభివృద్ధికి సదుపాయాలు సమకూర్చాలని జేసీ తెలిపారు. ఆర్థిక వ్యవస్థ మెరుగుపడాలంటే సమసమగ్ర ప్రణాళిక ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా ఆదాయ వృద్ధి 36,577 కోట్ల రూపాయలు ఉందన్నారు. జిల్లా వ్యవసాయ రంగంలో 56.09 శాతం కాగా, పరిశ్రమల ద్వారా 16.10 శాతం ఉండగా, సర్వీస్ సెక్టార్‌లలో ఆదాయం 27.81 శాతం ఉందన్నారు. మొత్తంగా బాపట్ల జిల్లా అభివృద్ధి రేటు 7.59 శాతం ఉండగా రాష్ట్రంలో జిల్లా ఉత్పత్తి ఆదాయం 2.81 శాతంగా ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

15శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, అందుకు రానున్న ఐదేళ్లలో ఏడాదికి 15శాతం వృద్ధి సాధించే దిశగా జిల్లాస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశపు హాలులో శనివారం జిల్లా అధికారులతో వికసిత్ ఆంధ్ర 2047, జిల్లా కార్యచరణ ప్రణాళికపై జరిగిన వర్క్‌షాపులో కలెక్టర్ మాట్లాడారు. నీతి ఆయోగ్ సహాయ సహకారంతో నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించుకొని అన్ని ప్రాథమిక రంగాల్లో అభివృద్ధికి వంద రోజులు, సంవత్సర ప్రణాళికలను తయారు చేయాలన్నారు. జిల్లాలో జీడీపీని వృద్ధి చేసుకునేందుకు వ్యవసాయ, ఉద్యాన అనుబంధ, పారిశ్రామిక, ఆక్వా తదితర రంగాల ద్వారా మెండైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యాన పంటల విస్తరణ దిశగా రైతులను ప్రోత్సహించాలన్నారు. చిన్నతరహా పరిశ్రమలను, పెద్ద క్లస్టర్‌గా అనుసంధానం చేసి అవసరమైన రుణ సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణకు మండలాల వారీగా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలుత జిల్లా ప్రణాళికపై సీపీవో వెంకటేశ్వర్లు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మాధురి, వసుంధర, డాక్టర్ బేబిరాణి, భరద్వాజ్, శ్రీనివాసరావు, మర్దన్‌అలీ, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

25 ఎస్‌ఎంసీల ఎన్నికలు వాయిదా

● 74 పాఠశాలల్లో ప్రశాంతంగా నిర్వహణ

ఒంగోలు (విద్య), ఆగస్టు 17: జిల్లాలో పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ)ల ఏర్పాటుకు శనివారం నిర్వహించిన ఎన్నికలు వివిధ కారణాలతో మళ్లీ 25 చోట్ల వాయిదా పడ్డాయి. జిల్లాలో మొదటి విడత జరిగిన ఎస్‌ఎంసీ ఎన్నికల్లో 2,405 పాఠశాలలకు గాను 2,306 చోట్ల ఎన్నికలు జరిగాయి. 99 పాఠశాలల్లో వివిధ కారణాలతో నిలిచిపోయాయి. ఆ స్కూళ్లకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. 74 పాఠశాలల్లో ప్రశాంతంగా జరిగాయి. వివిధ కారణాలతో 25 చోట్ల వాయిదా పడ్డాయి. వాటిలో ఒకటి పిల్లలు లేక మూతపడగా రెండుచోట్ల ఒక్క విద్యార్థి కూడా లేరు. ఒక స్కూల్‌లో గత కమిటీ పదవీకాలం రెండేళ్లు పూర్తికానందున ఎన్నికను నిలిపివేశారు. వివిధ కారణాలతో మిగిలిన 21 ఎస్‌ఎంసీల ఎన్నికలు వాయిదాపడ్డాయి. వాటికి ప్రభుత్వం తదుపరి ప్రకటించే షెడ్యూల్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర తెలిపారు.



నగదును అందుకుంటున్న విద్యార్థినులు

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం

ఇంకొల్లు, ఆగస్టు 17 : ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థినులకు కొల్లూరి శ్రీదేవి, కన్నెగంటి మురళీకృష్ణ దంపతులు రూ.20వేల ఆర్థిక సహాయం అందజేసారు. స్థానిక ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో గత ఏడాది 10వ తరగతి చదివి ఇంటర్‌లో చేరిన పేద విద్యార్థులు నలుగురుకు రూ.4వేల చొప్పున అందజేసారు. 13 సంవత్సరాలుగా పేద పిల్లలకు ఆర్థిక సాయం అందిస్తున్న దంపతులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని రావి నాగేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది రాధారాణి, కుమారి, పుష్పవతి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో దాతల తరపున మల్లేశ్వరి, పద్మజ విద్యార్థినులు వేముల వర్దని, తాళ్లూరి పావని, తెలగంశెట్టి అఖిల, షేక్ అమీన్‌లకు ఆర్థిక సాయాం అందజేసారు.

బాలికలు చదువులో రాణించాలి

ఆడపిల్లలు చదువులో బాగా రాణించాలని మండలంలోని ఇడుపులపాడు కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటరెడ్డి అన్నారు. ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెనరా బ్యాంకు సామాజిక సేవలలో భాగంగా షెడ్యూల్ కులాల ఆడపిల్లలకు 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు గత సంవత్సరం పరీక్షలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి కింద ఉపకార వేతనం అందజేసారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కెనరా బ్యాంకు సామాజిక సేవలో భాగంగా అందిస్తున్న ఉపకార వేతనాలను అందుకొని ఆడపిల్లలు ఉన్నత చదువులతో రాణించాలని కోరారు. 6 మంది విద్యార్థులకు రూ.3000 చొప్పున ఉపకార వేతనం అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పేరిరెడ్డి, పేర్ని బాపయ్య, బీ సుమతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేరాలలో మరో చోరీ

పేరాల(చీరాలటౌన్), ఆగస్టు 17 : ఇటీవల వరుస నేరాల చోటుచేసుకుంటున్న చీరాల పరిధిలో తాజాగా బంగారు ఆభరణాల చోరీ జరిగింది. ఈ ఘటన పేరాల గోలివారి వీధిలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం పేరాలకు చెందిన పొత్తూరి నాగేశ్వరరావు పట్టణంలోని కొత్త బజార్‌లో బెల్లం దుకాణం నడుపుతున్నారు. ఇతను భార్య సుశీలతో కలిసి చిలకలూరిపేటలోని కుమార్తె ప్రియ వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లారు. ఇంటి పనిమనిషి పార్వతి పెరట్లోని మొక్కలకు నీళ్లు పోసేందుకు శనివారం సాయంత్రం వచ్చి చూడగా, ఇంటి తలుపులు పగులకొట్టి ఉన్నాయి. దీంతో ఆమె వెంటనే యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించగా వారు హుటాహుటీన ఇంటికి చేరుకుని పరిశీలించారు. దీంతో ఇంటి తాళాలు పగలకొట్టి 14 సవరల బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు అపహరణ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌చార్జి సీఐ సత్యనారాయణ, ఎస్సై నాగశ్రీను సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే చుట్టూ నివాసాలు ఉన్నా కూడా ఒక్కరోజు యజమాని లేకపోవడం చూసి చోరీకి పాల్పడ్డారు. ఇది తెలిసిన వారి పనేనని పోలీసులు భావిస్తున్నారు.

ఒంగోలు డీఎస్పీగా రాయపాటి బాధ్యతలు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 17: ఒంగోలు సబ్ డివిజనల్ పోలీసు అధికారిగా రాయపాటి శ్రీనివాసరావు శనివారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎస్ఐ, సీఐ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేసిన శ్రీనివాసరావు అందరికీ సుపరిచితుడు. శాంతిభద్రతలు అదుపు చేయడంలో దిట్టాగా పేరొందారు. అంతేకాకుండా నేరస్థుల గుండెల్లో గుబులు పుట్టించిన అధికారిగా గుర్తింపు ఉంది. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనను ఒంగోలు రూరల్ సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు పలువురు ఎస్ఐలు కలిసి అభినందనలు తెలిపారు.

బంద్‌ను జయప్రదం చేయండి

చీరాలటౌన్, ఆగస్టు 17 : వర్గీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు కోరారు. శనివారం సంబంధిత కరపత్రాలను పట్టణంలో వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2004లో ఆర్టికల్ 341 ప్రకారం సుప్రీం కోర్టు వర్గీకరణ చెల్లదని కొట్టి వేసినట్లు తెలిపారు. బుధవారం బంద్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు.

పరుగులు పెడుతున్న ఆశావహులు

ఎమ్మెల్యే సిఫార్సు లేఖల కోసం పోటీ

పదవుల్లో జిల్లా నేతలకు చాన్స్

ముందువరుసలో ఇన్‌చార్జులు

పరిశీలనలో సత్య, బాలాజీ పేర్లు

రేసులో డాక్టర్ గరటయ్య, మరికొందరు

జనసేన నుంచి రియాజ్ పేరు పరిశీలన

కసరత్తు ముమ్మరం చేసిన అధిష్ఠానం

నామినేటెడ్ టెన్షన్!



జిల్లాకు నామినేటెడ్ పదవులు దక్కుతాయా.. దక్కితే తొలివిడతలోనే అవకాశం ఉంటుందా..? ఒకవేళ ఇచ్చినా ఇటు టీడీపీ అటు జనసేనలో ఎవరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.. ఇది తాజాగా జిల్లాలో రాజకీయంగా నెలకొన్న చర్చనీయాంశం. నామినేటెడ్ పదవుల్లో కూడా జిల్లాకు చెందిన కొందరు నాయకులకు అవకాశం ఇవ్వాలనే నిర్ణయానికి టీడీపీ పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా దామచర్ల సత్య, బాలాజీ తదితర పేర్లను పరిశీలనకు తీసుకున్నట్లు సమాచారం. అలాగే జిల్లాలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులపై కూడా ప్రత్యేక పరిశీలన చేస్తున్నారు. ఇవిగాక మరికొందరు నాయకులు చేసుకున్న దరఖాస్తులను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. జనసేన వైపు నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ పేరు పరిశీలనలో తీసుకున్నట్లు సమాచారం.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల నియామకంపై దృష్టిసారించింది. ఆ మేరకు కొన్ని విధానాలను కూడా రూపొందించింది. నియోజకవర్గాల వారీ టీడీపీ, జనసేన, బీజేపీలకు ఏ నిష్పత్తిలో పదవులు కట్టబెట్టాలో నిర్ణయించి ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులకు సమాచారమిచ్చారు. మరోవైపు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల విషయంలో టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక అవగాహనతో ముందుకు పోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నాయి. ఆ మేరకు టీడీపీ ఆ పార్టీశ్రేణులకు వీలైనంత తొందరగా ఆ పదవులు కట్టబెట్టి వారిని సంతృప్తిపరిచేందుకు సిద్ధమైంది. అందులోభాగంగా రాష్ట్రస్థాయిలోని కొన్ని నామినేటెడ్ చైర్మన్ పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది.

కీలక నేతలకు పదవులు

ఇప్పటివరకు ఉన్న సమాచారం మేరకు పార్టీ ప్రతిపక్షంలో ఉండగా పార్టీలో కీలక భూమిక పోషించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యకు నామినేటెడ్ పదవి ఇవ్వటం ఖాయమని సమాచారం. రెండేళ్ల క్రితమే ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని అడిగారు. కానీ అటు చంద్రబాబు ఇటు లోకేష్‌లు ఆయనను వారించి పార్టీ సేవలో ఉండాలని కోరి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. అలాగే కొండపిలో స్వామిని గెలిపించే బాధ్యతను ఇచ్చారు. పార్టీ ఇచ్చిన అన్నీ బాధ్యతల్లో సక్సెస్ రేటు ఎక్కువగా ఉన్న సత్యకు సముచిత పదవి కల్పించటం ఖాయమని తెలుస్తోంది. ఆయనను శాసనమండలికి పంపిస్తామనే హామీ కూడా అధిష్ఠానం ఇచ్చి ఉంది. అయితే ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారా, లేక కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేస్తారా అనే విషయంపై సందిగ్ధం కొనసాగుతున్నట్లు తెలిసింది. పార్టీ ఒంగోలు లోక్‌సభ అధ్యక్షుడు బాలాజీకి కూడా రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి దక్కేందుకు బలమైన అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఈ ఇద్దరికీ తొలివిడతలోనే పదవుల దక్కుతాయా లేదా అనేది తేలాల్సి ఉంది. ఈ విషయంపై అధిష్ఠానం ఇటీవల రాబిన్‌సింగ్ బృందం ద్వారా ఆరా తీసినట్లు కూడా తెలిసింది.

రేసులో పలువురు సీనియర్లు

మరోవైపు సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య కూడా రేసులో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చినా బాపట్ల లోక్‌సభ ఎన్నికల కోఆర్డినేటర్‌గా సముచిత పాత్రను ఆయన పోషించారు. అయితే ఆయన తనకు కాకుండా తన కుమారుడు కృష్ణ చైతన్యకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. పార్టీ పరిశీలనలో మాత్రం గరటయ్య పేరు ఉన్నట్లు సమాచారం. అలాగే కనిగిరి నియోజకవర్గం బొట్లగూడూరుకు చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.జనార్దన్ కూడా నామినేటెడ్ పదవి రేసులో ఉన్నారు. చీరాలలో ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన పాలేటి రామారావు కూడా ఏదో స్థాయి పదవి కావాలని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ డాక్టర్ మన్నెం రవీంద్ర పేరును అధిష్ఠానం పరిశీలిస్తోంది. అయితే టీడీపీలో ఎక్కువమంది నాయకులు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉన్న కీలక పదవులపైనే దృష్టిసారించటం విశేషం.

ఇద్దరు ఇన్‌చార్జిలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూసిన వైపాలెం, దర్శి టీడీపీ ఇన్‌చార్జిలకు పూర్తిస్థాయిలో అండగా ఉండాలని అధిష్ఠానం నిర్ణయించుకుంది. ఆ మేరకు వారికి సమాచారం ఇవ్వటంతోపాటు మంత్రులు, జిల్లాలో అధికారులకు కూడా సంకేతాలు పంపారు. ఇన్‌చార్జిలను అనధికారిక ఎమ్మెల్యేలుగా గుర్తిస్తూ ప్రోత్సహించాలా లేక నామినేటెడ్ పదవులు కూడా కేటాయించాలా అనే విషయంలో అధినేత స్పష్టమైన నిర్ణయానికి ఇంకా రాలేదని తెలిసింది. ఇటీవల సీఎంను కలిసిన దర్శి టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌కు అలాగే వైపాలెం ఇన్‌చార్జి ఏరిక్షన్‌బాబుకు చంద్రబాబు పూర్తిస్థాయి హామీ ఇచ్చినట్లు తెలిసింది. ప్రత్యేకించి దర్శిలో వైసీపీ ఎమ్మెల్యేగా శివప్రసాద్‌రెడ్డి ఉండటంతోపాటు ఆయన తల్లి వెంకాయమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారు. దీంతో ఇద్దరు కలిసి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టి టీడీపీ ఇన్‌చార్జి, శ్రేణులను ఇబ్బందిపెట్టే ప్రక్రియకు శ్రీకారం పలికారు. ఆ విషయాలను లక్ష్మి, సాగర్‌లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వారికి పదవి ఇచ్చి ప్రోటోకాల్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లాకు చెందిన కొందరు కీలక నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. జిల్లాస్థాయి లేక రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో ఎలా అవకాశం కల్పించాలనే అంశంపై పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. వైపాలెంలో కూడా వైసీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్ దూకుడుగా వ్యవహరిస్తుండటంతో ఎరిక్షన్‌బాబుకు పూర్తి అండగా నిలవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేయటంతో ఆయన అంశంపైన అధిష్ఠానం పరిశీలన చేపట్టింది.

జనసేనలో రియాజ్‌కు..

జనసేన కూడా తమ కోటాలో వచ్చే నామినేటెడ్ పదవుల్లో కనీసం ఒకటైనా జిల్లాలోని ఆ పార్టీ నాయకులకు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని పలువురు జనసేన నాయకుల పేర్లను పరిశీలనకు తీసుకున్నప్పటికీ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ పేరును ప్రధానంగా పరిశీలిస్తున్నట్లుగా తెలిసింది. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే రెండు మంత్రి పదవులతోపాటు ఎమ్మెల్సీ పదవి కూడా కాపు సామాజికవర్గం వారికే జనసేన కేటాయించింది. అందువలన నామినేటెడ్ పదవుల విషయంలో ఇతర సామాజికవర్గం వారికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్లు తెలిసింది. అయితే జిల్లాస్థాయిలో నామినేటెడ్ పదవి కోసం రియాజ్ ప్రయత్నిస్తున్నట్లుగా సమాచారం. ఆ పార్టీ అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూడాల్సి ఉంది.



వైద్యరంగాన్ని కాపాడాలి

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం అమలుచేయాలి : ఐఎంఏ

జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో 24 గంటల సేవలు బంద్

'జూడా'ల నిరసనకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 17: 'వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్యశాలలపై రోజురోజుకు దాడులు తీవ్రమవుతున్నాయి. వైద్యరంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలులోకి తీసుకురావాలి' అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై దుండగులు హత్యాచారం చేయడాన్ని ఖండిస్తూ 24 గంటలపాటు వైద్యసేవలు నిలిపివేసి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లావ్యాప్తంగా పలు ప్రైవేటు ఆసుపత్రులు మూసివేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ఐఎంఏ హాలులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నిత్యం పనిచేస్తున్న వైద్యులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలిపై హత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. వైద్యుల రక్షణపై ఐఎంఏ కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తుందన్నారు. అయితే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించడం లేదని వారు పేర్కొన్నారు. రోజు రోజుకు రక్షణ కరువైపోతుందని, కనీస భద్రత, రక్షణ లేని విధంగా వైద్య వృత్తి మారిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు వైద్య రంగం రక్షణ కోసం ప్రత్యేక చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హత్యాచారానికి గురైన డాక్టర్ కుటుంబానికి నష్టపరిహారం అందించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని వారు తెలిపారు. అనంతరం చర్చి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్లు శ్రావణి, శ్రీదేవి, రాష్ట్ర నాయకులు రావిపాటి జయశేఖర్, మన్నే వీరయ్యచౌదరి, జాలాది మణిబాబు, జాకబ్ జకర్యా, శారా జార్జి, మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఐఎంఏ చేపట్టిన వైద్య సేవల బంద్‌కు మద్దతు తెలియజేశారు. వారితోపాటు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి చేపట్టిన నిరసన రెండో రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆసుపత్రుల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి.

ఫార్మసీ విద్యార్థులతో కొంతమేర సేవలు

ప్రభుత్వ వైద్యుల నిరసన నేపథ్యంలో రోగులకు ఇబ్బందులు లేకుండా అసిస్టెంట్ ప్రొఫెసర్స్ హోదాలో ఉన్న డాక్టర్లు జీజీహెచ్‌లో వైద్య సేవలు అందించారు. జీజీహెచ్, ఇతర ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసీ విద్యార్థుల సేవలను వినియోగించుకున్నారు. జీజీహెచ్, కిమ్స్, ఇతర ప్రైవేటు వైద్యశాలలో ఫార్మా-డీ విద్యార్థులను మూడు షిఫ్ట్‌లలో విధులను కేటాయించారు. శని, ఆది, సోమవారాలు మూడు రోజులపాటు వారికి ఆయా ఆసుపత్రుల్లో రోగుల సౌకర్యార్థం సేవలను అందించారు. డాక్టర్లు ఆందోళన విరమించే వరకు వారి సేవలు అందుబాటులో ఉంచారు. వారితోపాటు పలు ప్రైవేటు నర్సింగ్ కాలేజి విద్యార్థులను ఆయా ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు సేవలందించేందుకు నియమించారు.

సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే దామచర్ల

కోల్‌కతాలో ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని రెండురోజులుగా ఒంగోలు జీజీహెచ్‌లో జూడాలు చేపట్టిన ఆందోళనకు ఎమ్మెల్యే దామచర్ల సంఘీభావం తెలిపారు. శనివారం జీజీహెచ్‌లోని ఆందోళన శిబిరం వద్ద వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మహిళా వైద్యురాలిపై హత్యాచారం చేయడం బాధకరమన్నారు. వైద్య విద్యార్థిని, డాక్టర్‌పై లైంగికదాడి చేసి, హత్య చేయడం కలిచివేసిందన్నారు. ఇలాంటి కేసుల్లో పురోగతి కనిపించడం లేదని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరగా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ చెంచయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 17 : ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 15 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు జరుగుతాయి. అందులో రెవెన్యూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్, మునిసిపాలిటీలు, పట్టణాభివృద్ధి సంస్థలు, గ్రామ, వార్డు సచివాలయాలు, సివిల్ సప్లయిస్, మైనింగ్ అండ్ జియాలజీ, అన్ని విభాగాల్లోని ఇంజనీరింగ్ ఉద్యోగులు, దేవదాయ, రవాణా, పరిశ్రమలు, విద్యుత్‌శాఖ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్ శాఖలు ఉన్నాయి. ఎక్సైజ్ ఉద్యోగులకు సెప్టెంబరు 5 నుంచి 15 వరకు, మిగిలిన 14 శాఖల్లో పనిచేస్తున్న వారికి శనివారం నుంచి ఈనెల 31వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మార్గదర్శకాలు ఇవీ..

- ఈ ఏడాది జూలై 31నాటికి ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాలి. ఒకే చోట వివిధ కేడర్లలో ఐదేళ్లు పూర్తి చేసిన వారికి కూడా స్థానచలనం కల్పిస్తారు.
- ఒకే స్థానంలో ఐదేళ్లు పనిచేయని వారు కూడా బదిలీలకు అర్హులే. వారిని పరిపాలన సౌలభ్యం దృష్ట్యా లేదా వారి అభ్యర్థన మేరకు బదిలీ చేస్తారు. కనుక వారు కూడా ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది.
- సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బదిలీ అయ్యి మళ్లీ వారివారి స్థానాలకు వచ్చిన సిబ్బంది కూడా ఐదేళ్లు పూర్తయితే వారు కూడా బదిలీ కావాల్సిందే.
- కంటిచూపు లేని ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు కోరుకుంటే మాత్రం వారి స్థానచలనం కల్పిస్తారు.
- భార్యాభర్తలు ఉద్యోగులు అయితే వారిరువురినీ ఒకేచోట నియమించేందుకు ప్రాధాన్యం ఇస్తారు. వీలు కాకపోతే సమీపంలో నియమిస్తారు.
- స్థానాల భర్తీలో మొదట ఏజెన్సీ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇస్తారు. ఆ తర్వాతే నాన్ ఐటీడీఏ ప్రాంతాల్లోని స్థానాలు భర్తీ చేస్తారు.

బదిలీల్లో వీరికి ప్రాధాన్యం

- బదిలీల్లో ఎవరికి ప్రాధాన్యత ఇవ్వాల్సింది మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.
- అంధ ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.
- మానసికస్థితి సరిగా లేని పిల్లల తల్లిదండ్రులు వైద్యసేవలు అందుబాటులో ఉండే ప్రాంతాలను కోరుకుంటే వారికి కూడా..
- గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకుపైగా పనిచేసిన ఉద్యోగులకు కూడా..
- 40శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం గల ఉద్యోగులకు సంబంధిత అధికారి ధ్రువీకరిస్తే ప్రాధాన్యత ఉంటుంది.
- ఉద్యోగి తాను స్వయంగా కానీ, స్పౌజ్ కానీ, తనపై ఆధారపడిన వారు క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ ఆపరేషన్, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వాటికి చికిత్స అందే ప్రాంతాలకు బదిలీలు కోరుకుంటే అవకాశం ఇస్తారు.
- మహిళా ఉద్యోగులు కారుణ్య నియామకం ద్వారా నియమితులైతే వారికి బదిలీల్లో ప్రాధాన్యత ఇస్తారు.
- ఉద్యోగుల బదిలీలను సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు నిర్వహించి బదిలీలపై ఫిర్యాదులు వచ్చినా, ఆరోపణలు వచ్చినా మార్గదర్శకాలు ఉల్లంఘించినా తీవ్రంగా పరిగణిసాతమని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించింది.

పూడిపోయిన కాలువలు

- సాగునీటి ప్రకటనపై రైతుల హర్షం
- మరోపక్క పూడిపోయిన మైనర్‌లపై ఆందోళన
- మైనర్లను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి
- పలు గ్రామాల్లో స్వచ్ఛందంగా చిల్లకంప తొలగింపు


తుమ్మ చెట్లతో కనుమరుగైన వెంపరాల మేజర్‌లోని కొత్తూరు మైనర్ కాలువ.. స్వచ్ఛందంగా కాలువను బాగుచేసుకుంటున్న రైతులు

బల్లికురవ, ఆగస్టు 17 : ఈ ఏడాది అన్ని డ్యామ్‌లు పూర్తి స్థాయిలో నిండడంతో ప్రభుత్వం వరి సాగుకు నీటిని విడుదల చేస్తామని చెప్పడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కానీ పంటలకు నీరు వచ్చే కాలువలు అన్ని కనుమరుగు అయి పోయి ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సీజన్ల నుంచి వరి సాగు చేయకపోవడం, పంటలకు సరిపడా నీరు లేక అరకొరగా ఆరుతడులకు, తాగు నీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేయడంతో పలు గ్రామాలలో ఉన్న పంట కాలువలు పూర్తిగా తుమ్మ చెట్లు, పూడికతో నిండిపోయి ఉన్నాయి. ఇప్పుడు సాగు కోసం నీటిని విడుదల చేసినా అవి పంటలకు అరకొర గానే అందే పరిస్థితి ఉన్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల సాగుకు నీటిని విడుదల చేయక ముందే పంట కాలువలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బల్లికురవ మండలంలోని అత్యధిక గ్రామాలలో రైతులు పూర్తి స్థాయిలో సాగు నీరు వస్తే వరి సాగును చేపడతారు. సుమారు 10వేల ఎకరాలకు పైబడి వరి సాగు అయ్యే అవకాశం ఉంది. పంటలకు నీరు వచ్చే గుంటుపల్లి, ముక్తేశ్వరం, పసుమర్రు, జంగాలపల్లి, వైదన, మేజర్ కాలువలతో పాటు పలు మైనర్ కాలువలు అడవి తుమ్మ చెట్లతో చిట్టడవిని తలపిస్తున్నాయి. ఈ మేజర్ల పరిధిలో సాగుకు నీటి విడుదల జరిగినా పంటలకు మాత్రం సరిగా అందే పరిస్థితి లేదని, వెంటనే అధికారులు మేజర్ కాలువలను శుభ్రం చేయాలని తుమ్మ చెట్లను తొలగించి పూడిక తీయించాలని రైతులు కోరుతున్నారు. వెంపరాల మేజర్‌లోని పలు మైనర్ కాలువలు పూడిపోయి ఉన్నాయని కొత్తూరు మైనర్ కాలువ కనుమరుగు కావడంతో రైతులే స్వచ్ఛందంగా విరాళాలు వేసుకొని పంట కాలువ అభివృద్ధి పనులు చేయించుకొంటున్నారు. కొన్ని చోట్ల పెద్ద పెద్ద చెట్లు కాలువలలో అడ్డుగా పడి పోయి ఉన్నాయని వాటిని తొలగించ కుండా నీటిని విడుదల చేసిన ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. కొందరు రైతులు పంట కాలువలు బాగా లేకపోవడంతో వరి సాగు చేయడం కష్టమని మొక్క జొన్న పంట అయినా సాగు చేద్దాం అనే ఆలోచనలో ఉన్నారు.

కొందరు రైతులు మాత్రం ఏదిఏమైనా వరి సాగుకు ఎన్నాళ్లకు నీటి విడుదవుతుందని కాలువలు బాగు చేసినట్లయితే పంట సాగు చేయాలని వరి విత్తనాలను సైతం కొనుగోలు చేస్తున్నారు. అధికారులు వెంటనే అన్ని గ్రామాల పరిధిలోని మేజర్, మైనర్ కాలువలను అభివృద్ధి పరిచేలా చర్యలు చేపట్టాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడుతున్న కమిషనర్

పారదర్శకంగా అన్న క్యాంటీన్ సేవలు

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాలటౌన్, ఆగస్టు 17 : చంద్రబాబు ప్రభుత్వం నిరుపేదల కడుపు నింపేందుకు బృహత్తరంగా చేపట్టిన అన్న క్యాంటీన్ సేవలు పారదర్శకంగా అందాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి అన్నారు. శనివారం పట్టణంలోని అన్న క్యాంటీన్ సేవలను కమిషనర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా సంబంధిత సిబ్బందితో నిర్వహణపై ఆరా తీశారు. ఆకలితో వచ్చిన ప్రతివాని కడుపు నింపాలని సూచించారు. బందోబస్తులో ఉన్న పోలీసులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శనివారం 346 మంది అల్పాహారం, మధ్యాహ్నం 450 మంది భోజనం వినియోగించుకున్నట్లు కమిషనర్ తెలిపారు. అంతేకాకుండా పేరాల మసీద్ సెంటర్‌లోని పలు గృహాల యజమానులతో మాట్లాడారు. ఇళ్లకు తాగునీరు కొళాయిలను ఏర్పాటు చేయనున్నట్లు సూచించారు. వివరాలను యాప్‌లో అప్‌లోడు చేయాలని సిబ్బందికి సూచించారు. వీటిపై ఇష్టాయిష్టాలను సేకరించారు. ఆయన వెంట పురపాలక సిబ్బంది ఉన్నారు.

పాఠ్య ప్రణాళిక ఆధారంగా బోధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 సుధాకరరావు

అద్దంకిటౌన్, ఆగస్టు 17 : ప్రతి ఉపాధ్యాయుడు ముందుగా పాఠ్య ప్రణాళికను దగ్గర ఉంచుకుని బోధన చేయాలని ఎంఈవో-2 బూదాటి సుధాకరరావు అన్నారు. శనివారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం కాంప్లెక్స్ ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ యూడైస్‌లో ఉన్న ఎన్‌రోల్‌మెంట్ ప్రకారం విద్యార్థులందరూ పాఠశాలలో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే నన్నారు. అకడమిక్ గ్రేడింగ్ రిజిస్టర్ ఉండాలని, విదార్థుల స్థాయినిబట్టి గ్రూపులుగా చేసి తెలుగు, గణితం బోధించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాకానిపాలెం జడ్పీ పాఠశాల, శ్రీ ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలోను స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఎంఈవో -1 డి. గంగాధరరావు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఛైర్మన్‌లు గురవయ్య, డీఎస్ పద్మావతి, సీఆర్పీలు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్టూరు : ప్రాథమిక స్థాయిలో 1, 2 తరగతుల విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 90 రోజుల విద్యాప్రవేశ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో వస్రాంనాయక్ అన్నారు. శనివారం మార్టూరులో ఎంఆర్‌సీ భవనంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు అకడమిక్ క్యాలెండరు, లెసన్‌ప్లాన్ ప్రకారం బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రేమలత, సీఆర్పీలు రమేష్, రామారావు, 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అధికారులు భాగస్వామ్యం కావాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్నకుమారి

మేదరమెట్ల, ఆగస్టు 17 : మండల పరిషత్ అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ప్రసన్నకుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల వలన సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సమావేశంలో ఏకగ్రీవంగా ధన్యవాదాలు తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకటరమణ, ఎంపీడీవో సురేష్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శిపై విజిలెన్స్ విచారణ

కుంకలమర్రు(పర్చూరు), ఆగస్టు 17: కారంచేడు మండలంలోని కుంకలమర్రు గ్రామ పంచాయతీ నిధుల విత్‌డ్రా విషయంలో నిబంధనలు పాటించకుండా వ్యవహరించిన సర్పంచ్, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దానిపై బాపట్ల కలెక్టర్ స్పందించారు. దీనికి సంబంధించి శనివారం విజిలెన్స్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

శానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ

పర్చూరు, ఆగస్టు 17 : పర్చూరులోని బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కళాశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సౌజన్యంతో సమకూర్చి శానిటరీ నాప్‌కిన్స్‌ను శనివారం ప్రిన్సిపాల్ శేషు కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసదర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోల్‌కతా ఘటనపై వైద్యుల ర్యాలీ



అద్దంకిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు..చీరాల, మార్టూరులో నిరసన తెలుపుతున్న డాక్టర్‌లు, సిబ్బంది

అద్దంకిటౌన్, ఆగస్టు 17 : కోల్‌కతా ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డ్యూటీ డాక్టర్‌పై హత్యాచార ఘటనను ఖండిస్తూ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని అద్దంకి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. అఖిల భారత వైద్య సంఘం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. గాజులపాలెం, కాకానిపాలెం యూపీహెచ్‌సీలు, మోదేపల్లి, మేదరమెట్ల, కొరిశపాడు, పాసంగులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యులు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్‌లు, నర్సింగ్ విభాగం, పారా మెడికల్ సిబ్బంది అందరితో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లోని ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. ఏపీ ఎన్జీవో అద్దంకి తాలుకా యూనిట్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీ వెంకటకిరణ్, కె.వాహిలాచౌదరి, అనితాజ్యోతి, శ్యాంబాబు, ప్రదీప్తి, ప్రదీప్‌కుమార్, జయసింహ, మనోజ్, చిట్టిబాబు, హర్ష, అనీష్, బాలరాజు, అక్షిత, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

చీరాలటౌన్ : ఐఎంఎ అసోసియేషన్ చీరాల ప్రతినిధులు శనివారం చీరాల పట్టణంలో నిర్వహించారు. ఈసందర్భంగా శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సాధారణ వైద్య సేవలు నిలిపి వేసినట్లు చెప్పారు. అధికారులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, జూడాలు, నాయకులు ఉన్నారు.

వేటపాలెం(చీరాల) : కోల్‌కతాలో ఘటన దారుణమని, అందుకు కారకులైన మానవ మృగాళ్లను కఠినంగా శిక్షించాలని పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : మార్టూరులో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు(పర్చూరు) : కారంచేడు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయం కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళా వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు జెస్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.


అమృతకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

చక్రాయపాలెం విద్యార్థిని ప్రతిభ

అద్దంకిటౌన్, ఆగస్టు 17 : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో చక్రాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూ పింది. 9వ తరగతి చదువుతున్న అద్దంకి అమృత జిల్లా స్థాయిలో జీవ వైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆగస్టు 15వ తేదిన జిల్లాలో జరిగిన పంద్రాగస్టు వేడుకలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ జి.వెంకటమురళి ద్వారా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకుంది. శనివారం పాఠశాలలో అమృతను, గైడ్ టీచర్ పీ జ్యోతినిర్మలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.


మొక్కలను పంపిణీ చేస్తున్న వీవోపీ ప్రతినిధులు

3వేల మొక్కలు పంపిణీ

పర్చూరు, ఆగస్టు 17 : గ్రీన్ పర్చూరు లక్ష్యంగా యువత చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ చిత్రకారుడు లంకా ప్రసాద్ అన్నారు. శనివారం వాయిస్ ఆఫ్ పర్చూరు ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన కొంత మంది యువకులు జట్టుగా ఏర్పడి ఏటా ఆగస్టులో వాయిస్ ఆఫ్ పర్చూరు ప్రతినిధి లంకా భరత్ నేతృత్వంలో మొక్కలను పంపిణీ చేస్తున్నారు. కడియం నుంచి తెప్పించిన మామిడి, సపోటా, కొబ్బరి, వేప, దానిమ్మ తదితర మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తులసి శివనాగేశ్వరావు, నలతోటి సుధాకర్ పాల్గొన్నారు.

ఓటరు క్లయిమ్‌లను ఎప్పటికప్పుడు విచారించాలి

అద్దంకి, ఆగస్టు 17 : ఓటరు క్లయిమ్‌లను బీఎల్‌వోలు ఎప్పటికప్పుడు విచారణ చేపట్టాలని తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. అద్దంకి రూరల్ మండలంలోని బీఎల్వోలతో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీచరణ్ మాట్లాడుతూ ఓటర్ క్లైమ్‌ల దరఖాస్తుల స్వీకరణ, విచారణ నిరంతర ప్రక్రియ అని, ఎలాంటి అశ్రద్ధ చేయకుండా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కరరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్, సూపర్‌వైజర్‌లు అమరనాథ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీచరణ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అద్దంకి, ఆగస్టు 17 : వాకింగ్ చేస్తున్న ముండ్లమూరు మండలం మారెళ్ల హైస్కూల్ హెచ్‌ఎం వేమూరి మాల్యాద్రిని మోటార్‌సైకిల్ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం మారెళ్ల హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న వేమూరి మాల్యాద్రి అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం కాకానిపాలెం నుంచి బొమ్మనంపాడు వెళ్లే రోడ్డులో వాకింగ్ చేస్తుండగా బొమ్మనంపాడు వైపు వెళ్తున్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హెచ్‌ఎం మాల్యాద్రితో మోటార్‌సైకిలిస్టు ఎ.హనుమంతరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరినీ 108 వాహనంలో అద్దంకిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలించారు.

జూదరుల అరెస్టు

చినగంజాం, ఆగస్టు 17 : మండలంలోని మున్నంవారిపాలెం గ్రామంలోని ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోనికి తీసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీ సీతారామిరెడ్డి శనివారం తెలిపారు. అందిన సమాచారం మేరకు.. పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రూ.800 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

పర్చూరు, ఆగస్టు 17: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పర్చూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.


పత్తిని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రసం పీల్చే పురుగుతో జాగ్రత్త

వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు

మార్టూరు, ఆగస్టు 17 : పత్తి సాగులో రసం పీల్చే పురుగుతో జాగ్రత్తగా ఉండి, వాటి నివారణకు చర్యలు చేపట్టాలని మార్టూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు రైతులకు సూచనలు చేశారు. శనివారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి సాగులో ఉన్న పత్తిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం బెట్ట వాతావరణ పరిస్థితులతో పత్తిలో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక, యెర్రనల్లి దాడి చేస్తాయన్నారు. పురుగు నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకుడు రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.


ముక్తేశ్వరంలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న మలేరియా అధికారి

గ్రామాల్లో ఆరోగ్య శాఖ సందర్శన

జ్వరబాధితులకు వైద్య సేవలు

బల్లికురవ, ఆగస్టు 17 : విష జ్వరాలు సోకిన గ్రామాలను శనివారం మలేరియా యూనిట్ అధికారి శేషగిరిరావు సందర్శించారు. గురువారం ఆంధ్రజ్యోతిలో విజృంభిస్తున్న విషజ్వరాలు కథనం ప్రచురితమైంది. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ అధికారులు స్పందించారు. ముక్తేశ్వరం గ్రామంలో ఇంటింటి సర్వేను మలేరియా అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలానే పంచాయతీ అధికారులకు దోమల నియంత్రణకు అవసరమైన మందులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ మురుగు నిల్వలు లేకుండా చూడాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాల్లో విష జ్వరాలు వచ్చినట్లు అనుమానం వస్తే వెంటనే దగ్గరలో ఉన్న గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. కూకట్లపల్లిలో పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఎబెట్ మందును చల్లించారు. జ్వరాలు అదుపులోకి వచ్చే వరకు నిరంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



బల్లికురవ, ఆగస్టు 17 : వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని, రైతులు వ్యవసాయ మోటార్లు చోరీ కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జీవీ చౌదరి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొంత కాలంగా కొందరు వ్యక్తులు పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటార్లను, కేబుల్ వైర్లను చోరీ చేస్తున్నారన్నారు. వ్యవసాయ పంటలు సాగు చేసే రైతులు విలువైన మోటార్లు, కేబుల్ వైర్లను, బోర్డులను జాగ్రత్తగా భద్ర పరచుకోవాలన్నారు. రాత్రుళ్ల రైతులంతా కలిసి పొలాల్లో ఉన్న మోటార్ల వద్ద కాపాలా దారులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలానే కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాలలో కన్పిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. తమ సిబ్బందితో తాము చోరీలు జరగకుండా రాత్రు ళ్ల ప్రత్యేక గస్తీ కొనసాగిస్తున్నామన్నారు. అందరూ అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాలకు కట్టడి చేయవచ్చని ఎస్ఐ తెలిపారు.

పేద విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ

పర్చూరు. ఆగస్టు 17 : ఇద్దరు పేద ఇంజనీరింగ్ విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ వారు దాతల సాయంతో శనివారం రూ.1,14,000 విలువ చేసే రెండు హెచ్‌పీ కంపెనీకి చెందిన లాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. దాతలు ప్రవాసాంధ్రుడు కొల్లా సాకేత్ తండ్రి శ్రీనివాసరావు, తాత సుబ్బారావు వాటిని అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నేతలు


వినోద్‌బాబును సన్మానిస్తున్న నేతలు

పంగులూరు, ఆగస్టు 17 : ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన బి.వినోద్‌బాబును టీడీపీ నేతలు శనివారం మర్యాదపూర్వంగా కలిసారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను గురించి మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వినోద్‌ను టీడీపీ నేతలు రావూరి రమేష్, చింతల సహదేవుడు, కుక్కపల్లి ఏడుకొండలు సత్కరించారు. శాంతిభద్రతల రక్షణ విషయంలో సహకరించాలని వినోద్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆదిరెడ్డి, అల్లంనేని బ్రహ్మానందస్వామి పాల్గొన్నారు.

శింగరకొండ హుండీల ఆదాయం లెక్కింపు

అద్దంకి, ఆగస్టు 17 : శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవలయ హుండీల కానుకల ద్వారా రూ.3,25,256 ఆదాయం వచ్చినట్లు ఈవో కోటిరెడ్డి తెలిపారు. 5 నెలల 17 రోజులకు సంబంధించి హుండీలలోని కానుకలను శనివారం ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, దేవస్థాన ట్రస్ట్ ఛైర్మన్ నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డిల పర్యవేక్షణలో లెక్కించారు. అంతరాలయంలోని హుండీ ద్వారా రూ.2,37,230, ముఖమండపంలోని హుండీ ద్వారా రూ.88,026 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

బాలికపై దాడికి యత్నం

తల్లి ఫిర్యాదుపై పోక్సో కేసు

పర్చూరు, ఆగస్టు 17 : ఆరేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిపై శనివారం పర్చూరు పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటి బయట ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని ఆదే ప్రాంతానికి చెందిన 30ఏళ్ల యువకుడు ఇంట్లోకి తీసుకుపోయి అత్యాచారానికియత్నించాడు. ఎదరు ఇంట్లో పాప ఉండడాన్ని గుర్తించిన తల్లి ఏమి జరిగిందని పాపను విచారించగా, జరిగిన విషయాన్ని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. తల్లి ఫిర్యాదు మేరకు పర్చూరు ఇన్‌చార్జి ఎస్సై డి.రత్నకుమారి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుంది.

ఎస్‌ఎంసీ ఎన్నికలు మళ్లీ వాయిదా

చీరాలటౌన్, ఆగస్టు 17 : పాఠశాలల అభివృద్ధి, సమన్వయం కోసం విద్యాశాఖ చేపడుతున్న స్కూల్ మేనేజిమెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు సంబంధించి చీరాల మండలం గవినివారి పాలెంలో గల దుగ్గిరాల గోపాలకృష్ణయ్య హైస్కూల్ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఇంతకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించగా ఆ సమయంలో మండల పరిధిలో గవినివారి పాలెం, ఏపీ మోడల్ స్కూల్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. గవినివారి పాలెంకు సంబంధించిన ఎన్నికలలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మధ్య పోటీ నెలకొనడంతో అక్కడ ఉత్కంఠ నెలకొంది. పెండింగ్‌లో ఉన్న పాఠశాలలకు సంబంధించి మళ్లీ శనివారం నిర్వహించగా ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రశాంతంగా ముగిశాయి. మోడల్ స్కూల్‌లో దగ్గుబాటి రాంబాబు ఛైర్మన్‌గా, వైస్ ఛైర్మన్‌గా మహ్మద్ షాహీన్ ఎన్నికయ్యారు. గవినివారి పాలెంలో మళ్లీ వాయిదా పడ్డాయి. ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సిబ్బందితో ఆ పాఠశాల బందోబస్తు నిర్వహించారు. అధిక శాతం మంది గైర్హాజరు కావడంతో ఎన్నిక వాయిదా పడింది.


ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎస్సై శివకుమార్



సర్దుబాటుకు తేలిన లెక్క

- జిల్లాలో 870 మంది మిగులు టీచర్లు
- ప్రారంభమైన కౌన్సెలింగ్
- ఫలించిన ఉపాధ్యాయ సంఘాల పోరాటం

నెల్లూరు (విద్య), ఆగస్టు 17: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. టీచర్ల సర్దుబాటుకు సంబంధించి తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విడుదల చేసిన జాబితాలో ఖాళీల ప్రకటన అంతా అస్తవ్యస్తంగా ఉందని, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పద్ధతిలోనే ఈ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేపట్టాయి. తమతో చర్చలు జరపకుండా, తమ సూచనలు పరిగణలోకి తీసుకోకుండా సర్దుబాటు చేపడితే తాము అంగీకరించమని ఆ సంఘాలు తేల్చి చెప్పాయి. దీంతో విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 12న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. అనంతరం ఈనెల 15 నుంచి టీచర్ల నుంచి వినతులు స్వీకరించారు. 16న కొత్త సీనియారిటీ జాబితాలు విడుదలతోపాటు అభ్యంతరాలు స్వీకరించి, 17న కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రకటించారు. దీంతో ఈ ప్రక్రియకు శనివారం శ్రీకారం చుట్టారు.

సర్దుబాటుకు ఆదేశాలు

ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను గుర్తించి, కొరత ఉన్నచోట సర్దుబాటు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. అలాగే కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా, కొన్ని చోట్ల తక్కువగా ఉన్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో బోధన పూర్తిగా కుంటుపడుతోంది. కొన్ని సబ్జెక్టులను అసలు బోధించే వారే లేకుండా పోయారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు విద్యాశాఖ శ్రీకారం చుట్టి చర్యలు ప్రారంభించింది. కొందరు సర్‌ప్లస్‌లో ఉన్నా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. అధికారులపై వివిధ రకాల ఒత్తిళ్లు చేసి అక్కడే ఉంటామంటున్నారు. గత ప్రభుత్వంలో సర్దుబాటు ప్రక్రియ పూర్తిగా రాజకీయ నేతల కనుసన్నల్లోనే జరిగింది.

సక్రమంగా చేపట్టాలని...

తాజాగా ప్రభుత్వం మారిన తరుణంలో సర్దుబాటు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. జిల్లాలో చేపట్టాల్సిన సర్దుబాటులో లోపాలున్నాయంటూ ఉపాధ్యాయ సంఘాలన్నీ ఏకమై ఆందోళన చేశాయి. అన్ని మండలాల్లో ఉన్న మిగులు టీచర్లు, అవసరమైన టీచర్లు, వారి సీనియారిటీ జాబితాలను ఆన్‌లైన్‌లో ఉంచినా, చాలా మండలాల్లో ఉపాధ్యాయుల వివరాలు, పోస్టులు, ఖాళీలు చూపడంలో పొరపాట్లు ఉన్నాయని చెబుతున్నారు. తామంతా జీవో నెం 117ను వ్యతిరేకిస్తున్నా దాని ప్రకారం సర్దుబాటుకు సంబంధించి మిగులు టీచర్లు కొరత ఉన్న పాఠశాలలను గుర్తించడం సరికాదంటున్నారు. కొన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు స్కూల్‌అసిస్టెంట్‌లను ఎస్‌జీటీలుగా నమోదు చేయడం, సీనియారిటీలను సక్రమంగా తెలియచేయకపోవడం తదితరు సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. తప్పులు సరిదిద్దకుండానే జాబితాలను అప్‌లోడ్ చేయడంతో అత్యధిక పాఠశాలల్లో సీనియర్‌లు జూనియర్‌లు, జూనియర్స్ సీనియర్లుగా మారిపోయారంటున్నారు. అలాగే జీవో నెం 117 ప్రకారం కాకుండా పాత జీవో నెం 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా ఉండగా పాత వైసీపీ ప్రభుత్వ జీవో ప్రకారం చేపడితే మరిన్ని పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దీన్ని సవరించాలని కోరుతున్నారు.

జిల్లాలో 870 మిగులు టీచర్లు

జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి 870 మంది మిగులు టీచర్లు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. మిగులు టీచర్ల సంఖ్యలో నెల్లూరు రూరల్ 82 మందితో అగ్రస్థానంలో ఉండగా, వింజమూరు 8మందితో చివరిస్థానంలో నిలిచింది. ఈనెల 16వతేదీ వరకు పాఠశాలల్లో నమోదైన విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని సర్దుబాటు చేస్తారని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. దీంతో పాఠశాలల్లో నమోదు కాని విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఒకరిద్దరు విద్యార్థులు తక్కువైన పాఠశాలలో పోస్టులు మిగులుగా తేలితే వాటిని పోకుండా కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు యూడైస్‌లో పేరు ఉన్న విద్యార్థులంతా కూడా ప్రతిరోజూ పాఠశాలలకు రావాల్సిందేనని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో టీచర్ల ప్రయత్నాలు ఏ మేరకు ఫలిస్తాయో, పోస్టులను ఎలా కాపాడుకుంటారో వేచి చూడాల్సిందే.





మహోన్నత భావాలు కలిగిన వ్యక్తి

ముప్పవరపు వెంకయ్య నాయుడు దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, అలాంటి మహోన్నత భావాలు కలిగిన వారు చాలా అరుదుగా కనిపిస్తారని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ అన్నారు. ఆయన ఆలోచనలు మహోన్నతమైనవంటూ కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల వికాసం కోసం ఆయన నిరంతరం శ్రమిస్తూనే ఉంటారన్నారు. ఆయన మానసపుత్రిక స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ సహకారం లేకుండా 23 ఏళ్ల పాటు ఈ ట్రస్ట్‌ను ఇంత గొప్పగా నిర్వహిస్తున్నారంటూ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్‌ను ఉప రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. ఉపరాష్ట్రపతి దంపతులను వెంకయ్యనాయుడు, ఉషమ్మలు సన్మానించి, మూడు సింహాల జ్ఞాపిక అందజేశారు. అలాగే గవర్నర్ దంపతులను ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్, ట్రస్ట్ చైర్మన్ కామినేని శ్రీనివాస్ శాలువాలతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.





రైతులు, మహిళల
సాధికారతే మా కల

స్వర్ణభారత్ నిబద్ధతతో కృషి చేస్తోంది • ట్రస్ట్ వార్షికోత్సవంలో పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు, పక్కన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య దంపతులు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి)/ వెంకటాచలం, ఆగస్టు 17 : రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకొని సాధికారతతో సగర్వంగా తలెత్తుకొనేలా చేయాలన్నది స్వర్ణభారత్ కల అని ఆ దిశగా నిబద్ధతతో పని చేస్తోందని ఆ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం వెంకటాచలంలో జరిగిన స్వర్ణభారత్ ట్రస్ట్ 23వ వార్షికోత్సవానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖండ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ స్నేహితులు, సహచరుల సహకారంతో 23 ఏళ్ల క్రితం స్వర్ణభారత్ ట్రస్ట్‌ను స్థాపించామని గుర్తు చేసుకున్నారు. ఈ ట్రస్ట్ ద్వారా ఇప్పటికి లక్ష మందికిపైగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించినట్లు చెప్పారు. నవీన పద్ధతులను, సాంకేతిక విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు పరిచయం చేయడమే ధ్యేయంగా ఈ సంస్థ కృషి చేస్తోందన్నారు. రైతులు నవీన పద్ధతులను అందిపుచ్చుకొని సాధికారత సాధించి గర్వంగా తలెత్తుకొని జీవించాలన్నది ట్రస్ట్ కల అన్నారు. అలాగే మహిళలు సైతం అన్ని రంగాల్లో రాణించాలని, సాధికారిత సాధించే దిశగా స్వర్ణభారత్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆనం రామ నారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీని వాసులురెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నేత కామినేని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

కందుకూరు సబ్‌కలెక్టర్ బదిలీ

కందుకూరు : కర్నూలు కార్పొరేషన్ కమిషనర్‌గా కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరిని నియమిస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడు నెలల క్రితం కందుకూరుకు వచ్చిన ఆమె ఎన్నికల నిర్వహణలో క్రియాశీలంగా పని చేశారు. ఆమె బదిలీ కావడంతో ఎవరిని నియమిస్తారా!? అన్నది చర్చనీయాంశమైంది.

ఉద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్!

- సుమారు 2వేల మందికి స్థానచలనం

నెల్లూరు (హరనాథపురం) : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో నెం.75ను విడుదల చేసింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, ఇతర విభాగాల్లో చానాళ్లుగా తిష్ఠవేసుకుని ఉన్న ఉద్యోగులందరికీ స్థాన చలనం కలగనుంది. ఎక్కడో జిల్లా మారుమూల ప్రాంతంలో పనిచేస్తున్న వారు జిల్లా కేంద్రానికి వచ్చే అవకాశమూ ఏర్పడనుంది. కాగా, జిల్లాలో 33 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, ప్రభుత్వం బదిలీ చేయాలనుకున్న శాఖలో 12 వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం. వీరిలో నిబంధనలు పోను సుమారు రెండు వేల మందికి బదిలీ అవకాశం ఉంది. ఈసారి విద్యా, వైద్యం, ట్రెజరీ తదితర శాఖల ఉద్యోగులకు బదిలీలు ప్రకటించలేదు. కేవలం 15 శాఖలలో మాత్రమే బదిలీల ప్రక్రియ జరగనుంది. రెవెన్యూ, పంచాయతీరాజ్- గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ అడ్మిని స్ట్రేషన్, సచివాయాలు, పౌరసరఫరాలు, భూగర్భ గనులు, అన్ని శాఖల ఇంజనీరింగ్ సిబ్బంది, దేవదాయ, రవాణా, అటవీ, పరిశ్రమలు, ఎనర్జీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్అండ్ ప్రొహిబిషన్ తదితర శాఖల్లో ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి.

వీరికి మినహాయింపు

దృష్టిలోపం ఉన్నవారు, ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్నవారు, దివ్యాంగులు,తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి కూడా మినహాయింపు ఇచ్చారు. కారుణ్య నియామకం పొందిన వితంతు ఉద్యోగినికి బదిలీ నుంచి మినహాయింపు ఉంటుంది.

ప్రమాదంలో 'రాళ్లపాడు'

- క్రస్ట్‌గేట్లను ఆపరేట్ చేయని అధికారులు
- చైన్లు, కౌంటర్ వెయిట్‌లు తెగుతాయని ఆందోళన
- వెంటనే మరమ్మతు చేయాలని రైతాంగం విజ్ఞప్తి

లింగసముద్రం, ఆగస్టు 17: నాలుగు మండలాల్లోని ఆయకట్టుకు సాగు, దాదాపు 100 గ్రామాలకు తాగునీటికి జీవనాడిగా పేరొందిన రాళ్లపాడు ప్రాజెక్టు పాత స్పిల్‌వేలోని క్రస్ట్‌గేట్లకు ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రాజెక్టు పరిధిలో అధికారికంగా 16,600 ఎకరాలు, అనధికారికంగా మరో 10 వేల ఎకరాల వరకు వరి సాగు చేస్తారు. సుమారు 16 సంవత్సరాల నుంచి పాత స్పిల్‌వేలోని 10 క్రస్ట్ గేట్లు, 2 పూడు గేట్లను అధికారులు ఆపరేట్ చేయడం లేదు. 2007లో రాళ్లపాడు ప్రాజెక్టుకు భారీ వరద రావడంతో పాత, కొత్త స్పిల్‌వేలోని గేట్లను ఎత్తి మన్నేరుకు నీటిని విడుదల చేశారు. ఆ తరువాత పాత స్పిల్‌వే గేట్లను ట్రయల్ రన్ చేస్తుండగా 1, 3 గేట్ల చైన్లు తెగి కౌంటర్ వెయిట్‌లు కిందపడి పగిలిపోయాయి. దీంతో అధికారులు ఆ రెండు గేట్ల చైన్లు, కౌంటర్ వెయిట్‌లను కొత్తవి ఏర్పాటు చేశారు. అయితే కౌంటర్ వెయిట్లు 1951లో ప్రాజెక్టు నిర్మాణం సమయంలోనివి కావడంతో ఇవి బలహీనంగా ఉన్నాయనే భయంతో 15 ఏళ్లుగా ఈ గేట్లను ఆపరేట్ చేయడం లేదు. కొత్త స్పిల్‌వేలోని 5 గేట్ల ద్వారా 1.7 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంది. దీంతో ప్రాజెక్టుకు వచ్చే వరద నీటిని ఈ గేట్ల నుంచి మన్నేరుకు విడుదల చేస్తున్నారు. అయితే, వరద పోటెత్తినప్పుడు సామర్థ్యానికి మించి నీటిని విడుదల చేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త స్పిల్‌వే గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేయలేదు. 1996లో వచ్చిన భారీ వరదలకు పాత స్పిల్‌వేలోని 7వ నెంబరు గేటు కొట్టుకుపోయింది. దీంతో అధికారులు కొత్త గేటు, కౌంటర్ వెయిట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ గేటు దిమ్మె కింద సున్నం రాలిపోతూ అధికారులను, రైతులను భయపెడుతోంది. ఈ పాత స్పిల్‌వే నిర్మాణ సమయంలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేయలేదు. ఇటీవల నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు 'రాళ్లపాడు'లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.



రాళ్లపాడు ప్రాజెక్టులో పాత స్పిల్‌వేలోని 16 ఏళ్లుగా ఆపరేట్ చేయని క్రస్ట్ గేట్లు



నెల్లూరులోని జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది నిరసన

నిరసనల హోరు!

- కోల్‌కతా ఘటనపై వైద్యులు, పలు సంఘాల ఆగ్రహం
- ఓపీ సేవలు నిలిపివేసి ఆందోళన బాట
- జిల్లావ్యాప్తంగా ప్రదర్శనలు, మానవహారాలు

కోల్‌కతాలో వైద్యవిద్యార్థి నిపై జరిగిన దారుణాన్ని నిరసిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాలు ఆగ్రహించాయి. ఉదయం ఆరు గంటలకే ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో సాధారణ వైద్యసేవలతో పాటు శస్త్రచికిత్సలు వంటి సేవలను ఆపేసి ఆందోళనబాట పట్టారు. కోల్‌కతా ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వైద్యులపై జరుగుతున్న దాడులపై ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఊరూరా ప్లకార్డులు చేతబట్టి నిరసన ప్రదర్శనలు చేశారు. అనంతరం ప్రధాన కూడళ్లలో బైఠాయించి, నినాదాలతో హోరెత్తించారు.



కందుకూరులో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద..

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 17 : కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై జిల్లావ్యాప్తంగా వైద్యులు, సిబ్బందితోపాటు పలు ప్రజాసంఘాలు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేర కు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుప త్రులలో ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలియ చేశారు. నెల్లూరులోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో (జీజీ హెచ్) వైద్యులు, సిబ్బందితోపాటు ఏపీ హెల్త్ అడ్మిని స్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు వైద్యులకు మద్దతు ప్రకటించి నిరసనలో పాల్గొన్నారు. జీజీహెచ్ ఆవరణలోని ప్రసూతి ఆసుపత్రి ఎదుట జరిగిన ఆందోళనలో ఏపీ హంస గౌరవాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైద్యులపై దేశవ్యాప్తంగా అత్యాచారాలు, అకృత్యాలు చోటు చేసుకోవడం దురదృష్ట కరమన్నారు. ఈ నిరసనలో హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల వెంకటేశ్వర్లు, పీపీయూనిట్ గైనకాలజిస్ట్ ఇంది రా, వైద్యులు స్నిగ్ధ, భవాని, మజురుల్లా, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వీఆర్‌సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సునీల్, నాయకులు షారుక్, ఆశీర్, నవీన్, ఖాదర్, మస్తాన్, ఇతర సంఘాల నేతలు తోపి, శివ, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు. అలాగే మెడికవర్ ఆసుపత్రిలో కూడా వైద్యులు ఓపీ సేవలు నిలిపివేసి నిరసన తెలియచేశారు. ఆ ఆసుపత్రి అధినేత చైర్మన్ డాక్టర్ అనిల్‌కృష్ణ, సెంట్రల్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ యేశ్వత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక నారాయణ వైద్య కళాశాలలో వైద్యులు, సిబ్బంది కూడా ఆందోళన వ్యక్తం చేశారు. అత్యవసరం మినహా ఓపీ సేవలన్నీ ఆపేశారు. ఈ నిరసనలో నారాయణ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణ్‌కాంత్, పలు విభాగాల అధిపతులు సంపత్ కుమార్, కొల్లా ప్రవీణ్‌కుమార్, తిలక్ కుమార్, లక్ష్మీరమేష్, ఏజీఎం శేఖర్‌రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, డాక్టర్ రామచంద్రారెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సుందరయ్య విగ్రహం నుంచి గాంధీబొమ్మ, పొగతోట వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యా చారిని పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇందులో డాక్టర్ దత్తాత్రేయ, ఐద్వా జిల్లా అధ్యక్షు రాలు మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు. అలాగే వెంగళరావ్ పట్టణ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌పీ ఆధ్వర్యంలో వైద్యులు సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు రీనా భారతి, కుసుమ కిరణ్, పటాన్ ఇమ్రాన్, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, కొండా పురం వెంకటేశ్వర్లు, షేక్ రసూల్, శాఖవరపు వేణు గోపాల్, గోరంట్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కావలి, కందు కూరు, ఆత్మకూరు, ఉదయగిరి, అల్లూరు, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, పొదలకూరు తదితర ప్రాంతాల్లోనూ వైద్యులు నిరసన వ్యక్తం చేశారు.



నగరంలోని రామచంద్రారెడ్డి ఆసుపత్రిలో మూతపడిన ఓపీ విభాగం



రాపూరులో వైద్యుల నిరసన



కావలిలో మానవహారం

ఇసుక ఇబ్బందులు రానీయకండి!

జిల్లా యంత్రాంగానికి మంత్రి నారాయణ ఆదేశం

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా వాసులకు ఇసుక ఇబ్బం దులు తలెత్తకుండా త్వరితగతిన డీసిల్టేషన్ పాయింట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి నారాయణ అధికారులను ఆదేశిం చారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి సాండ్ కమిటీ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న మూడు స్టాక్ పాయింట్లలో ఇసుక నిల్వలు తగ్గిపోతున్నందున కొరత ఏర్పడిందన్నారు. వెంటనే జిల్లాలో డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించి వెంటనే ఇసుకను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ డీసిల్టేషన్ పాయింట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్, మైన్స్ డీడీ శ్రీనివాసకుమార్, సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీవో మాలోల తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- కోల్‌కతాలో వైద్యురాలి హత్య అమానుషం
- విధులు బహిష్కరించి వైద్యుల నిరసన ర్యాలీలు

సంగం, ఆగస్టు 17: కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ స్థానిక పీఎంపీ, ఆర్‌ఎంపీ, మందుల దుకాణదారులు నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పీఎంపీ, ఆర్‌ఎంపీ వైద్యు లు జగన్మోహన్, తిరుపతిరెడ్డి, నరసింహులు, మహేష్, బాలకృష్ణ, వాసు పాల్గొన్నారు.


ఆత్మకూరు: ర్యాలీలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో ఉషా సుందరి, వైద్యులు కిరణ్, బాలాజీ, స్టాఫ్ నర్సులు మస్తాన్, ధనకుమారి పాల్గొన్నారు.


ఉదయగిరి: ర్యాలీ చేపడుతున్న వైద్యులు, సిబ్బంది

ఉదయగిరి రూరల్: స్థానిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అనీషా సిబ్బందితో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వైద్యశాల నుంచి మెయిన్‌బజార్, యూనియన్‌రోడ్డుల మీదుగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు శివరాం, క్షయవ్యాధి ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ నవాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక వైద్యాధికారులు, సిబ్బంది పాత బస్టాండ్ సెంటర్ నుంచి బంగ్లా సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మాసిలామణి కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు.

చేజర్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్య అధికారులు, సిబ్బంది వైద్యాధికారి మెహబత్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ బస్టాండు వరకు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించారు. బస్టాండులో ప్రాంతంలో మానవహారం చేపట్టి నినాదాలు చేశారు.

కందుకూరు: పశ్చిమ బెంగాల్లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా కందుకూరులోని ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మెడికల్ సూరింటెండెంట్ ఇంద్రాణి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

వైద్యులకు కావలి ఎమ్మెల్యే సంఘీభావం

కావలి టౌన్: కలకత్తాలో డాక్టర్‌పై హత్యాచారానికి వ్యతిరేకంగా ఐఎంఏ ఆధ్వర్యంలో 24గంటలు వైద్యసేవలు బంద్ చేసి, ప్రభుత్వ ఏరియా వైద్యశాల వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు సుబ్బారావు అధ్యక్షతన జరిగిన శిబిరంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. కార్యక్ర మంలో టీడీపీ నేతలు అలేఖ్య, గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబురావు, రాజ్‌కుమార్ చౌదరి, ఏరియా వైద్యశాల డైరెక్టర్లు చవల రామకృష్ణ, లక్ష్మి, పబ్బాసాయి పాల్గొన్నారు. ఏపీవీవీ డాక్టర్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి రోహిత్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య శాల నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అం దించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. ఉమెన్ ఫోర్స్, జమాతె ఇస్లామీ హింద్ మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరు : స్థానిక వైద్యాధికారులు నిరస న ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతంగా హత్యచేసిన మానవ మృగాలను శిక్షించాలని వైద్యులు జీహారిక డిమాండ్ చేశారు. బోగోలు మండలం కోవూరుపల్లి వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి, పీహెచ్‌సీ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



బిట్రగుంట : సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు జీహారిక



సంగం: పీఎంపీ, ఆర్‌ఎంపీ, మందుల దుకాణాదారుల ర్యాలీ

విద్యాభివృద్ధికి కృషి


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రమౌళీశ్వరరెడ్డి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 17: సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేదపిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తామని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధిజల కేంద్రం, లైబ్రరీకి పుస్తకాలు, ఫర్నిచర్, పెయింటింగ్, ఆధునికీకరించిన డిజిటల్ తరగతి గదులను శనివారం చంద్రమౌళీశ్వరరెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేశారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంగయ్య, హెచ్ఎం నాగలక్ష్మి, విశ్రాంత ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి, సబితారెడ్డి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

చేజర్ల, ఆగస్టు 17: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుంచి మండలంలోని 15గ్రామ సచివాలయాల్లో ఆధార్ కార్డు స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు. 20, 21న పెరుమాళ్లపాడు, మడపల్లి, నెర్నూరు, 22, 23తేదీల్లో యనమదల, చిత్తలూరు, పాతపాడు, 24న మాముడూరు, చేజర్ల, ఆదురుపల్లి సచివాలయాల్లో క్యాంపులు ఉంటాయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొగాకు రహిత సమాజానికి పాటుపడదాం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: పొగాకు రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని మేకపాటి గౌతం రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల నుంచి పట్టణంలోని ప్రధానవీధుల్లో అధ్యాపకులు, విద్యార్థులతో ప్లేకార్డులతో నినాదాలతో చూస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా క్యాన్సర్‌తో మరణిస్తున్న వారిలో 25శాతం మంది పొగాకును వాడే వ్యక్తులు ఉన్నారని తెలిపారు. పొగాకు వాడితే సంతానోత్పత్తి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేష్, వైద్యులు హీన, సీనియర్ ప్రొఫెసర్ పాల్, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

అర్హులందరికీ ట్రై సైకిళ్లు, కృత్రిమ పరికరాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా బ్యా టరీ ట్రై సైకిళ్లు, కృత్రిమ పరికరాలు అందజేయనున్నట్లు శనివారం ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి విశ్వం పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో కలిసి అర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్ర మాలు చేపట్టా మన్నారు. అలాగే జిల్లాలోని ఏడు నియోజకవర్గాలో దివ్యాంగుల్లో అర్హుల ఎం పిక చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లో పూర్తయిందని, ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గంలో ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కరీముల్లా, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు నారాయణ, శివ పాల్గొన్నారు.


వివరాలు సేకరిస్తున్న విశ్వం

వైభవంగా గ్రామోత్సవం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 17: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామస్తులు విగ్రహాల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివార్లకు క్షీర, పుష్ప, ధాన్యాధివాసములు, మంగళహారతి, తదితర పూజలు చేశారు. ఉత్సవాల్లో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని మొక్కులు చెల్లించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

మొగిలిచెర్లలో ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

లింగసముద్రం, ఆగస్టు 17: మండలంలోని మొగిలిచెర్లలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) పాలకవర్గం శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించినవారంతా టీడీపీ మద్దతుదారులేనని గోపాలరావు చెప్పారు. కమిటీ చైర్మన్‌గా మద్దులూరి మల్లికార్జునరావు, వైస్ చైర్మన్‌గా షేక్ అస్మా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు వేముల రామారావు తదితరులు పాల్గొన్నారు.

- పూర్తయిన నేకునాంపేట ఎస్ఎంసీ ఎన్నిక

కొండాపురం: మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎంపిక శనివారం పూర్తయింది. టీడీపీ, జనసేన మధ్య పోటీ నెలకొనడంతో ఎన్నిక ఉత్కంఠగా జరిగింది. చైర్మన్‌గా నలగట్ల నాగేంద్ర, వైస్‌చైర్మన్‌గా పఠాన్ మహబున్నీలను సభ్యులు ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయిని మారుతి వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ఎంఈవో-2 ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- అయ్యవారిపల్లె ఎస్ఎంసీ చైర్మన్‌గా మాలకొండ్రాయుడు

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీయూపీ స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్‌గా మంచాల మాకొండ్రాయుడు, వైస్‌చైర్మన్‌గా తలపల కుమారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు హెచ్ఎం మేడికొండ ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు శనివారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్ఎంసీని హెచ్ఎం, టీచర్లు అభినందించారు.

- మళ్లీ ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా

వరికుంటపాడు : ఈ నెల 8న పాఠశాలలో వాయిదా పడిన పాఠశాలలో తిరిగి శనివారం ఎన్నికలు నిర్వహించారు. అందులో భాగంగా జంగంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో తిరిగి మరోమారు ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎంఈవో షావుద్దీన్ తెలిపారు. అలాగే తూర్పు బోయమడగల ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా మలికి భాగ్యమ్మ, వైస్ చైర్మన్‌గా గొల్లపల్లి విజయమ్మలు ఎన్నికయ్యారు. మహమ్మదాపురం ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా లక్ష్మిశెట్టి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా సీహెచ్ సుబ్బలక్ష్మమ్మ ఎన్నికయ్యారు. అనంతరం నూతన సభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు.


లింగసముద్రం : మొగిలిచెర్లలో ఎస్ఎంసీ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ప్రతిజ్ఞ


వలేటివారిపాలెం : అయ్యవారిపల్లెలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులతో టీచర్లు


వీకే పాడు : తూర్పుబోయమడగలలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు

మాలకొండ ఆదాయం రూ. 18,29,025

వలేటివారిపాలెం, ఆగస్టు 17 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 18,29,025 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ కే.బీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 7,850, కుంకుమార్చన ద్వారా రూ. 29,920, వివాహాల ద్వారా రూ. 12 వేలు, తలనీలాల ద్వారా రూ. 65,400, వాహనపూజల ద్వారా రూ. 6,180, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 4,11,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 500, రూముఅద్దెల ద్వారా రూ. 33,410, కవర్ల ద్వారా రూ. 10,200, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,04,985, అన్నదానం ద్వారా రూ. 10,27,963, విరాళాల ద్వారా రూ. 18,717 ఆదాయం లభించినట్లు తెలిపారు కాగా వలేటివారిపాలెంకి చెందిన వలేటి నాగేశ్వరరావు - ఆదిలక్ష్మి దంపతులు అన్నదానానికి రూ.3,60,000 విరాళం అందజేసినట్లు ఆలయ డీసీ తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

వలేటివారిపాలెం, ఆగస్టు 17: మండలంలోని లింగపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గొర్రెపాటి రాజబాబు శనివారం నోటు పుస్తకాలు, పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజబాబుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, ఆగస్టు 17 : మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి అక్రమంగా పట్టపగలే ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా సమాచారం రావడంతో శనివారం సాయంత్రం 5.30 గంటల సమీపంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది వాగులో ఇసుక నింపుకొని వెళుతున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని డ్రైవర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బాజీబాబు తెలిపారు.అలాగే శనివారం తెల్లవారుజామున మూడు గంటలకు కందుకూరు ఎస్ఈబీ ఎస్ఐ దీప్తికరంత్, సిబ్బంది మన్నేరులో ఇసుక నింపుకొని వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.అనంతరం ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆయన డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

కరేడు జగనన్న కాలనీపై విచారణ జరపాలి

ఉలవపాడు, ఆగస్టు 17 : మండలంలోని కరేడు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో భారీ అక్రమాలు, అవకతవకలు జరిగాయని మాజీ ఎంపీటీసీ మిరియం శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అధికారులు ఈ విషయమై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్లు లేని అర్హులకు ఇళ్ల స్థలాలను కేటాయించకుండా అనర్హులకు పట్టాలు ఇచ్చి నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. అనర్హులైన వలంటీర్లు కూడా అడ్డదారుల్లో ఇళ్ల స్థలాలు పొందారని, వీటన్నింటిపై స్థానిక ఎమ్మెల్యే విచారణకు ఆదేశిస్తే నిజానిజాలు బయటకు వస్తాయని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తీరప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి : ఎమ్మెల్యే కావ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, ఆగస్టు 17 : తీరప్రాంత గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరు మండలం వ్యవసాయంపై ఆధారపడినందున సాగు, తాగునీరు సమృద్ధిగా అందించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను వెంటనే నిర్మించుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో పచ్చిరొట్టపైర్ల విత్తనాలను అందించామని, మరింతమంది రైతులకు సబ్సిడీపై వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం అన్ని శాఖల అధికారుల నివేదికలను ఆయన తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం

కొండాపురం, ఆగస్టు 17: మండలంలోని కుంకవారిపాలెంలో వెలసి ఉన్న మహాలక్ష్మమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని రెండోరోజు శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, పూలంగిసేవ, మాలమంత్రహోమం, లక్ష్మీసహస్రనామ హోమాలను వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను భక్తులకు అందచేశారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


యాగంలో పాల్గొన్న భక్తులు

ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

బిట్రగుంట, ఆగస్టు 17: బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. జువ్వలదిన్నె వడ్డిపాలెం పెనుకొండమ్మ మహిళా కోలాట బృందం వారి నృత్యప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. టీపీ గూడూరు మండలం పేడూరుకు చెందిన ఎం. సురేష్-సునందన దంపతులు అన్నదాన ఉభయ కర్తలుగా వ్యవహరించారు. కాగా ఆలయ ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ ఈనెల 19న శ్రావణపౌర్ణమి సందర్భంగా స్వామివారికి గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా చూడాలి

కావలిటౌన్, ఆగస్టు17: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో గోవిందయ్య పేర్కొన్నారు. 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని శనివారం ఆయన సందర్శించి, మాట్లాడారు. ముఖ్యంగా విద్యార్థులను చెడు అలవాట్లకు ఎలా దూరంగా ఉంచాలి, వాటికి బానిసలు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసారు. 5వ వార్డు పాఠశాలలో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు.

బోగోలులో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లే


బోగోలులో వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్

బిట్రగుంట, ఆగస్టు 17: బోగోలు బజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తున్నది. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదని రైల్వే ఉద్యోగులు పేర్కొన్నారు. మూడోలైన్ ప్రారంభించింది మొదలు రైళ్లు, గూడ్సు బండ్ల కోసం అరగంట నుంచి గంటవరకు ఎల్సీగేట్ 144 వేస్తున్నారని తెలిపారు. విధులకు వెళ్లేందుకు మరోమార్గం లేక పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. మరోవైపు రైల్వే గేటుకు తూర్పున రోడ్డుకు అడ్డంగా ఆటోలు, మోటర్‌సైకిళ్లు పెటడ్డం కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు.

రోడ్డు అడ్డగించి, ఇబ్బందులు పెడుతున్నారు..!

కావలి రూరల్ : ముప్పై అడుగుల రోడ్డును ఆక్రమించి, ఉన్న రహదారిపై కూడా వాహనాలు, రాళ్లు అడ్డంపెట్టి రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని కావలి మండలం తుమ్మలపెంట వాసులు వాపోతున్నారు. తుమ్మలపెంటలోని గురుకుల పాఠశాల ఎదురుగా 30 అడుగుల రోడ్డును, సుమారు 15 అడుగుల మేర ఆక్రమించి గోడకట్టి మొక్కలు నాటారన్నారు. మిగిలిన రోడ్డుకు వాహనాలు, రాళ్లు అడ్డు పెట్టి ఇబ్బందులు పెడుతున్నట్లు స్థానికులు వాపోయారు. ఇదేమని ప్రశ్నిస్తే 'ఇది మారోడ్డు ఇటు రావటానికి వీలులేదు' అంటూ అడ్డుకుంటున్నారని వారు పేర్కొన్నారు. అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా ఉంచిన వాహనాలు, రాళ్లు